అనుదినం... జనస్వరం

నవతెలంగాణ

సమగ్ర తెలుగు దినపత్రిక

గురువారం 13-4-2023



కేరళలోని తిరువనంతపురంలో జరిగిన ఇఫ్తార్ విందులో సీఎం పినరయి విజయన్, ప్రతిపక్ష నేత విడి సతీసన్, స్పీకర్ ఎ.ఎన్. షంసీర్

సంపుటి : 9 సంచిక : 102 | Published from Hyderabad, Rangareddy, Khammam, Karimnagar | www.navatelangana.com | 12 పేజీలు వెల : 6.50



నవతెలంగాణపై స్పందన
ఫోన్ చేయాల్సిన నంబరు : 9490099016

పత్రికకు ప్రజలే మార్గదర్శకులు. నవతెలంగాణలో మీకు నచ్చిన, నచ్చని అంశాలను ఎప్పటికప్పుడు మా దృష్టికి తెస్తే.. పత్రికకు మరింత పదును పెట్టే వీలుంటుంది. ఆదివారం మినహా ప్రతి రోజూ మధ్యాహ్నం 12 నుంచి సాయంత్రం 6 గంటలవరకూ పత్రికపై మీ అభిప్రాయాలను 9490099016కు తెలియచేయవచ్చు. మీరు చెప్పేది స్పష్టంగా, సూటిగా, క్లుప్తంగా ఉండాలి. ఇప్పటికే చాలా మంది పంపుతున్న విమర్శలు, సూచనలు మాకు బాగా ఉపయోగపడుతున్నాయి. వారందరికీ కృతజ్ఞతలు.

అభిప్రాయాలు పంపదలిస్తే మా అడ్రస్ : స్పందన, నవతెలంగాణ తెలుగు డైలీ, ఎం.హెచ్ భవన్, ప్లాట్ నెం.21/1, ఆజామాబాద్, ఆర్టీసీ కళ్యాణమండపం దగ్గర, బాగ్‌లింగంపల్లి, హైదరాబాద్ - 20.

పంజాబ్ సైనిక కేంద్రంలో కాల్పులు

- నలుగురు జవాన్ల మృతి

చండీగఢ్: పంజాబ్‌లోని బటిండా సైనిక కేంద్రంలో బుధవారం జరిగిన కాల్పుల ఘటనలో నలుగురు జవాన్లు ప్రాణాలు కోల్పోయారు. ఈ ఘటన జరిగిన వెంటనే రాష్ట్ర పోలీసులతో కలిసి ఆ ప్రాంతాన్ని దిగ్బంధించామని, కాల్పులకు కారణాలు తెలుసుకుంటున్నామని సైన్యం ఒక ప్రకటనలో తెలిపింది. 'ఇది దురదృష్టకరమైన సంఘటన. కాల్పుల ఘటనలో నలుగురు సైనిక జవాన్లు చనిపోయారు. ఆస్తినష్టం జరిగిన సమాచారం లేదు' అని వివరించింది. రెండు రోజుల క్రితం ఒక తుపాకీ, 28 రౌండ్ల తూటాలు కనిపించకుండా పోయాయని, దానికీ ఈ ఘటనకు ఏదైనా సంబంధం ఉన్నదా అనే విషయాన్ని పరిశీలిస్తున్నామని సైన్యం పేర్కొంది. సైనికులను చంపిన దుండగులను పట్టుకునేందుకు సైన్యం హెలికాప్టర్లు, డ్రోన్లను ఉపయోగిస్తోంది. దేశంలో అతిపెద్ద సైనిక కేంద్రాలలో బటిండా కూడా ఒకటి. కాగా ఇది ఉగ్రవాద దాడి కాదని, సైనిక కేంద్రంలో జరిగిన అంతర్గత పరిణామమని బటిండా సీనియర్ పోలీస్ సూపరింటెండెంట్ గుల్నీత్ సింగ్ ఖురానా చెప్పారు.

ముస్లిం బాలికలను మభ్యపెట్టి... హిందూమతంలోకి తెండి.. : ఆర్ఎస్ఎస్

న్యూఢిల్లీ : ముస్లిం బాలికలను మభ్యపెట్టి, వారిని సనాతన హిందూ మతంలోకి తీసుకొచ్చేందుకు ప్రయత్నించాల్సిందిగా హిందూ సంస్థలను కోరుతూ తాను రాసినట్లు చెబుతున్న లేఖ పూర్తిగా అవాస్తవికమైనదని ఆర్ఎస్ఎస్ వివరణ ఇచ్చింది. ఆర్ఎస్ఎస్ పేరిట ఉన్న ఈ లేఖ సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతోంది. భజరంగ్‌దళ్, హిందూసేన సంస్థలను ఉద్దేశించి ఆర్ఎస్ఎస్ లెటర్‌హెడ్‌పై రాసిన రెండు పేజీల లేఖపై ఆ సంస్థ మీడియా సంబంధాల అధిపతి సునీల్ అంబేద్కర్ వివరణ ఇచ్చారు.

ఎన్‌సీఈఆర్‌టీ పుస్తకాల్లో పాఠ్యాంశాల తొలగింపు వెనక్కి తీసుకోవాలి
ఏఐఏడబ్ల్యూయూ డిమాండ్

న్యూఢిల్లీ : ఎన్‌సీఈఆర్‌టీ చరిత్ర సిలబస్‌లో కేంద్ర ప్రభుత్వం చేసిన మార్పులను ఆల్ ఇండియా అగ్రికల్చరల్ వర్కర్స్ యూనియన్ (ఏఐఏడబ్ల్యూయూ) కేంద్ర వర్కింగ్ కమిటీ ఖండించింది. ఈ మేరకు ఏఐఏడబ్ల్యూయూ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎ.విజయ రాఘవన్, బి.వెంకట్ బుధవారం ఓ ప్రకటన విడుదల చేశారు. ఎన్‌సీఈఆర్‌టీ పుస్తకాల్లో పాఠ్యాంశాల తొలగింపును వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. 'కింగ్స్ అండ్ క్రానికల్స్'కు సంబంధించిన అధ్యాయాలు, అంశాలు మొఘల్ కోర్టులు, 2002 గుజరాత్ అల్లర్లు, కుల వ్యవస్థకు సంబంధించిన అన్ని సూచనలు, నిరసనలు, సామాజిక ఉద్యమాలపై అధ్యాయాలు, మహాత్మా గాంధీని హిందూ తీవ్రవాది గాడ్సే హత్య చేయడం, గాంధీ హత్య తరువాత రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ (ఆర్ఎస్ఎస్)పై విధించిన నిషేధం వంటి ప్రస్తావనలు తొలగించారని తెలిపారు. పదో తరగతికి సంబంధించి నవీకరించబడిన ఎన్‌సీఈఆర్‌టీ పాఠ్యాంశాలు 'డెమోక్రటిక్ పాలిటిక్స్' పాఠ్యపుస్తకం నుంచి 'ప్రజాస్వామ్యం, వైవిధ్యం,' 'ప్రజా పోరాటాలు, ఉద్యమం,' 'ప్రజాస్వామ్యానికి సవాళ్లు' అనే అధ్యాయాలను తొలగించారని అన్నారు. ఇది హిందూ రాష్ట్రానికి సంబంధించిన ఆర్ఎస్ఎస్ ఆలోచనను ప్రోత్సహించడానికి, దేశ బహువచన చరిత్రను తుడిచివేయడానికి చేసిన ప్రయత్నమని విమర్శించారు. ఈ మార్పులతో దేశ చరిత్రలో తమ నేరాలను చెరిపివేయాలని కోరుకుంటోందని ఆరోపించారు. హిందుత్వ శక్తులు పాఠ్యపుస్తకాల నుంచి కులం గురించిన అంశాలను తొలగించడంతో కులం పట్ల తమ నిజమైన విధానాన్ని దాచలేరని పేర్కొన్నారు. ఇది చాలా ఆందోళనకరమైనదనీ, రాజ్యాంగంలో ఊహించిన ప్రజాస్వామ్య, లౌకిక దేశాన్ని విశ్వసించే సమాజంలోని అన్ని వర్గాలు ప్రతిఘటించాలని పిలుపు ఇచ్చారు.

వేసవిలోనే బదిలీలు, పదోన్నతులు చేపట్టాలి

- ఆ దిశగా విద్యాశాఖ చర్యలు చేపట్టాలి : యూఎస్‌పీసీ డిమాండ్

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

వేసవిలోనే ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతులు చేపట్టటానికి విద్యాశాఖ తగిన చర్యలు తీసుకోవాలని ఉపాధ్యాయ సంఘాల పోరాట కమిటీ (యూఎస్‌పీసీ) డిమాండ్ చేసింది. ఈ మేరకు విద్యాశాఖ కార్యదర్శి వాకాటి కరుణ, పాఠశాల విద్యాశాఖ సంచాలకులు శ్రీదేవసేనను బుధవారం యూఎస్‌పీసీ స్టీరింగ్ కమిటీ సభ్యులు కలిశారు. బదిలీలపై హైకోర్టులో నడుస్తున్న కేసు జూన్ 13వ తేదీకి వాయిదా పడటం విచారకరమని తెలిపింది. కేసు వాయిదాను (ఈ నెలాఖరులోగా) ముందుకు జరిపే విధంగా విద్యాశాఖ అధికారులు ప్రయత్నం చేయాలని సూచించింది. తద్వారా వేసవి సెలవుల్లోనే బదిలీలు, పదోన్నతులు జరిగేటందుకు చర్యలు తీసుకోవాలని పేర్కొంది. ఒకవేళ అది సాధ్యం కాని పక్షంలో తాత్కాలిక ప్రాతిపదికన పదోన్నతులు అయినా కల్పించాలని కోరింది. ఎనిమిదేండ్లుగా పదోన్నతుల్లేక అర్హులైన ఉపాధ్యాయులు నష్టపోతున్నారని ఆందోళన వ్యక్తం చేసింది. పాఠశాలల్లో ఖాళీల వల్ల విద్యార్థులకు నష్టం జరుగుతున్నదని తెలిపింది. పదోన్నతులు ఇస్తేనే నియామకాల ఖాళీలపై స్పష్టత వస్తుందని పేర్కొంది. వేసవి సెలవుల్లో బదిలీలు, పదోన్నతులు పూర్తి చేసి ప్రత్యక్ష నియామకాలకు నోటిఫికేషన్ ఇవ్వాలని డిమాండ్ చేసింది.

వర్సిటీల్లో పెంచిన పరీక్ష ఫీజులను తగ్గించాలి : ఎస్ఎఫ్ఐ

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలోని కాకతీయ, శాతవాహన, ఉస్మానియా, పాలమూరు, జేఎన్టీయూహెచ్ తదితర ప్రభుత్వ విశ్వవిద్యాలయాల్లో పెంచిన పరీక్ష ఫీజులు, నాన్ సెమిస్టర్ బ్యాక్ లాగ్ పరీక్ష ఫీజులు, ప్రస్తుతం రాస్తున్న సెమిస్టర్ ఫీజులను తగ్గించాలని భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్ఎఫ్ఐ) రాష్ట్ర కమిటీ డిమాండ్ చేసింది. ఈ మేరకు ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షులు ఆర్ఎల్ మూర్తి, కార్యదర్శి టి నాగరాజు బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. విశ్వవిద్యాలయాలు అదనపు ఆదాయం కోసం ప్రయివేటు విద్యాసంస్థల కంటే దారుణంగా ఫీజులు పెంచుతున్నాయని విమర్శించారు. సెమిస్టర్ ఫీజులు ఒక్కోసారి ఒక్కోలా పెంచుతూ ఫీజుల భారాన్ని విద్యార్థులపై రుద్దుతున్నారని తెలిపారు. కేయూ, ఓయూలో ఈ సంవత్సరం భారీగా ఫీజులను పెంచారని పేర్కొన్నారు. ఓయూలో పీహెచ్‌డీ ఫీజులు, కేయూలో బ్యాక్‌లాగ్ పరీక్షల ఫీజులు, ఇతర విశ్వవిద్యాలయాల్లో ఫీజులు పెంచారని వివరించారు. ప్రభుత్వం బడ్జెట్లో నిధులు ఇవ్వకపోవడం మూలంగా ఆ భారాలను ఫీజులను పెంచి విద్యార్థులపై మోపుతున్నారని తెలిపారు. ట్యూషన్ ఫీజులు ప్రభుత్వం ఇవ్వకుంటే వాటిని కూడా విద్యార్థుల నుంచి వసూలు చేస్తున్నారని పేర్కొన్నారు. ఇటీవల కేయూ నాన్ సెమిస్టర్ బ్యాక్‌లాగ్ పరీక్షల ఫీజుల ద్వారా రూ.67 కోట్లు వసూళ్లు చేసిందని వివరించారు. ఓయూ కూడా ఇలాగే వసూళ్లు చేసిందని తెలిపారు. విశ్వవిద్యాలయాల్లో పెంచిన అన్ని రకాల ఫీజులను తక్షణమే తగ్గించాలని డిమాండ్ చేశారు. లేకుంటే విశ్వవిద్యాలయాల ముందు ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు.

ఆత్మీయ సమ్మేళనంలో అపశృతి

(మొదటిపేజీ తరువాయి)

ఖమ్మం జిల్లా కారేపల్లి మండలం చీమలపాడులో బుధవారం ఏర్పాటు చేసిన బీఆర్ఎస్ ఆత్మీయ సమ్మేళనానికి హాజరవుతుం డటంతో కార్యకర్తలు టపాసులు, బాణసంచా కాల్చారు. ఓ బాణసంచా ఎగిరి సమీపంలోని ఓ గుడిసెపై పడింది. ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. సభకు వచ్చిన వారు, పోలీసులు కలిసికట్టుగా మంటలు ఆర్పే పనిలో పడ్డారు. మంటలు అదుపులోకి రావడంతో సభ ప్రారంభిద్దామని ఎంపీ, ఎమ్మెల్యే, ఇతర నాయకులు వేదికపైకి చేరారు. ఇంతలోనే భారీ విస్ఫోటనం. ఓవైపు ఎండ, మరోవైపు గుడిసెలో ఉన్న గ్యాస్ సిలిండర్ మంటలతో పేలింది. దాని అడుగుభాగం పూర్తిగా దెబ్బతింది. తునాతునకలైన బండ రేకులతో, సిలిండర్ వంద మీటర్ల మేర తారా జువ్వలా దూసుకెళ్లింది. సమీపంలో ఉన్నవారికి రేకుముక్కలు తగలటంతో శరీరవ-యాలు తెగిపోయాయి. కొందరి పాదలు మొదలు నడుం వరకు, కాళ్లు ఎక్కడికక్కడ ముక్కలయ్యాయి.

నలుగురు మృతి.. ఒకరి పరిస్థితి విషమం

ఈ ఘటనలో చీమలపాడుకు చెందిన అజ్మీర మంగు (42), స్టేషన్ చీమలపాడుకు చెందిన బాణోత్ రమేష్(37)కు తీవ్రంగా గాయాలయ్యాయి. వీరితో పాటు మరో ఆరుగురికి కాళ్లు తీవ్రంగా దెబ్బతినడంతో హుటాహుటిన ఖమ్మం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మార్గమధ్యలో అజ్మీర మంగు మృతిచెందగా.. బాణోత్ రమేష్ ఆస్పత్రికి చేరిన కొద్దిసేపటికి మృతి చెందారు. మహారాష్ట్రకు చెందిన వలస కూలి సందీప్(35) రెండు కాళ్లు తెగిపోయాయి. ఎడుమకాలు పూర్తిగా తెగిపోగా.. మరో కాలు ఛిద్రం అయింది. కాలులో నరాలు కట్ కాలేదని, కోలుకునే అవకాశం ఉందని వైద్యులు చెబుతున్నారు. మరో నలుగురి పరిస్థితి ఆందోళనకరంగా ఉండటంతో బుధవారం రాత్రి హైదరాబాద్ తరలించారు. వీరిలో గేటు కారేపల్లికి చెందిన ధర్మసోత్ లక్ష్మణ్, తడికలపూడికి వాసి తేజావత్ భాస్కర్ (35) పరిస్థితి మరింత విషమంగా ఉందని, కాళ్లలో నరాలు పూర్తిగా కట్ కావడంతో రక్తస్రావం ఏమాత్రం ఆగడంలేదని, అందుకే హైదరాబాద్ తరలించినట్టు వైద్యులు తెలిపారు. కాగా, మార్గమధ్యలో లక్ష్మణ్ (55) మృతి చెందాడు. వెంకిట్యాతండాకు చెందిన విలేకరి అంగోత్ కుమార్ ఎడమకాలు తెగింది. సీఐ కారు డ్రైవర్ నవీన్ కాళ్లు పూర్తిగా దెబ్బతిన్నాయి. ప్రమాదంలో ముగ్గురు చనిపోయినట్టు సీపీ విష్ణు ఎస్ వారియర్ ధ్రువీకరించారు. బుధవారం మధ్యాహ్నం ఆయన ఆస్పత్రిలోని క్షతగాత్రులను పరామర్శించారు. ప్రమాదంలో గాయపడిన ఆరుగురికి వైద్యమందిస్తున్నట్టు చెప్పారు.

ఘటనాస్థలిలో రక్తపుటేరులు..

గ్యాస్ సిలిండర్ పేలిన ఘటనాస్థలిలో రక్తపుటేరులు పారాయి. తెగిపడిన శరీరావయాలతో ఆ ప్రాంతం రక్తపు ముద్దలతో నిండిపోయింది. తీవ్రమైన బాంబు విస్ఫోటనాన్ని తలపించేలా రక్తసిక్తంగా మారింది. వేగంగా దూసుకొచ్చిన గ్యాస్ సిలిండర్ ఇనుప రేకులు కాళ్లు, కడుపుల్లోకి దిగడంతో శరీరావయాలు ఎక్కడికక్కడ తెగిపడ్డాయి. ఓ విలేకరి కాలు పాదం తెగిపోయి ఘటనాస్థలిలో కనిపించింది. యుద్ధభూమిని తలపించేలా ఉన్న ఈ భయానక వాతావరణాన్ని ప్రత్యక్షంగా చూసిన ప్రతి ఒక్కరూ తీవ్ర భయాందోళనకు గురయ్యారు. కుటుంబ సభ్యులకు ఈ విషయం తెలియడంతో హుటాహుటిన ఘటనాస్థలికి చేరుకున్నారు. క్షతగ్రాతులను ఖమ్మం జిల్లా కేంద్ర ఆస్పత్రికి తీసుకెళ్తుండటంతో తమ కుటుంబ సభ్యుల కోసం ఆర్తనాదాలు చేశారు. వారి వెంటే జిల్లా కేంద్ర ఆస్పత్రికి చేరిన కుటుంబసభ్యులు, బంధువుల రోదనలతో ఆస్పత్రి వాతావరణం హృదయవిదారకంగా మారింది. భాస్కర్ భార్య కన్నీరుమున్నీరై విలపిస్తూ తనకు నాలుగేండ్ల కుమారుడని, నా భర్త చనిపోతే నేను కూడా ఇక్కడే చచ్చిపోతానని కన్నీరుమున్నీరై విలపిస్తుండటంతో అక్కడున్న వారు చలించిపోయారు.

కాన్వాయ్‌లోనే జిల్లా కేంద్ర ఆస్పత్రికి...

ఊహించని ఘటన చోటుచేసుకోవడంతో సభా వేదిక పైనున్న ఎంపీ నామ నాగేశ్వరరావు, ఎమ్మెల్యే రాములునాయక్, ఇతర నాయకులు సభా స్థలికి అతి సమీపంలో సిలిండర్ పేలిన చోటికి వచ్చారు. కొంతసేపు భయాందోళనకు లోనైనా.. వెంటనే పోలీసు, కార్యకర్తల సహాయంతో క్షతగాత్రులను తమ కాన్వాయ్‌లోనే జిల్లా కేంద్ర ఆస్పత్రికి తరలించారు. అక్కడ వైద్యసేవలు వెంటనే అందేలా డాక్టర్లను అప్రమత్తం చేశారు.

మంత్రి కేటీఆర్ ఫోన్... మృతులకు 10 లక్షలు ఎక్స్‌గ్రేషియా

మేరకు పార్టీ ఖమ్మం జిల్లా కార్యాలయంలో బుధవారం సాయంత్రం విలేకరుల సమావేశం ఏర్పాటు చేసిన ఎంపీ నామ, ఎమ్మెల్యే రాములునాయక్, పార్టీ జిల్లా అధ్యక్షులు తాతా మధుసూదన్ మాట్లాడారు. ఆత్మీయ సమ్మేళనంలో చోటు చేసుకున్న ఈ ఘటన పట్ల తమ అధినేతలు దిగ్భ్రాంతి వ్యక్తం చేసినట్టు తెలిపారు. మృతుల కుటుంబాలకు పార్టీ తరపున రూ.10 లక్షల ఎక్స్‌గ్రేషియా, క్షత గాత్రులకు రూ.2 లక్షల చొప్పున ఆర్థిక సహాయం అందిస్తున్నట్టు ప్రకటించారు. అలాగే నామ ముత్తయ్య ట్రస్టు తరపున మృతుల కుటుంబాలకు రూ.2లక్షలు, క్షతగాత్రులకు రూ.50వేల పరిహారాన్ని ఎంపీ నామ ప్రకటించారు. విలేకరుల సమావేశం ముగిసిన అనంతరం వైరా ఎమ్మెల్యే రాములునాయక్ మృ తుల కుటుంబాలకు రూ.2లక్షలు, క్షతగ్రాతు లకు రూ.లక్ష చొప్పున ఆర్థికసహాయం ప్రకటించారు. మూడు రోజులు సంతాపదినాలు ప్రకటించారు.

మృతుల కుటుంబాలను ఆదుకోవాలి: సీపీఐ(ఎం)

మృతుల కుటుంబాలను ఆదుకోవాలని సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు డిమాండ్ చేశారు. ఈ ఘటన విషయం తెలిసిన వెంటనే నున్నా నాగేశ్వరరావు, నాయకులు.. ఖమ్మం జిల్లా కేంద్ర ప్రభుత్వ ఆస్పత్రిలో ఉన్న క్షతగాత్రులను పరామర్శించారు. స్పృహలో ఉన్నవారికి ధైర్యం చెప్పారు. మెరుగైన వైద్య సేవలు అందించాలని డాక్టర్లకు సూచించారు. ప్రాణాపాయ స్థితిలో ఉన్న వారిని అవసరమైతే హైదరాబాద్ తరలించాలని కోరారు. మృతులు, క్షతగాత్రుల కుటుంబాలను ఓదార్చారు. ఘటనలో మృతి చెందిన వారి కుటుంబాలకు రూ. కోటి ఎక్స్ గ్రేషియా చెల్లించాలని, కాళ్లు తెగిన వారికి రూ.50 లక్షలు, తీవ్రంగా గాయపడిన వారికి రూ.20 లక్షలు చొప్పున పరిహారం అందించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

మన సీఎంలు సంపన్నులే..



న్యూఢిల్లీ : భారత్‌లోని వివిధ రాష్ట్రాలకు చెందిన 30 మంది ముఖ్యమంత్రుల్లో 29 మంది కోటీశ్వరులే ఉన్నారు. వీరి సగటు సంపద రూ. 33.96 కోట్లుగా ఉన్నది. రూ. 510 కోట్ల విలువైన ఆస్తులతో ఏపీ సీఎం వై.ఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మొదటి స్థానంలో ఉన్నారు. రూ. 15 లక్షల సంపదతో పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ చివరి స్థానంలో ఉన్నారు. ఎన్నికలలో భాగంగా ఆయా రాష్ట్రాల ముఖ్యమంత్రులు సమర్పించిన పోల్ అఫిడవిట్‌లను అసోసియేషన్ ఫర్ డెమోక్రాటిక్ రీఫార్మ్స్ (ఏడీఆర్) విశ్లేషించి సమాచారాన్ని రూపొందించింది.

ఏడీఆర్, ఎలక్షన్ వాచ్ డాగ్ (ఎన్ఈడబ్ల్యూ) సంయుక్తంగా విడుదల చేసిన నివేదిక సమాచారం ప్రకారం.. భారత్‌లో మొత్తం 28 రాష్ట్రాలు, రెండు కేంద్రపాలిత ప్రాంతాల (ఢిల్లీ, పుదుచ్చేరి)కు మొత్తం 30 మంది ముఖ్యమంత్రులున్నారు. ఈ 30 మంది సీఎంలలో 29 మంది (97 శాతం మంది) సగటు ఆస్తి విలువ రూ. 33.96 కోట్లుగా ఉన్నది. టాప్ 3 స్థానాల్లో ఏపీ సీఎం వైఎస్ జగన్ (రూ. 510 కోట్లు), బీజేపీకి చెందిన అరుణాచల్ ప్రదేశ్ సీఎం పెమా ఖండూ (రూ. 163 కోట్లు), ఒడిశా ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్ (రూ. 63 కోట్లకు పైగా) ఉన్నారు. తెలంగాణ సీఎం కేసీఆర్ వద్ద 23.55 కోట్లు ఆస్తి ఉన్నది.

ఆ ముగ్గురి ఆస్తులు తక్కువ

తక్కువ ఆస్తులను కలిగి ఉన్న ముఖ్యమంత్రుల్లో మమతా బెనర్జీ (రూ. 15 లక్షలకు పైగా) మొదటి స్థానంలో ఉన్నారు. ఆ తర్వాతి స్థానాల్లో కేరళ సీఎం పినరయి విజయన్ (రూ. 1 కోటికి పైగా), హర్యానా ముఖ్యమంత్రి మనోహర్‌లాల్ (రూ. 1 కోటికి పైగా) లు ఉన్నారు. ఇక బీహార్ సీఎం నితీశ్ కుమార్, ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్‌ల ఆస్తుల విలువ ఒక్కొక్కరికి రూ. 3 కోట్లకు పైగా ఉన్నాయి. ముఖ్యమంత్రుల్లో పలువురిపై నేరపూరిత కేసులు కూడా ఉన్నాయి. 13 మందిపై తీవ్రమైన నేరపూరిత కేసులు (హత్య, హత్యాయత్నం, కిడ్నాప్, క్రిమినల్ ఇంటిమిడేషన్) ఉన్నాయి.

కమ్యూనిస్టు సైద్ధాంతిక యోధుడు మాకినేని

సీపీఐ(ఎం) కేంద్ర కమిటీ సభ్యులు జి నాగయ్య • హైదరాబాద్‌లో ఎంబీ వర్ధంతి కార్యక్రమం

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

కమ్యూనిస్టు ఉద్యమానికి సైద్ధాంతిక యోధుడు మాకినేని బసవపున్నయ్య (ఎంబీ) అని సీపీఐ(ఎం) కేంద్ర కమిటీ సభ్యులు జి నాగయ్య అన్నారు. సీపీఐ(ఎం) మాజీ పొలిట్‌బ్యూరో సభ్యులు ఎంబీ 31వ వర్ధంతి కార్యక్రమం బుధవారం హైదరాబాద్‌లోని ఆ పార్టీ రాష్ట్ర కార్యాలయం ఎంబీ భవన్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా నాగయ్య మాట్లాడుతూ తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటంలో ఆయన పాల్గొన్నారని చెప్పారు. కమ్యూనిస్టు ఉద్యమాన్ని జిల్లా స్థాయి నుంచి నిర్మించడంలో విశేష కృషి చేశారని అన్నారు. గుంటూరు జిల్లా కార్యదర్శిగా ఉండి వ్యవసాయ కార్మిక సంఘం, విద్యార్థి ఉద్యమాలను బలోపేతం చేశారని వివరించారు. ఆయన ఆస్తులను కమ్యూనిస్టు పార్టీకి ఇచ్చారని చెప్పారు. కమ్యూనిస్టు ఉద్యమంలో అనేక ఆటుపోట్లు వచ్చినపుడు మార్క్సిస్టు, లెనినిస్టు సిద్ధాంతాన్ని భారతదేశ నిర్దిష్ట పరిస్థితులకనుగుణంగా ముందుకు తీసుకెళ్లడంలో సైద్ధాంతిక కృషి చేశారని చెప్పారు. సీపీఐ, సీపీఐ(ఎం) విడిపోయినప్పుడు, నక్సలైట్ల ఉద్యమం ఆవిర్భవించినప్పుడు, చైనాలో అతివాద పోకడలకు వ్యతిరేకంగా పార్టీ శ్రేణులకు అవగాహన కల్పించారని అన్నారు. సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు ఎస్ వీరయ్య మాట్లాడుతూ బసవపున్నయ్య, పుచ్చలపల్లి సుందరయ్య అంటే బాటలో నడిస్తేనే కమ్యూనిస్టు ఉద్యమాన్ని ముందుకు తీసుకుపోగలమని విశ్వాసం వ్యక్తం చేశారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం, బూర్జువా పార్టీలు అధికారంలో ఉన్న చోట సరళీకృత ఆర్థిక విధానాలను అమలు చేస్తున్నాయని అన్నారు. మోడీ ప్రభుత్వం మతాన్ని రాజకీయాలకు వాడుకుంటున్నదని చెప్పారు. రాష్ట్రంలో 50 కేంద్రాల్లో ఇండ్లు, ఇండ్ల స్థలాల పోరాటం సాగుతున్నదని వివరించారు. ఇంకోవైపు కనీస వేతనాల కోసం కార్మికుల్లో కదలిక వచ్చిందన్నారు. సంస్కరణవాద ధోరణులకు వ్యతిరేకంగా ఉద్యమించాలని చెప్పారు. పార్లమెంటరీ తత్వంపై రాజీలేకుండా పోరాడకుండా, స్వీయ మానసిక ధోరణులకు వదిలించుకోకుండా కమ్యూనిస్టు ఉద్యమం ముందుకుపోదన్నారు. ఈ కార్యక్రమంలో ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు డిజి నరసింహారావు, సీనియర్ నాయకులు సారంపల్లి మల్లారెడ్డి, రాష్ట్ర కమిటీ సభ్యులు ఆర్ శ్రీరాం నాయక్, ఎం శ్రీనివాస్, ఆర్ వెంకట్రాములు, జె బాబురావు, బుర్రి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

యురేనియం తవ్వకాల పేరుతో అదానీకి అప్పగించే కుట్ర

- బీజేపీ ఎంపీ లక్ష్మణ్ వ్యాఖ్యలను వెనక్కి తీసుకోవాలి
- డీవైఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి ఆనగంటి వెంకటేశ్ డిమాండ్

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్



యురేనియం తవ్వకాల పేరుతో అదానీకి నల్లమల ప్రాంతాన్ని అప్పగించే కుట్ర జరుగుతున్నదని భారత ప్రజాతంత్ర యువజన సమాఖ్య (డీవైఎఫ్ఐ) రాష్ట్ర కార్యదర్శి ఆనగంటి వెంకటేశ్ విమర్శించారు. నల్లమల్ల ప్రాంతంలో యురేనియం తవ్వకాలకు రాష్ట్ర ప్రభుత్వం అనుమతి ఇవ్వాలంటూ బీజేపీ ఎంపీ కె లక్ష్మణ్ వ్యాఖ్యానించడం తెలంగాణ ప్రజలను అవమానించడమేనని, ఆ వ్యాఖ్యలను వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. బుధవారం హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞానకేంద్రంలో డీవైఎఫ్ఐ హైదరాబాద్ జిల్లా కార్యకర్తల సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆనగంటి వెంకటేశ్, డీవైఎఫ్ఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి జావేద్ మాట్లాడుతూ యురేనియం తవ్వకాల పేరుతో మొత్తం నల్లమల్ల ప్రాంతాన్ని అదానీకి అప్పగించే చర్యలు కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం చేపట్టిందని విమర్శించారు. అందులో భాగంగానే లక్ష్మణ్ ఆ వ్యాఖ్యలు చేశారని చెప్పారు. పచ్చని తెలంగాణను యురేనియం తవ్వకాల పేరుతో నాశనం చేసేందుకు పూనుకున్నారని విమర్శించారు. గతంలోనే నల్లమల ప్రాంతంలో యురేనియం తవ్వకాలను చేపట్టాలంటూ ఆ ప్రాంతంలో సర్వే చేపట్టారని గుర్తు చేశారు. డీవైఎఫ్ఐ అధ్వర్యంలో నల్లమలను రక్షించుకుందాం ప్రజల ప్రాణాలను కాపాడుకుందాం అంటూ అనేక పోరాట కార్యక్రమాలు నిర్వహించామని వివరించారు. యురేనియం తవ్వకాలను చేపట్టకుండా నల్లమలను రక్షించుకున్నామని అన్నారు. రాజ్యసభ సభ్యునిగా ఉన్న తెలంగాణకు చెందిన బీజేపీ ఎంపీ లక్ష్మణ్ నల్లమలను యురేనియం తవ్వకాలతో నాశనం చేయడానికి ప్రయత్నాలు చేపట్టడం సిగ్గుచేటని విమర్శించారు. లక్ష్మణ్ తన వ్యాఖ్యలు వెనక్కి తీసుకుని తెలంగాణ ప్రజలకు బహిరంగ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. సమస్త జీవులకు, పచ్చని అడవికి నష్టం కలిగించే యురేనియం తవ్వకాలను అడ్డుకుంటామని నల్లమలను రక్షించుకునేందుకు పోరాటాలు నిర్వహిస్తామని అన్నారు. ఈ సమావేశంలో డీవైఎఫ్ఐ నాయకులు హస్మీ, అజయ్, హరిలాల్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

ఆస్కీలో ఇఫ్తార్

నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో



రంజాన్ మాసాన్ని పురస్కరించుకొని అడ్మినిస్ట్రేటివ్ స్టాఫ్ కాలేజ్ ఆఫ్ ఇండియా (ఆస్కీ)లో బుధవారం ఇఫ్తార్ విందు నిర్వహించారు. పలువురు అధ్యాపకులు, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు. ఆస్కీ చైర్మెన్ కే పద్మనాభయ్య ముఖ్య అతిథిగా హాజరయ్యారు. వైస్ చైర్మెన్ రిచర్డ్ కె సల్దాన్హా, డైరెక్టర్ జనరల్ డాక్టర్ నిర్మల్య బాగ్చి, డీన్ డాక్టర్ వల్లి మాణికం తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పద్మనాభయ్య మాట్లాడుతూ మత సామరస్యం, శాంతి సహనాల అవశ్యకత ప్రాధాన్యతల్ని వివరించారు. ఆస్కీ వర్కర్స్ యూనియన్ నాయకులు హసన్, హరిహరన్, ఆజం మొయినుద్దీన్, అబ్దుల్ అజీజ్, మహ్మద్, అష్ఫాక్ అహ్మద్, సయ్యద్ ఇక్బాల్, మహ్మద్ మొయిన్, ఎండీ సాబేర్, ఇస్మాయిల్ అలీ తదితరులు పాల్గొన్నారు.

బొమ్మగాని కుటుంబం అంటేనే కమ్యూనిస్టు కుటుంబం

- వెంకటయ్య భౌతికకాయానికి చాడ, సీపీఐ నాయకుల నివాళి

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

బొమ్మగాని కుటుంబం అంటేనే కమ్యూనిస్టు కుటుంబంగా మారిందని పలువురు వక్తలు అభిప్రాయపడ్డారు. కమ్యూనిస్టు పార్టీ సీనియర్ నాయకులు, స్వాతంత్ర్య సమరయోధులు బొమ్మగాని వెంకటయ్య ఆనాటి నైజాం రాక్షస పాలనకు వ్యతిరేకంగా అనేక ఉద్యమాల్లో పాల్గొన్నారని చెప్పారు. ఆయన మంగళవారం రాత్రి మరణించిన విషయం తెలిసిందే. హైదరాబాద్‌లోని ఎల్బీ నగర్‌లో ఆయన రెండో కుమారుని నివాసంలో వెంకటయ్య భౌతికకాయాన్ని ఉంచారు. సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యులు చాడ వెంకటరెడ్డి, రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు పల్లా వెంకటరెడ్డి, ప్రజాపక్షం సంపాదకులు కె శ్రీనివాస్‌రెడ్డి, సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఆందోజు రవీంద్రచారి, పల్లా నరసింహారెడ్డి, బొమ్మగాని ప్రభాకర్, ఏఐటీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్ బాలరాజ్, గిరిజన సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రమావత్ అంజయ్యనాయక్, సీపీఐ సీనియర్ నాయకుడు ఉజ్జిని రత్నాకర్, ఇప్సో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కేవీఎల్, ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పుట్ట లక్ష్మణ్ బొమ్మగాని వెంకటయ్య పార్థివ దేహంపైన 'ఎర్ర జెండా'ను కప్పి, పూలమాలతో నివాళులర్పించారు. సెంట్రల్ అడ్మినిస్ట్రేటివ్ ట్రిబ్యునల్ మాజీ సభ్యులు, రిటైర్డ్ న్యాయమూర్తి ఎం కాంతయ్య, ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి నందూరి కరుణాకుమారి, పలువురు సీపీఐ నాయకులు నివాళులర్పించారు. అనంతరం బొమ్మగాని వెంకటయ్య భౌతికకాయాన్ని ఆయన స్వగ్రామమైన సూర్యాపేటకు తరలించారు.

నిరాడంబరుడు బొమ్మగాని వెంకటయ్య : చాడ

బొమ్మగాని వెంకటయ్య నిరాడంబరుడని, ప్రజల కష్టాలనుచూసి సహించలేక అనేక ఉద్యమాలు చేశారని, స్వయంగా దళంలో పాల్గొన్నారని సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యులు చాడ వెంకటరెడ్డి అన్నారు. ఆయన నిండు నూరేళ్లు బతికిన నిరాడంబరుడని, ఉక్కుమనిషి అని కొనియాడారు. ఆయన చిన్నప్పుడే ఎర్రజెండా పట్ల ఆకర్షితులై ఆనాటి నైజాం రాక్షస రాజ్యం దౌర్జన్యాలకు వ్యతిరేకంగా, భూస్వాములు, వెట్టి చాకిరి, బానిసత్వానికి వ్యతిరేకంగా తన అన్న బొమ్మగాని ధర్మభిక్షంతో కలిసి అనేక ఉద్యమాల్లో పాల్గొన్నారని గుర్తు చేశారు.

టీఎస్‌పీఎస్సీ పేపర్ లీక్ కేసులో ఇద్దరు నిందితులను కస్టడీకి కోరిన ఈడీ

- నేడు కోర్టు నిర్ణయం

నవతెలంగాణ - ప్రత్యేకప్రతినిధి

రాష్ట్రంలో సంచలనం రేపిన టీఎస్‌పీఎస్సీ కేసులో దర్యాప్తునకు రంగంలోకి దిగిన ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) అధికారులు ఇద్దరు నిందితులను విచారణ కోసం కస్టడీకి ఇవ్వాలని బుధవారం నాంపల్లి కోర్టును ఆశ్రయించారు. ఈ కేసులో నిందితులైన ప్రవీణ్ కుమార్, రాజశేఖర్‌లను విచారించడానికి ఈడీ సిద్ధమైంది. ఈ నేపథ్యంలో వీరి కస్టడీపై నిర్ణయాన్ని గురువారానికి కోర్టు వాయిదా వేసింది. టీఎస్‌పీఎస్సీ చైర్మెన్ జనార్దన్‌రెడ్డికి ప్రవీణ్ పీఏ కాగా.. రాజశేఖర్ కంప్యూటర్ సర్వీసుల నిర్వహణకు ఔట్‌సోర్సింగ్ ఉద్యోగిగా పని చేస్తున్నాడు. వీరిద్దరినిప్పటికే టీఎస్‌పీఎస్సీ పేపర్ లీక్ కేసును దర్యాప్తు చేస్తున్న నగర సిట్ పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించిన విషయం విదితమే. ఇదిలా ఉంటే, ఇదే కేసుకు సంబంధించి టీఎస్పీఎస్సీలో కాన్ఫిడెన్షియల్ సెక్షన్‌కు ఇంచార్జీగా ఉన్న శంకరలక్ష్మితో పాటు ఇదే శాఖలోని అడ్మిన్ సూపరింటెండెంట్ సత్యనారాయణలు కూడా తమ ఎదుట విచారణకు హాజరు కావాలని ఈడీ ఇప్పటికే నోటీసులు జారీ చేసింది. మరోవైపు, ఈ కేసులో ఇప్పటి వరకు సిట్ జరిపిన దర్యాప్తు అంశాలకు సంబంధించిన పత్రాలను తమకు సమర్పించాలని ఈడీ కోర్టును కోరింది. కాగా టీఎస్పీఎస్సీకి చెందిన పరీక్షలను విదేశాల నుంచి వచ్చిన కొందరు అభ్యర్థులు కూడా రాశారని, జరిగిన పేపర్ లీక్‌కు సంబంధించి వారు కూడా భారీ మొత్తంలో ముడుపులు చెల్లించారని, ఆ సందర్భంగా పెద్ద ఎత్తున మనీలాండరింగ్ జరిగిందన్న కోణంలో ఈడీ అధికారులు దృష్టిని సారించి దర్యాప్తును జరుపుతున్నారు.

నేరస్థుల పట్టివేతలో ఫింగర్‌ప్రింట్స్ బ్యూరో పాత్ర కీలకం

- ఎఫ్‌పీబీ అధికారులతో వీడియో కాన్ఫరెన్సులో డీజీపీ

నవతెలంగాణ-ప్రత్యేక ప్రతినిధి

వివిధ నేరాలకు సంబంధించి నేరస్థులను గుర్తించి పట్టుకోవడానికి పోలీసు వేలి ముద్రల విభాగం (ఎఫ్‌పీబీ) అత్యంత కీలకమైందని రాష్ట్ర డీజీపీ అంజనీ కుమార్ అన్నారు. రాష్ట్రంలో తొలిసారిగా బుధవారం అన్ని జిల్లాలకు చెందిన ఫింగర్‌ప్రింట్స్ బ్యూరో అధికారులతో డీజీపీ వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. దోపిడీలు, దొంగతనాలు, హత్యలు, తదిత నేరాలు జరిగిన సమయంలో ఘటనా స్థలం నుంచి క్లూస్ టీం సేకరించే నేరస్థులకు సంబంధించిన వేలి ముద్రలు దర్యాప్తునకు ఎంతగానో ఉపయోగపడతాయని ఆయన అన్నారు. ముఖ్యంగా, వేలిముద్రల ఆధారంగా నిందితులను గుర్తించి పట్టుకోవడం, ఇదే వేలి ముద్రల ఆధారంగా కోర్టులలో నేరస్థులకు శిక్షలను సారించడం చాలా కేసుల్లో సులువవుతున్నదని అంజనీ కుమార్ తెలిపారు. అంతర్రాష్ట్రాలకు చెందిన నేరస్థుల వేలి ముద్రలను సేకరించి భద్రపర్చడం వలన నేరాలు జరిపి పారిపోయినవారు దేశంలో ఎక్కడున్నా గుర్తించడానికి వీలవుతున్నదని అన్నారు. త్వరలోనే మరో ఆరు కొత్త క్లూస్ టీంలను ఏర్పాటు చేయబోతున్నామని ఆయన ప్రకటించారు. సీఐడీ అదనపు డీజీ మహేశ్ భగవత్ మాట్లాడుతూ.. దర్యాప్తు అధికారులకు నేర పరిశోధనలో ఎఫ్‌పీబీ గుండెకాయగా మారుతున్నదని ప్రశంసించారు. ప్రతి ఏటా ఐదు అత్యుత్తమ ఫింగర్ ప్రింట్ బ్యూరోలను ఎంపిక చేసి అవార్డులను ప్రదానం చేస్తామని ప్రకటించారు. ఈ కార్యక్రమంలో పలువురు సీనియర్ పోలీసు అధికారులు పాల్గొన్నారు.



కమ్యూనిస్టు సైద్ధాంతిక యోధుడు మాకినేని

- సీపీఐ(ఎం) కేంద్ర కమిటీ సభ్యులు జి నాగయ్య
- హైదరాబాద్‌లో ఎంబీ వర్ధంతి కార్యక్రమం

వివరాలు 2లో..

అనుదినం... జనస్వరం

నవతెలంగాణ

గురువారం 13-4-2023 సమగ్ర తెలుగు దినపత్రిక

ఏకపక్షంగా నివేదిక!

- అభ్యంతరాలు నమోదు చేయలేదు
- ఓ వ్యక్తికి అనుకూలంగా సాక్ష్యాలు
- రెజ్లింగ్ సమాఖ్య విచారణ కమిటీ సభ్యుడు



వివరాలు 12లో

సంపుటి : 9 సంచిక : 102 | Published from Hyderabad, Rangareddy, Khammam, Karimnagar | www.navatelangana.com | 12 పేజీలు వెల : 6.50



దేశం మనది..దేశం కోసం పోరాడుదాం

గంగాజమునా తెహజీబ్ సంస్కృతి విశిష్టమైనది : ఇఫ్తార్ విందులో సీఎం కేసీఆర్

నవతెలంగాణ బ్యూరో–హైదరాబాద్

గంగా జమునా తెహజీబ్ సంస్కృతి ఎంతో విశిష్టమైనదని రాష్ట్ర ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్‌రావు అన్నారు. ఈ దేశం మనందరిదనీ, దేశం కోసం చివరి రక్తపు బొట్టు వరకూ పోరాడాలని పిలుపునిచ్చారు. ఆవేశంతో కాదు.. ఆలోచనతో దేశాన్ని కాపాడుకుందామన్నారు. ఈ పోరాటంలో ఎన్ని ఇబ్బందులు ఎదురైనా చివరకు న్యాయమే గెలుస్తుందని నొక్కి చెప్పారు. బుధవారం హైదరాబాద్‌లోని ఎల్‌బీ స్టేడియంలో రాష్ట్ర ప్రభుత్వం తరఫున ముస్లింలకు ఇఫ్తార్ విందు ఇచ్చారు. ముస్లిం చిన్నారులకు కేసీఆర్ రంజాన్ కానుకలు అందించారు. వారితో ఇంగ్లీష్‌లో ముచ్చటించారు. ఉన్నతస్థితికి ఎదగాలని దీవించారు. వేదికపై తనతో పాటు ఉన్న పలువురికి ఇఫ్తార్ విందును అందించి రోజాను విరమింపజేశారు. అంతకుముందు సీఎం కేసీఆర్ మాట్లాడుతూ.. ప్రజలకు రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు. తొమ్మిదేండ్ల కింద అన్ని రంగాల్లో వెనుకబడ్డ తెలంగాణ నేడు అన్నింటిలోనూ ముందు వరుసలో ఉందని చెప్పారు. రాష్ట్రంలో తాగు, సాగు నీటి, కరెంటు సమస్యల్ని పరిష్కరించుకున్నామన్నారు. తలసరి ఆదాయంలో మన రాష్ట్రమే దేశంలో నెంబర్‌వన్‌గా నిలిచిందన్నారు. రాష్ట్రమేర్పడిన కొత్తలో తలసరి విద్యుత్ వినియోగం 1000–1050 యూనిట్లు ఉంటే నేడది రెండింతలు పెరిగి 2100 యూనిట్లకు పెరిగిందని వివరించారు. ఉమ్మడి రాష్ట్రంలో మైనార్టీలకు పదేండ్లలో కాంగ్రెస్ ఖర్చు చేసింది కేవలం రూ. 1200 కోట్లు మాత్రమేననీ, ...5లో



మనసుగతి ఇంతే

దేశంలో తీవ్రమైన మానసిక ఆరోగ్య సంక్షోభం

- కుటుంబ బడ్జెట్‌పై ప్రభావం..–తెలంగాణలోనూ ఖర్చు ఎక్కువే
- ఫలితంగా పెరుగుతున్న పేదరికం: ఐసీఎంఆర్ నివేదికలో వెల్లడి

దేశ ప్రజానీకంలో మానసిక అశాంతి పెరిగిపోతోంది. కుటుంబాల ఆరోగ్య బడ్జెట్‌పై ఇది ప్రతికూల ప్రభావం చూపుతోంది. దేశంలోని 20 శాతం కుటుంబాలలో ఒక్కరైనా మానసిన రుగ్మతతో బాధపడుతున్నారు. పేదరికం వారిని కుంగదీస్తోంది. భారతీయ వైద్య పరిశోధనా మండలి (ఐసీఎంఆర్) జరిపిన తాజా అధ్యయనంలో ఈ విషయాలు వెల్లడయ్యాయి.



న్యూఢిల్లీ : 2018 జూలై–డిసెంబర్ మధ్యకాలంలో నిర్వహించిన జాతీయ శాంపిల్ సర్వే (ఎన్ఎస్ఎస్)లో 1.18 లక్షల కుటుంబాలకు చెందిన 5.76 లక్షల మందిని ఇంటర్వ్యూ చేశారు. ఈ సర్వే సందర్భంగా 6,679 మంది మానసిక రుగ్మతలతో బాధపడుతున్నట్లు గుర్తించారు. దేశంలో ఈ తరహా సర్వే నిర్వహించడం ఇదే మొదటిసారి. ఆరోగ్య పరిరక్షణ కోసం కుటుంబాలు చేస్తున్న వ్యయంలో 18.1 శాతం మానసిక అశాంతి పైనే అవుతోంది. అసాధారణ ఆలోచనలు, భావోద్వేగాలు, ప్రవర్తన, సంబంధాలు, మానసిన అనారోగ్యాలు, ఒత్తిడి, మతిభ్రమణం, మేధోసంబంధమైన బలహీనతలు వంటి వాటిని మానసిక ఆరోగ్య అంశాలుగా వర్గీకరించారు.

దేశంలోని ఇతర ప్రాంతాలతో పోలిస్తే.. డామన్ డయ్యూ (23.4 శాతం), హిమాచల్‌ప్రదేశ్ (23.9 శాతం), సిక్కిం (31.9 శాతం) వంటి చిన్న ప్రాంతాలలోనే మానసిక రుగ్మతలపై పెడుతున్న ఖర్చు ఎక్కువగా ఉంటోంది. పెద్ద రాష్ట్రాలకు సంబంధించి మహారాష్ట్ర (21.3 శాతం), తెలంగాణ (22.2 శాతం)లలో ఖర్చు ఎక్కువగా ఉంటోంది. ఈ అధ్యయనం ...5లో

ఆత్మీయ సమ్మేళనంలో అపశృతి

చీమలపాడు బీఆర్ఎస్ సభా స్థలి సమీపంలో మంటలు

- బాణసంచా గుడిసెపై పడటంతో పేలిన గ్యాస్ సిలిండర్
- నలుగురు మృతి.. ఏడుగురికి తీవ్ర గాయాలు
- మంత్రి అజయ్, ఎంపీ నామాకు సీఎం కేసీఆర్, మంత్రి కేటీఆర్ ఫోన్





నవతెలంగాణ- ఖమ్మం ప్రాంతీయ ప్రతినిధి/ కారేపల్లి

'రెక్కాడితే గానీ డొక్కాడని బతుకులు' వారివి. గ్రామంలో బీఆర్ఎస్ సభ పెడుతున్నారంటే మహిళలు కూలికి పోగా.. పురుషులు ఇండ్ల వద్దే ఉన్నారు. సభా అనంతరం కూలికి వెళ్దామని ఆగిపోయారు. ఎంపీ నామ నాగేశ్వరరావు, వైరా ఎమ్మెల్యే రాములునాయక్ ...2లో

కారేపల్లి ప్రమాదంపై సీఎం దిగ్భ్రాంతి

వివరాలు 5లో

ధాన్యం కొనొద్దని బీజేపీ చెప్తోంది..

బరాబర్ ప్రతి గింజా కొంటాం

- రైతులను పీడించేది బీజేపీ.. బాగు కోరేది బీఆర్ఎస్
- ఆంధ్రా ప్రజలు తెలంగాణలో ఉంటామంటున్నారు : ఆర్థిక, వైద్యారోగ్య శాఖ మంత్రి హరీశ్‌రావు



వివరాలు 6లో..

టీచర్లకు కుర్చీలు వద్దట !

తరగతి గదిలో తిరుగుతూనే ఉండాలి

- జాతీయ పాఠ్యప్రణాళిక నూతన ముసాయిదా(ఎన్‌సీఎఫ్) సిఫారసు

న్యూఢిల్లీ : పాఠశాల తరగతి గదిలో విద్యను బోధించే ఉపాధ్యాయులకు కూర్చునేందుకు కుర్చీలు ఇవ్వకూడదట ! వారు నిలువుకాళ్లపై నిలుచునో, అటూ ఇటూ తిరుగుతూనో పాఠాలు చెప్పాలట ! పాఠశాల విద్యకు సంబంధించిన జాతీయ పాఠ్యప్రణాళిక నూతన ముసాయిదా (ఎన్‌సీఎఫ్) ఈ మేరకు సిఫార్సు చేసింది. దీనిని కేంద్ర విద్యా మంత్రిత్వ శాఖ గతవారం విడుదల చేసింది. తరగతి గదిలో సింబల్స్‌కు అధిక ప్రాధాన్యత ఇవ్వాలని ముసాయిదా సూచించింది. విద్యార్థులకు సులభంగా అర్థమయ్యేలా చిహ్నాలు, దృశ్య రూపాలు, గోడలపై రాతలు, పెయింటింగులు, ప్రతిమలు, భౌతిక వస్తువులు వంటి వాటిని ఏర్పాటు చేయాలని తెలిపింది. ప్రధానోపాధ్యాయుడు కూర్చునే కుర్చీ, ఇతర ఉపాధ్యాయులు కూర్చునే కుర్చీలు భిన్నంగా ఉండాలని కూడా సూచించింది. సింబల్స్‌ను సమర్థవంతంగా ఎలా ఉపయోగించుకోవాలో బాధ్యులు నిర్ణయించుకోవాలని, దీనివల్ల విద్యార్థులు తమ ఆలోచనలు పంచుకుంటూ మంచి వాతావరణంలో మెలగుతారని అభిప్రాయపడింది. తరగతి గదిలో విద్యార్థులు సర్కిల్‌లో కూర్చునేలా ఏర్పాట్లు చేయాలని, దీనివల్ల వారు మరింత క్రియాశీలకంగా వ్యవహరిస్తారని తెలిపింది. ఉపాధ్యాయులను ఎనిమిది గంటల పాటు తరగతి గదిలో



కూర్చునేందుకు అనుమతివ్వని కారణంగా 2019లో కేరళలోని తిరువనంతపురంలో ఒక ప్రముఖ పాఠశాల యాజమాన్యాన్ని జాతీయ మహిళా కమిషన్ మందలించింది. ఇప్పుడు జాతీయ పాఠ్యప్రణాళిక నూతన ముసాయిదా దీనికి పూర్తి భిన్నంగా ఉంది.

కేసీఆర్ అంటే...

(K)కాలువలు.. (C)చెరువులు.. (R)రిజర్వాయర్లు..

- వ్యవసాయాన్ని పండుగ చేసిన సీఎం :మంత్రి కేటీఆర్
- మంత్రి నిరంజన్‌రెడ్డి, స్పీకర్ పోచారంతో కలిసి వ్యవసాయ కళాశాల భవనాలు ప్రారంభం



నవతెలంగాణ - తంగళ్ళపల్లి

కే అంటే కాల్వలు.. సీ అంటే చెరువులు.. ఆర్.. అంటే రిజర్వాయర్లు' అని కేసీఆర్ పేరుకు మంత్రి కేటీఆర్ కొత్త నిర్వచనం చెప్పారు. సమైక్య రాష్ట్రంలో దండగ అన్న వ్యవసాయాన్ని కాళేశ్వరం, సహా అనేక సాగునీటి ప్రాజెక్టులు నిర్మించి స్వరాష్ట్రంలో పండుగగా మార్చిన ఘనత సీఎం కేసీఆర్‌దేనని కేటీఆర్ అన్నారు. రాజన్న సిరిసిల్ల జిల్లా తంగళ్ళపల్లి మండలం జిల్లెల గ్రామ శివారులో బుధవారం వ్యవసాయ కళాశాలను, రైతుల కోసం ఏర్పాటు చేసిన కోల్డ్ స్టోరేజ్‌ని మంత్రి నిరంజన్‌రెడ్డి, అసెంబ్లీ స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డితో కలిసి మంత్రి కేటీఆర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ.. రాష్ట్రంలో ఎక్కడా లేని విధంగా వ్యవసాయ కళాశాల నిర్మించుకున్నామని హర్షం వ్యక్తం చేశారు. తెలంగాణ వ్యవసాయ విధానం దేశానికే దశాదిశా చూపుతోందన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టుతో ఒక్క ఎకరానికి కూడా నీళ్లు రాలేదని కొందరు మాట్లాడుతున్నారని.. వారు తెలిసి మాట్లాడుతున్నారా.. తెలియక మాట్లాడుతున్నారా అర్థం కావడం లేదన్నారు. ఈ కార్యక్రమానికి హెలికాప్టర్‌లో వస్తున్నప్పుడు వరుసగా ఉన్న కొండపోచమ్మ సాగర్, మల్లన్న సాగర్, రంగనాయక సాగర్, అన్నపూర్ణ రిజర్వాయర్, మిడ్ మానేరు నీళ్లతో కళకళలాడుతుంటే ఎంతో సంబురంగా అనిపించిందని చెప్పారు.పోచారం శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ.. ...5లో

ప్రతిపక్షాల ఐక్యతే లక్ష్యం

- రాహుల్, నితీశ్, తేజస్వి, ఖర్గే భేటీ



వివరాలు 5లో..

కర్నాటక బీజేపీలో అసమ్మతి సెగలు

- టికెట్ దక్కని నేతల తిరుగుబాటు
- పార్టీకి మాజీ డిప్యూటీ సీఎం లక్ష్మణ్ రాజీనామా
- రాజకీయాలకు మంత్రి అంగారా గుడ్‌బై
- టికెట్ ఇవ్వకున్నా పోటీ చేస్తానంటున్న జగదీశ్ షెట్టర్



వివరాలు 5లో..

మన సీఎంలు సంపన్నులే..



- 30 మందిలో 29 మంది కోటీశ్వరులు
- సగటు సంపద రూ.33.96 కోట్లు
- రూ. 510 కోట్లతో టాప్ ప్లేస్‌లో ఏపీ సీఎం జగన్
- రూ. 15 లక్షలతో చివరి స్థానంలో బెంగాల్ ముఖ్యమంత్రి మమత :ఏడీఆర్, ఎన్ఈడబ్ల్యూ నివేదిక

వివరాలు 2లో..

రాష్ట్రాన్ని కుప్ప చేస్తున్న డీ9 గ్యాంగ్

నిజాం కూడా ఇంత విధ్వంసం సృష్టించలేదు

- సీఎం కేసీఆర్ తీరుపై రేవంత్ ఆగ్రహం



నవతెలంగాణబ్యూరో–హైదరాబాద్

రాష్ట్రాన్ని డీ9 (దావుద్9) గ్యాంగ్ కుప్ప చేస్తున్నదని టీపీసీసీ అధ్యక్షులు, ఎంపీ ఎనుముల రేవంత్‌రెడ్డి విమర్శించారు. వారిలో ఎవర్ని వదిలే ...6లో

చేనేతకు బతుకమ్మ జీవం

పెరిగిన బతుకమ్మ చీరల యూనిట్లు, ఆర్డర్లు

- మళ్లీ మొదలైన చీరల ఉత్పత్తి
- గర్శకుర్తిలో సాంచెల సవ్వడి

నవతెలంగాణ–గంగాధర

వస్త్రోత్పత్తికి అవసరమైన ముడి సరుకు ధరలు ఆకాశాన్నంటాయి.. నేసిన బట్టలకు గిరాకీ లేక.. పనుల్లేక బతుకుపై భరోసా కోల్పోయిన చేనేత కార్మికుల్లో బతుకమ్మ చీరలు జీవం పోశాయి.. నిన్న, మొన్నటి వరకు స్కూల్ యూనిఫామ్స్, రంజాన్ గుడ్డ ఉత్పత్తిపై దృష్టి సారించిన నేతన్నలు నేడు బతుకమ్మ చీరల తయారీలో నిమగ్నమయ్యారు. ఈయేడు కొత్తగా స్కూల్ యూనిఫామ్స్, రంజాన్ గుడ్డ ఉత్పత్తి ఆర్డర్లతో ఏడాదంతా నేతకార్మికుల చేతికి పని దొరికింది. ఒకప్పుడు బతుకుదెరువు కోసం భీవండి, షోలాపూర్, సూరత్ వంటి ఇతర రాష్ట్రాలకు వలస వెళ్లి బతికిన ఇక్కడి నేతన్నలు బతుకమ్మ చీరల ఉత్పత్తితో ఉన్న ఊళ్లో ఉపాధి అవకాశాలు మెరుగుపడి వలసలకు స్వస్తి పలికారు.

కరీంనగర్ జిల్లా గంగాధర మండలం గర్శకుర్తి గ్రామం చేనేత, పవర్ లూమ్స్ వస్త్ర పరిశ్రమలకు అడ్డా. సిరిసిల్ల వస్త్ర పరిశ్రమ తర్వాత స్థానంలో వేళ్లూనుకుని ఉన్న ఈ గ్రామంలో వస్త్రోత్పత్తిపై ఆధారపడి 6 వేల చేనేత కుటుంబాలు జీవిస్తున్నాయి. ఒకప్పుడు పనులు లేక అవస్థలు పడిన నేతన్నలకు ఇప్పుడు చేతినిండా పని లభించింది. ఈ గ్రామంలో నేడు ఏ దిక్కు చూసినా సాంచెల సవ్వడే వినిపిస్తోంది. రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షులు, మాజీ ఎంపీ బోయినపల్లి వినోద్‌కుమార్, చొప్పదండి ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ ప్రభుత్వం నుంచి బతుకమ్మ చీరల ఆర్డర్లను ఇప్పించారు. సిరిసిల్ల వస్త్ర పరిశ్రమలకు అందించే ప్రతి గుడ్డ ఉత్పత్తి ఆర్డర్లను గర్శకుర్తికి వర్తించేలా ప్రత్యేక చొరవ చూపారు. దీంతో ఐదేండ్లుగా ప్రభుత్వం బతుకమ్మ చీరల ఆర్డర్లు కల్పిస్తుండగా, ఈ యేడు కొత్తగా స్కూల్ యూనిఫామ్స్, రంజాన్ గుడ్డ ఉత్పత్తికి ఆర్డర్లు ఇచ్చింది. దీంతో చేనేత వ్యాపారులు, ఆసాములు, కార్మికుల్లో ధీమా నెలకొంది.

ఏడాదంతా పనులే ..

ఫిబ్రవరి నుంచి షురూ అయ్యే బతుకమ్మ చీరల ఉత్పత్తి సెప్టెంబర్ వరకు కొనసాగుతుంది. పవర్ లూమ్స్‌పై 8 నెలలు బతుకమ్మ చీరల ఉత్పత్తి



నిర్విఘ్నంగా కొనసాగగా, మరో 4 నెలలు ప్రభుత్వ పాఠశాలలు, గురుకులాల విద్యార్థులకు ఉచితంగా అందించే స్కూల్ యూనిఫామ్స్, రంజాన్ గుడ్డ ఉత్పత్తికి సర్కారు ఆర్డర్లను కల్పించింది. గత ఏడాది 20 లక్షల మీటర్ల చీరల ఉత్పత్తికి అర్డర్లు కల్పించగా, ఈ యేడు 32 లక్షల 26 వేల 750 మీటర్ల చీరల తయారీకి ఆర్డరు ఇచ్చింది. ఈ యేడు కొత్తగా 2 లక్షల 13 వేల 860 మీటర్ల స్కూల్ యూనిఫామ్స్, 24 వేల మీటర్ల రంజాన్ గుడ్డ ఉత్పత్తికి కూడా ఆర్డర్లు ఇచ్చింది. గత యేడు 17 స్మాల్ స్కేల్ ఇండస్ట్రీస్ (ఎస్ఎస్ఐ) యూనిట్లు ఉండగా, ఈ యేడు మరో 16 కొత్త యూనిట్లకు ఆర్డర్లు కల్పిస్తోంది. మొత్తం 33 ఎస్ఎస్ఐ యూనిట్లు చేరగా, సుమారు ...5లో

సంపాదకీయం

మళ్లీ 'ఉరే'నియం...

ఊరందరిదీ ఒక దారైతే.. ఉలిపికట్టెది మరో దారన్నట్టు కడు విచిత్రంగా, వింతగా ప్రవర్తించటంలో కాషాయ నేతలు దిట్టలు. అసలు విషయాన్ని పక్కదోవ పట్టించటంలో వారు సిద్ధహస్తులు. పాత సమాధులన్నింటినీ తవ్వాలంటూ బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్

> కన్నతల్లిలా కాపాడుతున్న అడవి తల్లి నుంచి తమను దూరం చేసేందుకే ఇలాంటి కుట్రలు చేస్తున్నారంటూ వారు ఆందోళన చెందారు. ఇదే సమయంలో వామపక్షాలు, ప్రజా, సామాజిక సంఘాలు వారికి మద్దతుగా నిలిచాయి. ఇంకోవైపు యురేనియం తవ్వకాలు జరిపితే నల్లమలతోపాటు చుట్టుపక్కల జిల్లాలైన నల్లగొండ, మహబూబ్‌నగర్ ఎడారులవుతాయంటూ పర్యావరణ, అటవీ నిపుణులు హెచ్చరించారు.

ఇచ్చిన పిలుపు తరహాలో ఆ పార్టీకే చెందిన సీనియర్ నేత, రాజ్యసభ సభ్యుడు డాక్టర్ కె.లక్ష్మణ్ ఇప్పుడో పాత అంశాన్ని కొంగొత్త తరహాలో పైకి తెచ్చి 'వారేవ్వా...' అనిపించారు. అదే నల్లమలలో యురేనియం తవ్వకాలు. అక్కడ ఆ ఖనిజాన్ని తవ్వటం, తద్వారా ఒక ఫ్యాక్టరీని ఏర్పాటు చేయటం వల్ల వేలాది మంది గిరిజన బిడ్డలకు ఉపాధి కల్పించొచ్చన్నది ఆయన గారి ఉవాచ. దీనికి రాష్ట్ర ప్రభుత్వం మోకాలడ్డుతున్నదంటూ ఆ ఎంపీ గారి ఆవేదన. లోతుల్లోకి పోకుండా కేవలం పైపైన, పలచ పలచగా మాత్రమే దీన్ని చూస్తే మనం తప్పులో కాలేసినట్టే.



వాస్తవానికి గత రెండు, మూడేండ్ల క్రితం నల్లమలలో యురేనియం తవ్వకాల అంశం ప్రస్తావనకొచ్చినప్పుడు అక్కడి ప్రజల్లో, ముఖ్యంగా ఆదివాసీల్లో తీవ్ర అలజడి రేగింది. కన్నతల్లిలా కాపాడుతున్న అడవి తల్లి నుంచి తమను దూరం చేసేందుకే ఇలాంటి కుట్రలు చేస్తున్నారంటూ వారు ఆందోళన చెందారు. ఇదే సమయంలో వామపక్షాలు, ప్రజా, సామాజిక సంఘాలు వారికి మద్దతుగా నిలిచాయి. ఇంకోవైపు యురేనియం తవ్వకాలు జరిపితే నల్లమలతోపాటు చుట్టుపక్కల జిల్లాలైన నల్లగొండ, మహబూబ్‌నగర్ ఎడారులవుతాయంటూ పర్యావరణ, అటవీ నిపుణులు హెచ్చరించారు. కృష్ణా జలాలు తీవ్రంగా కలుషితమవుతాయనీ, ఫలితంగా హైదరాబాద్‌కు సరఫరా అయ్యే మంచి నీరు సైతం విషతుల్యమవుతుందంటూ హెచ్చరించారు. మొత్తంగా యురేనియం తవ్వకాలు అడవి బిడ్డలకు ఉరేస్తాయనీ, రాష్ట్రానికి తీవ్ర నష్టం చేకూరుస్తాయనే ప్రమాద సంకేతాలను వారు ఇచ్చారు. అయితే కేంద్రం చేపట్టిన ప్రయోగాత్మక తవ్వకాలపై మొదట మౌనం దాల్చిన రాష్ట్ర ప్రభుత్వం... వాటిని ఖండించకపోవటం గమనార్హం. ఆ తర్వాత అన్ని వైపుల నుంచి విమర్శలు వెల్లువెత్తటంతో అనివార్యంగా 'తవ్వకాలొద్దు...' అంటూ బీఆర్ఎస్ సర్కారు స్పందించింది. మరోవైపు కేంద్రం చర్యలను వ్యతిరేకిస్తూ ఆందోళనలు పెరిగాయి. అవి అంతకంతకూ తీవ్రతరమవుతుండటంతో మోడీ సర్కార్ వెనక్కి తగ్గింది. యురేనియం తవ్వకాలు, సంబంధిత ప్రయోగాలు అప్పటికి ఆగిపోయాయి.

కానీ ఇప్పుడు బీజేపీ ఎంపీ నోట మరోసారి యురేనియం తవ్వకాల మాట ప్రస్తావనకు రావటం గమనార్హం. అంటే రాష్ట్రానికి 'ఉరేసే' చర్యలను ఆ పార్టీ గానీ, కేంద్రంగానీ పక్కకు పెట్టలేదన్నమాట. వారి మనసుల్లో ఇంకా యురేనియం తవ్వాలి.. దాన్ని కార్పొరేట్ గద్దలకు కట్టబెట్టాలనే ఆలోచన దాగుండటం అత్యంత ఆందోళనకరం. వాస్తవానికి రాష్ట్ర ప్రభుత్వం గత కొద్ది రోజులుగా విశాఖ స్టీల్ ప్లాంటుకు గనుల కేటాయింపు, బయ్యారంలో ఉక్కు ఫ్యాక్టరీ నిర్మాణం తదితరాంశాలను తెరపైకి తెచ్చింది. బీఆర్ఎస్ నేతలు ఏ అవసరాల కోసం ఆ అంశాన్ని చర్చనీయాంశం చేసినప్పటికీ వాటి వల్ల తెలుగు రాష్ట్రాలకు లాభమే గానీ నష్టం లేదు. ఈ నేపథ్యంలో విశాఖ ఉక్కు, బయ్యారం స్టీల్ ప్లాంట్‌పై సమాధానం చెప్పని కేంద్రం, బీజేపీ... రాష్ట్రంలోని ఆ పార్టీ నేతలను ఉసిగొల్పి సమస్యలను పక్కదోవ పట్టిస్తున్నది. అందులో భాగంగానే లక్ష్మణ్ నోటి నుంచి యురేనియం మాట బయటకొచ్చింది.

ఈ క్రమంలో గతంలో మాదిరిగానే మరోసారి 'ఉరేనియం' మాటలను, కేంద్రం చర్యలను ఎక్కడికక్కడ తుంచేయాలి. ఈ అంశంపై విస్తృత చర్చలు నిర్వహించాలి. నల్లమలపై బీజేపీ పడగ నీడ, దాని వల్ల జరిగే నష్టాలను ప్రజా బాహుళ్యంలోకి తీసుకెళ్లాలి. అలాంటి చర్యలకు వ్యతిరేకంగా విస్తృత ఉద్యమాలను నిర్వహించాలి. అప్పుడే అలాంటి ఆలోచనల నుంచి కేంద్రం వెనక్కి తగ్గుతుంది.

జలియన్ వాలాబాగ్ రోజులు మళ్లొచ్చాయి...

> కాలం మారింది. విధానాలు, పద్ధతుల్లో కూడా కనీసం రూపంలోనైనా చాలా మార్పులు వచ్చాయి. నేడు బీజేపీ పాలన గత ప్రభుత్వ పాలనలో ఉన్న అనేక నిరంకుశ పోకడలను, నియంతృత్వ పద్ధతులను పరాకాష్టకు తీసుకువచ్చింది. రౌలట్ చట్టాన్ని తలదన్నే హింసాత్మక చట్టాలు పదేపదే అమలులోకి వస్తున్నాయి. 1975 ఎమర్జెన్సీ కాలం నాటి నిర్బంధానికి వంద రెట్లు ఎక్కువ నిర్బంధం అమలు చేయబడుతున్నది. ప్రభుత్వాన్ని విమర్శించారన్న కక్షతో అనేకమంది సామాజిక కార్యకర్తలు, రచయితలు, కవులు, వ్యంగ వ్యాఖ్యాతలు చివరికి కార్టూనిస్టులను కూడా జైళ్లలో కుక్కుతున్నారు.


జలియన్ వాలాబాగ్ మారణ కాండకు వందేళ్లు దాటాయి. బ్రిటిషు పాలన పోయి భారతీయుల పాలన వచ్చి 75సంవత్సరములు ముగిసింది. బీజేపీ "అమృతకాలం"లో ప్రవేశించాం. ఈ 75సంవత్సరాల స్వతంత్ర భారత చరిత్రని తులనాత్మకంగా వర్గదృష్టితో పరిశీలిస్తే బ్రిటిషు సామ్రాజ్యవాదుల పాలనకు, నేటి పెట్టుబడిదారీ భూస్వామ్య పాలనకు పదే పదే పోలికలు కనపడుతూ ఉంటాయి. మరీ ముఖ్యంగా ఆర్థిక సంక్షోభం తీవ్రమైనప్పుడు, అది రాజకీయాలలో ప్రతిఫలించేకొద్దీ నిర్బంధం, నిరంకుశత్వం పెచ్చరిల్లుతాయి. సాధారణ పార్లమెంటరీ ప్రజాస్వామ్య హక్కులను కూడా సహించలేని అసహన ఆలోచనలకు పాలకవర్గాలు నెట్టబడుతూ ఉంటాయి. ఇది ప్రస్తుత బీజేపీ కేంద్ర పాలనలో మరింత తేటతెల్లమవుతున్న సత్యం. నిజానికి గతంలో కాంగ్రెస్ తన ఏకఛత్ర పాలనకు ముప్పువచ్చినప్పుడు 1975లో ఇందిరాగాంధీ అత్యవసర పరిస్థితిని విధించారు. అనేక నల్లచట్టాలు అమలులోకి వచ్చాయి. మరి 2014లో ప్రారంభమైన బీజేపీ పాలన మరింత క్రూరంగా, అమానుషంగా తయారైంది. తమకి, తమ నాయకులకు ముప్పు వచ్చినప్పుడు మాత్రమే బూర్జువా ప్రతిపక్ష పార్టీలు నిర్బంధంపై మాట్లాడుతున్నాయి. అధికారంలో ఉన్న బూర్జువా పార్టీలు ఈ విషయంలో దాదాపుగా ఒకే రకంగా ప్రవర్తించడం అనేక రాష్ట్రాలలో ఈ రోజు మనం చూస్తున్నాం. అధికారంలో ఉన్నవారిని ప్రశ్నించడం అప్రజాస్వామికంగాను, అభివృద్ధి నిరోధకంగానూ చిత్రించడం సర్వసాధారణం అయిపోయింది. ఈ నేపథ్యంలో జలియన్ వాలాబాగ్ మారణ హెూమాన్ని, అందుకు కారణాలను, తదనంతర పరిస్థితిని, వీటన్నింటిలో నాటి, నేటి భారత బూర్జువా, భూస్వామ్య వర్గాల ప్రతినిధుల పాలన గురించి చర్చించుకుందాం.



ఆర్. రఘు

జలియన్ వాలాబాగ్ ఘోరకలి

అది 1919 ఏప్రిల్ 13వ తేదీ. నాటి పంజాబ్‌లోని ప్రముఖ నగరమైన అమృత్‌సర్‌లోని జలియన్ వాలాబాగ్ మైదానంలో 20 వేల మందితో గాంధీజీ ఇచ్చిన పిలుపును అందుకొని శాంతియుతంగా సభ మొదలైంది. ఆ ప్రాంతానికి చెందిన కాంగ్రెస్ నాయకులు సత్యపాల్, సైపుద్దీన్ కిచ్‌లూ లను ముందురోజే అరెస్టు చేసి దూర ప్రాంతాలకు తరలించేశారు. దీంతో సభలో ఉద్రిక్తత నెలకొంది. అందుకోసమే కాసుకు కూర్చున్న బ్రిటిష్ అధికారి జనరల్ డయ్యర్ 90మంది పోలీసులతో వచ్చి ఆ స్థలానికున్న ఏకైక ద్వారాన్ని మూసివేసి 1650 బుల్లెట్లు కురిపించాడు. 1200మంది చనిపోవడం, వేలమంది తీవ్రంగా గాయపడటం జరిగింది. ఎందుకు ఇంత భయానకమైన నిర్ణయానికి డయ్యర్ వెళ్లాడు? వాస్తవానికి డయ్యర్ ఒక్కడిదే ఈ నిర్ణయం కాదు. నాటి జాతీయ, అంతర్జాతీయ పరిస్థితులు తీసుకువచ్చిన అనేక ఘటనలు బ్రిటిషు పాలకులను ఉక్కిరి బిక్కిరి చేశాయి. అందులో ముఖ్యమైనది ప్రపంచవ్యాపితంగా వలస వాదానికి వ్యతిరేకంగా పెల్లుబికిన విముక్తి పోరాటాలు. వాటి మధ్య సంఘీభావం, సారూప్యత. ఈ క్రమంలోనే మన దేశంలోనే కాక కెనడా, జర్మనీ, సింగపూర్, ఇంగ్లండ్ వంటి దేశాలలో భారతీయ విప్లవ గ్రూపులు పుట్టుకు వచ్చాయి. 1914 నుంచి మొదటి ప్రపంచ యుద్ధం ప్రారంభమైంది. జర్మన్ రాజధాని బెర్లిన్‌లో ఎయిడ్ ఇండియా కమిటీ స్థాపించబడింది. ఆఫ్ఘనిస్తాన్‌లో తాత్కాలిక విప్లవ ప్రభుత్వం 1915లో పురుడు పోసుకుంది. శాన్‌ఫ్రాన్సిస్కోలో గదర్ (విప్లవ) పార్టీ 1913లో ఏర్పడింది. దేశంలో కూడా కార్మికవర్గ పోరాటాలు ప్రారంభ మయ్యాయి. కార్మికోద్యమం సంఘటిత దశలోకి ప్రవేశించింది. వీటన్నింటికీ తలమానికంగా యావత్తు పెట్టుబడిదారీ ప్రపంచాన్ని అతలాకుతలం చేస్తూ 1917లో సాగిన రష్యన్ కార్మికవర్గ మహా విప్లవం. ఈ రష్యన్ విప్లవ ప్రభావం స్వాతంత్ర్యోద్యమం మీద, ముఖ్యంగా





కార్మికవర్గ నాయకుల మీద పడుతున్నది. ఇది అత్యంత ప్రమాదకరమని బ్రిటీషు ప్రభుత్వం భావించింది.

మొదటి ప్రపంచ యుద్ధంలో విజయం సాధించినప్పటికీ ఇంగ్లండు ఆర్థికంగా తీవ్రమైన సంక్షోభంలోకి కూరుకుపోయింది. యుద్ధం జరిగేటప్పుడు కాంగ్రెస్ నుండి విడివడి హెూమ్‌రూల్ సంస్థ ప్రారంభించిన అనీబిసెంట్, బాలగంగాధర తిలక్‌లు యుద్ధానికి భారతీయులను సైనికులుగా పంపిస్తామని, తమకు కనీసం కెనడా, ఆస్ట్రేలియాలో మాదిరిగా ఏదో ఒకస్థాయిలో స్వపరిపాలనకు అవకాశం కలుగజేయమని విన్నవించారు. కాని యుద్ధానంతరం బ్రిటిషు ప్రభుత్వం ఒక పక్క కొన్ని పాలనా సంస్కరణలు (1919 ఇండియన్ యాక్ట్) ప్రకటిస్తూనే మరో ప్రక్క స్వాతంత్ర్యోద్యమంపై తీవ్ర నిర్బంధాన్ని ప్రారంభించింది. అందుకు అనుగుణంగా 1919లో రౌలట్ చట్టం ప్రవేశపెట్టారు. భారత దేశంలో విప్లవోద్యమానికి సంబంధించిన "నేరపూరితమైన కుట్రల" యొక్క స్వభావాన్ని, విస్తృతిని పరిశోధించి నివేదించడం అనే కర్తవ్యం ఈ రౌలట్ చట్టంలోని సారాంశం. దీనిపై పంజాబ్‌లో ముఖ్యంగా అమృత్‌సర్, పక్కనే ఉన్న లాహెూర్ నగరాలలో ప్రజలు వేల సంఖ్యలో నిరసన కార్యక్రమాలకు దిగారు. పరిస్థితిని అర్థం చేసుకున్న గాంధీజీ సత్యాగ్రహ కార్యక్రమానికి పిలుపునిచ్చారు. ఏప్రిల్ నెలలో ఒకరోజు సమ్మెకు కూడా పిలుపు ఇవ్వడం జరిగింది. బ్రిటిషు ప్రభుత్వం అగ్గిమీద గుగ్గిలమైంది. గాంధీజీని పంజాబ్ వెళ్లరాదని, వెళితే అరెస్టు చేస్తామని ఆర్డర్లు విడుదల అయ్యాయి. పంజాబ్ ఉన్నతాధికారి జనరల్ డయ్యర్ గాంధీజీని బర్మాకి పంపాలని ప్రకటించాడు. ఈ నేపథ్యంలో సత్యపాల్, కిచ్‌లూ లను నిర్బంధించి అజ్ఞాత ప్రదేశానికి తరలించడం పెద్ద అలజడి లేపింది. రౌలట్ చట్టం పుణ్యమా అని పంజాబ్ ప్రాంతం అగ్నిగుండంగా మారింది. దీంతో రెచ్చిపోయిన డయ్యర్ ఉద్దేశపూర్వకంగానే "పంజాబ్‌కే గాదు యావత్ దేశానికే హెచ్చరిక చేయడానికే అన్నట్టు..." మారణకాండ సృష్టించాడు. అదే జలియన్ వాలాబాగ్!


స్వతంత్ర భారత పాలకులు ఇప్పటివరకు బ్రిటిషు ప్రభుత్వాన్ని మన దేశానికి క్షమాపణ చెప్పాలని నిలదీసిందీ లేదు. నిజానికి కొన్ని విషయాలు ప్రస్తుతం అప్రస్తుతం అయినా ఆశ్చర్యం కలిగిస్తాయి. గాంధీజీ 1919 ఏప్రిల్ 18వ తేదీన అంటే మారణకాండ జరిగిన 5వ రోజున తన సత్యాగ్రహాన్ని అర్థంతరంగా విరమిస్తూ "సత్యాగ్రహం గురించి అర్థం కాని వాళ్ల చేతుల్లో దీన్ని పెట్టి హిమాలయ పర్వతమంత తప్పు చేశానని" ప్రకటించాడు. జలియన్ వాలాబాగ్ మారణకాండకు నిరసనగా రవీంద్రుడు తనకి బ్రిటిషు ప్రభుత్వం ఇచ్చిన అత్యున్నత బిరుదు "నైట్‌హుడ్ ఆఫ్ ఇండియా"ను త్యజిస్తూ ప్రకటించాడు. గాంధీజీ కూడా బ్రిటీషు ప్రభుత్వం తనకిచ్చిన "కైజర్ ఎ హింద్" బిరుదును త్యజించాడు. కాని మరో ప్రక్క మారణకాండ జరిగిన మరుక్షణం నుండి నాటి పంజాబ్ ప్రాంతం అయిన అమృత్‌సర్, గుర్జన్‌వాలా, లాహెూర్ (ప్రస్తుతం పాకిస్తాన్‌లోని నగరం) లలో గొప్ప తిరుగుబాట్లు ప్రారంభం అయ్యాయి. అందులో ప్రధానంగా రైతాంగం వేల సంఖ్యలో రోడ్లపైకి వచ్చారు. విద్యార్థులు సమ్మెలు ప్రారంభించారు. బ్రిటిషు ప్రభుత్వం గడగడలాడింది. నాటి ఉన్నతాధికారుల మధ్య జరిగిన ఉత్తర ప్రత్యుత్తరాలని బట్టి చూస్తే 1857 ప్రథమ స్వాతంత్ర్య సంగ్రామం లాంటి పరిస్థితులు వస్తున్నాయని, సాయుధ తిరుగుబాట్లకు ప్రజలు సిద్ధపడుతున్నారని, మరీ ముఖ్యంగా హిందూ ముస్లింల ఐక్యత బలంగా ముందుకు వస్తున్నదని, వీటిపై వారు తీవ్ర ఆందోళనకు గురయ్యారని అర్థం అవుతుంది. ఈ ప్రాంతంలోనే మార్షల్ లా పేరిట 18మందిని ఉరితీయడం, 23మంది నాయకులని ప్రవాసానికి పంపటం, 1229మందికి యావజ్జీవ కారాగార శిక్షలు విధించడం జరిగింది. జలియన్ వాలాబాగ్ మారణకాండ ముందు, ఆ తరువాత ఘటనలు పరిశీలిస్తే స్వాతంత్ర్యోద్యమం, అందులో ప్రజల సమరశీలత దాన్ని భరించలేని నాటి పాలకుల నిరంకుశ వైఖరి కళ్లకు కట్టినట్టు కనపడుతున్నది. అందువలన నేడు అసామాన్యంగా పెరుగుతున్న నిర్బంధం ప్రజా ఉద్యమాలను సహించలేని నేటి పాలకుల నియంతృత్వ పోకడలను అర్థం చేసుకోవడానికి జలియన్ వాలాబాగ్ ఉజ్వల చరిత్ర మనకెంతో దోహదపడుతుంది. పాలకుల రంగు, జాతి కన్నా వారి వర్గ ప్రయోజనాలు ఎంత తీక్షణంగా ఉంటాయో, వాటిని తిప్పికొట్టడానికి జన బాహుళ్యాన్ని ప్రజా పోరాటాలలోకి తీసుకురావలసిన ఆవశ్యకత ఏమిటో మనం అర్థం చేసుకోవాలి.

ఆ రోజులే గుర్తొస్తున్నాయి...

కాలం మారింది. విధానాలు, పద్ధతుల్లో కూడా కనీసం రూపంలోనైనా చాలా మార్పులు వచ్చాయి. నేడు బీజేపీ పాలన గత ప్రభుత్వ పాలనలో ఉన్న అనేక నిరంకుశ పోకడలను, నియంతృత్వ పద్ధతులను పరాకాష్టకు తీసుకువచ్చింది. రౌలట్ చట్టాన్ని తలదన్నే హింసాత్మక చట్టాలు పదేపదే అమలులోకి వస్తున్నాయి. 1975 ఎమర్జెన్సీ కాలం నాటి నిర్బంధానికి వంద రెట్లు ఎక్కువ నిర్బంధం అమలు చేయబడుతున్నది. ప్రభుత్వాన్ని విమర్శించారన్న కక్షతో అనేకమంది సామాజిక కార్యకర్తలు, రచయితలు, కవులు, వ్యంగ వ్యాఖ్యాతలు చివరికి కార్టూనిస్టులను కూడా జైళ్లలో కుక్కుతున్నారు. అనేకమంది మేధావుల పుస్తక పరిచయాలను, పుస్తకావిష్కరణలను సైతం కేంద్ర ప్రభుత్వం అర్థంతరంగా నిలిపివేస్తున్నది. ఆర్ఎస్ఎస్ (హిందూత్వ శక్తులు) కార్యకర్తలు నిస్సిగ్గుగా నిలబడి అల్లర్లు సృష్టిస్తున్నారు. 'ఉపా చట్టం' ఎన్ఐఎ అరెస్టులు అడ్డూ అదుపు లేకుండా సాగుతున్నాయి. ప్రభుత్వ ఉన్నతాధికారులకే కాకుండా ఈ జాడ్యం ఉన్నత న్యాయస్థానాలకు కూడా ఎగబాకింది.

అందువలన ఈ నేపథ్యంలో జలియన్ వాలాబాగ్ మారణకాండనే కాకుండా అందుకు కారణమైన రౌలట్ చట్టం, దాని వెనకాల ఉన్న నాటి వలస పాలకుల ఆక్రోశం, దానికి వ్యతిరేకంగా స్వాతంత్ర్యోద్యమం ఒక ప్రజా ఉద్యమంగా మారిన తీరు అన్నింటిని కలగలిపి మనం అర్థం చేసుకోవాలి. ప్రజాస్వామ్యాన్ని, వాక్‌స్వాతంత్ర్యాన్ని, రాజ్యాంగం ఇచ్చిన హక్కులను కాపాడేశక్తి అందుకు పీడిత వర్గాలను కలుపుకురాగల శక్తి కార్మికవర్గానికే ఉంది. దానికి ప్రాతినిధ్యం వహించే కమ్యూనిస్టుపార్టీకి మాత్రమే ఉంటుంది. ఇది చరిత్ర నేర్పేపాఠం.

సెల్: 9490098422



నిలదీత

అడుగు ముందుకేయడం
విజయం, కానీ
అన్ని అడుగులై ఆకాశానికి ఎదగడం
ఎవరితరం!

నీ చూపుడు వేలు
ఇంకా మావైపుకే చూపిస్తోంది
నడకలో, నడతలో
ఏదో అపసవ్యం
పసికడుతోంది.

వంకర టింకర రీతులు
ఉచ్ఛనీచా చూపులు
వివక్షలూ విద్వేషాలూ
కల్మషాల కాలువలూ
కంపును తెగ
నింపుతూనేవున్నాయి.

ఎంత మురికిని ఎత్తిపోసినా
మనసుముంత శుభ్రమవుతలే
అందుకేనేమో నువ్వు మా
నగరం నడిబొడ్డులోకొచ్చి మరీ
నిలబడి నిలదీస్తున్నావ్

తలలెత్తలేని మా అశక్తకు
శక్తిని నింపే నీ ప్రయత్నం
ప్రతిమలా ప్రత్యక్షమైంది.

ఇప్పుడు నిన్ను చూస్తే చాలు
మా గుండెతో పాటు
తలల్నీ ఎత్తి నడుస్తాము.

- ఆనంద



ప్రజాస్వామ్య విలువలపై అంబేద్కర్ ఆలోచనలు

భారత దేశంలో ప్రజాస్వామ్య వ్యవస్థ కూలితే మొట్ట మొదటి బాధితులు దళితులు, మైనారిటీ, అణగారిన వర్గాలు. వీళ్ళ నిశ్శబ్దం సామాజిక వ్యవస్థలపై రాజ్య ప్రభావాన్ని చాల నగ్నంగా మన కళ్ళ ముందుకు ఆవిష్కరిస్తుంది. ఇది వారి నిశ్శబ్దం లాగా చూడకుండా రాజ్యం వారిని ఎలా సైలెన్సింగ్ చేస్తుందో చూడాలి.

ఈ విషయం పైన ఇంకొంచెం లోతుగా మరి ముఖ్యంగా డాక్టర్ అంబేద్కర్ గారి ఆలోచనలతో విశ్లేషించాలి. రాజకీయ ప్రజాస్వామ్య, సామాజిక ఉద్యమాల విజయానికి అవసరమైన పరిస్థితుల దృష్టికోణంలో నుంచి ఆలోచించాలి. డాక్టర్ అంబేద్కర్ దృష్టిలో, ప్రజాస్వామ్యం అంటే ఒక రూపం, ఒక పద్ధతి, నెత్తురు చుక్క పడకుండా ప్రజల జీవితాలలోని సామాజిక, ఆర్థిక అంశాల్లో విప్లవాత్మక మార్పులను తీసుకువచ్చే వ్యవస్థ. అలాగే, ప్రజాస్వామ్య విలువలను సామాజిక సంబంధాలలో మాత్రమే వెతకాలనీ, అదొక జీవనవిధానం అంటారు, అది ప్రజలను, సమాజాన్ని కలిపి ఉంచే వ్యవస్థ అని కూడా అంటారు.

ప్రజాస్వామ్యాన్ని నిర్వచించడమే కాకుండా అది అనేక చిక్కులు నుండి అధిగమించడానికి గల ఉపకరణాలను అందిస్తుందని అంబేద్కర్ ఆలోచించారు. ప్రజాస్వామ్య దృక్కోణం ఎల్లప్పుడు సామాజిక ధోరణిలో ఉండాలని, రాజకీయ కోణంలో చూడకూడదని వారు అభిప్రాయపడ్డారు. సోదరభావం, సమూహ భావం వంటివి మాత్రమే సామాజిక సంబంధాలను గట్టిపరుస్తాయి. అంబేద్కర్ గారి అభిప్రాయంలో రక్తపు చుక్క రాలకుండా విప్లవాత్మకమైన మార్పులు రావాలంటే అవి సామాజిక సంబంధాలలో మాత్రమే రావాలి.

అయితే ఇప్పటివరకు భారత ప్రజాస్వామ్య ప్రయాణం అంత సాఫీగా, సులభంగా ఏమిజరగలేదు. ఎమర్జెన్సీ, సిక్కుల ఊచకోత, గోధ్రా అల్లర్లు, అసంఖ్యాకమైన కుల దౌర్జన్యాలు వంటి అనేక సవాళ్లను అది ఎదుర్కొంది. భారత దేశ స్వతంత్ర, ప్రజాస్వామ్య ఫలాలను భారతీయ జనాభాలో ఎక్కువ శాతం అనుభవించ లేదు. నీరు, విద్య, ఆరోగ్యం వంటి కనీస సౌకర్యాలు ఇప్పటికీ వారికి అందుబాటులోలేని పరిస్థితి. ఇటీవల కోవిడ్ ఆ సంక్షోభ వైఫల్యాన్ని చూపింది.



డాక్టర్ సతీష్ చెన్నూరు

ప్రజాస్వామ్యంలో సవాళ్లు, పరిమితులు, వైఫల్యాల గురించి, సెప్టెంబర్ 1943లో ఢిల్లీలో జరిగిన ఆల్ ఇండియా ట్రేడ్ యూనియన్ వర్కర్స్ స్టడీ క్యాంపులో ప్రసంగిస్తూ డాక్టర్ అంబేద్కర్ "పార్లమెంటరీ ప్రజాస్వామ్యం అనేది వంశపారంపర్య పాలిత వర్గం, వంశపారంపర్య పాలక వర్గం" మధ్య ఉన్న సైద్ధాంతిక విభజన, ఆ విభజన క్రమంగా జరిలంచేసి పాలిత వర్గాలు అనుసరించేలా చేశారు. ఇప్పుడున్న రూపంలో పార్లమెంటరీ ప్రజాస్వామ్యం పేదలకు గాని, కార్మిక వర్గం లేదా అణగారిన వర్గాలకు గాని పనికిరాదని కూడా ఆయన అన్నారు. ఒకవేళ అది విజయవంతం అవ్వాలంటే ఈ కులాలు, కార్మిక వర్గాలు ప్రభుత్వంలో క్రియాశీలమైన బాధ్యత పోషించాలి. రెండవది పెట్టుబడిదారీ, మత తత్వ పార్టీలతో దూరంగా ఉండాలని కూడా ఆయన సూచించారు. అలా జరగక, ఒకవేళ పార్లమెంటరీ ప్రజాస్వామ్యం విఫలమైతే, అది తిరుగుబాటు, అరాచకం, మతతత్వానికి దారి తీస్తుంది అని అన్నారు. అయితే ఒక విజయవంతమైన ప్రజాస్వామ్యానికి ఎటువంటి పరిస్థితులు అవసరం? ఆ పరిస్థితులను డాక్టర్ అంబేద్కర్ ఆర్థిక, సామాజిక నిర్మాణంలో చూశారు. ప్రతి ఒక్కరికి రాజకీయ భావవ్యక్తీకరణ స్వేచ్ఛ, ప్రాథమిక హక్కులు ఉండటం. మరో మాటలో చెప్పాలంటే, రాజకీయ ప్రజాస్వామ్యం విజయం సాధించాలంటే సామాజిక, ఆర్థిక స్వేచ్ఛలలో స్వతంత్రం సంపాదించడం.

సామాజిక న్యాయం అనే మౌలిక సూత్రాల పైన సామాజిక ప్రజాస్వామ్యం ముడిపడి ఉంటుంది. న్యాయం ఎల్లప్పుడూ 1.సమానత్వంతో కూడిన ఆలోచనలు, 2. నియమాలు, నిబంధనలు, 3.హక్కులకు సంబంధించిన విలువలతో ముడిపడి ఉంటుంది. డాక్టర్ అంబేద్కర్ సామాజిక న్యాయ భావనలో సమానత్వానికి ప్రధాన స్థానం ఉంది. స్వేచ్ఛ, స్వతంత్ర, సౌభ్రాతృత్వం అనేవి సమానత్వపు ఉన్నత భావనలు. అయితే భారతీయ కుల వ్యవస్థ వీటిని దళితులకు నిరాకరించింది. క్లుప్తంగా సామాజిక ప్రజాస్వామ్యం అంటే సమానత్వం, సౌభ్రాతృత్వం ఆధారంగా ఏర్పడిన సామాజిక సంబంధాలు తప్ప మరేమీ కాదు.

సామాజిక సంబంధాలను విధానాల రూపంలో చూడాలనుకుంటే ముందుగా మనకు తట్టేవి రిజర్వేషన్లు, గ్రామీణ హామీ చట్టం, వెనుకబడిన వర్గాలకు పథకాలు వంటివే అయితే 1990ల నుంచి నయా-ఉదారీకరణ వలన, కనీస అవసరాలు (కూడు, గూడు, బట్ట) తీర్చడంలో రాజ్యం వెనకడుగు వేయడం మూలాన ఈ విధానం పక్కదారి పట్టింది. అవి చివరకు ప్రణాళికా సంఘాన్ని చంపే వరకు వచ్చింది. 1990ల తర్వాత మార్కెట్టుపైన ప్రయివేటు రంగం ఎక్కువ నియంత్రణను కలిగి ఉందని, అందువలన ప్రణాళికలకు ఇక కమిషన్ అనవసరమని, దాన్ని ఉపసంహరించి దానిబదులుగా నిటి అయోగ్ తెచ్చారు. అయితే ప్రయివేటీకరణ లేదా ప్రయివేటు ప్రాముఖ్యత పెరుగుతున్న తరుణంలోనే ప్రణాళికా సంఘం అవసరం ఎంతైనా ఉంది.

> డాక్టర్ అంబేద్కర్ ఆర్థిక విధానం మార్క్సిస్టు ఆలోచనా ధోరణి అయిన శాసన-రాజ్య సోషలిజంకు ప్రత్యామ్నాయ ఆర్థిక విధానం. ఆయన విధానంలో రాజ్యాంగం ప్రధాన పాత్ర పోషిస్తుంది. అలా అయితే శాసనసభ గాని, కార్యనిర్వాహక వ్యవస్థగానీ రాజ్యాంగాన్ని మార్చలేవు. ఈ విధంగా ప్రజాస్వామ్యంలో సోషలిజానికి స్థిరత్వం సాధించవచ్చు, నియంతృత్వాన్ని నివారించవచ్చు. నిశితంగా పరిశీలిస్తే ప్రజాస్వామ్య వ్యవస్థ పనితీరులో కొన్ని వ్యవస్థలు కీలక పాత్ర పోషిస్తాయి, అలాగే అవి ంప్రజాస్వామ్య విలువలను అస్థిరపరచనూ గలుగుతాయి. అవి కుల వ్యవస్థ, భాష, మతం.

మరి ఆర్థిక ప్రజాస్వామ్యం గురించి ప్రశ్న వచ్చినప్పుడు డాక్టర్ అంబేద్కర్ ఒక నిర్దిష్ట రకమైన సోషలిజం రూపంలో ప్రత్యామ్నాయ ఆర్థిక చట్రాన్ని ప్రతిపాదించాడు. అందులో కీలకమైన వ్యవసాయం, విద్య, వైద్యం, బీమా, రాజ్యం చేతిలో ఉండాలని మిగతా ప్రయివేటు వారి చేతులో పెట్టాలని సూచించారు. ఇప్పుడు మనం చూస్తున్నది అంబేద్కర్ ప్రతిపాదించిన సిద్ధాంతానికి పూర్తిగా విరుద్ధం. డాక్టర్ అంబేద్కర్ ఆర్థిక విధానం మార్క్సిస్టు ఆలోచనా ధోరణి అయిన శాసన-రాజ్య సోషలిజంకు ప్రత్యామ్నాయ ఆర్థిక విధానం. ఆయన విధానంలో రాజ్యాంగం ప్రధాన పాత్ర పోషిస్తుంది. అలా అయితే శాసనసభ గాని, కార్యనిర్వాహక వ్యవస్థగానీ రాజ్యాంగాన్ని మార్చలేవు. ఈ విధంగా ప్రజాస్వామ్యంలో సోషలిజానికి స్థిరత్వం సాధించవచ్చు, నియంతృత్వాన్ని నివారించవచ్చు. నిశితంగా పరిశీలిస్తే ప్రజాస్వామ్య వ్యవస్థ పనితీరులో కొన్ని వ్యవస్థలు కీలక పాత్ర పోషిస్తాయి, అలాగే అవి ప్రజాస్వామ్య విలువలను అస్థిరపరచనూ గలుగుతాయి. అవి కుల వ్యవస్థ, భాష, మతం.

నిచ్చెన మెట్ల కుల వ్యవస్థ స్వేచ్ఛ మరియు సౌభ్రాతృత్వంను నిరాకరిస్తుంది. హిందూ మత వ్యవస్థ యొక్క ముఖ్యమైన లక్షణం వేరు చేయడం, బహిష్కరించడం, అంటరాని వారిని చేయడం, ఇవి సామాజిక వ్యతిరేక స్ఫూర్తి చిహ్నాలు. ఈ వేరుచేయబడిన దళితులు ఇప్పటికి నీళ్ల కోసం, నీడ కోసం పోరాడుతూనే ఉన్నారు. మరోవైపు, రాజ్యం మాత్రం దాని రోజువారీ కార్యకలాపాలను రాజకీయాల చుట్టూ మాత్రమే తిప్పుతుంది, ఆ ప్రక్రియలో ఆర్థిక, సామాజిక పరమైన అంశాలు నిర్లక్ష్యం చేయబడతాయి. ప్రజాస్వామ్య స్ఫూర్తిని చంపే సామర్థ్యం కులానికి ఉందంటారు అంబేద్కర్. అలాగే దానికి ప్రజా ధార్మిక భావాన్ని నాశనం చేయగల సామర్థ్యం కూడా ఉందంటారు. ఉదాహరణకు ప్రతి వ్యక్తి తన కుల చట్రం లోపల మాత్రమే పని చేస్తాడు, అతను, ఆమె వారి కులానికి అత్యంత విధేయత చూపుతారు. వాక్కు నుండి రాతకు మారక ముందు, సాహిత్య, విద్య మీద ఉన్న పట్టుతో, కొన్ని సామాజిక వర్గాలు (బ్రాహ్మణులు), వాటిని నియంత్రణ సాధనాలుగా ఉపయోగించాయి. 1. అధికారంలో ఉన్న వారికి (పరిపాలన, చట్టపరమైన, ఆర్థిక పరమైన ఖాతాలు, రికార్డ్ కీపింగ్) 2. వైదిక ఆచారాలపైన వారి పట్టు. ఈ రెండు, ఒకటి మెటీరియల్ మరొకటి సింబాలిక్ (ఆచారం). ఈ రెండింటితో వారు సమాజం పైన సామాజిక ఆధిపత్యాన్ని సాధించారు. భాషాప్రయుక్త రాష్ట్రాల ఆలోచనతో అంబేద్కర్ ఈ ఆధిపత్యాన్ని పంక్చర్ చేయడానికి ప్రయత్నం చేశారు. సాంస్కృతిక బహుళత్వం, రాజకీయ ప్రజాస్వామ్యం అలాగే సామాజిక భిన్నత్వం, రాజకీయాధికారం మధ్య ఉద్రిక్తతలను తగ్గించడానికి ప్రయత్నిం చాడు. ఈ సందర్భంలోనే రాజ్యాంగం దృష్టి సారించాల్సిన రెండు అంశాలను అంబేద్కర్ తన 'రాష్ట్రాలు - మైనారిటీలు'లో వెలిబుచ్చారు. భాషా పరమైన రాష్ట్రాలు (ఒక భాష ఒక రాష్ట్రం) ఏర్పర్చడం వలన సామాజిక ఆధిపత్యం, రాజకీయ ప్రజాస్వామ్య చిక్కులను విడిపించవచ్చు, అలాగే దళితులు కూడా అభివృద్ధి ప్రక్రియలో పాల్గొనడం జరుగుతుంది, సమానత్వం, సమన్యాయం పొందగలుగుతారు.

కానీ అంబేద్కర్ ఆలోచనలు సరిగ్గా అర్థం చేసుకోకపోవడం వలన భాషాపరమైన బహుళత్వం, బహుభాషా తత్వాలకు అంతరాయం ఏర్పడి "చతుర్వర్ణ భాషలను" సృష్టించింది. (భీమా కోరెగావ్ కేసులో అరెస్ట్ అయిన హనీ బాబు ఉపయోగించిన పదం). చతుర్వర్ణ భాషలంటే-సంస్కృతం, హిందీ,షెడ్యూల్డ్ మరియు నాన్-షెడ్యూల్డ్ భాషలు. ఈ వర్గీకరణ వలన కొత్త చీలికలు, వైరుధ్యాలు బయటపడ్డాయి. దీని వలన మెజారిటీ, మైనార్టీ, ఆధిపత్య, సబార్డి నేట్, ప్రివిలేజ్డ్, అండర్ ప్రివిలేజ్డ్ వంటి బైనరీ సృష్టించ బడ్డాయి. ఇంగ్లీష్ ఈ బైనరీ బయట ఉండి అంటరానిదిగా మారి అట్టడుగు వర్గాలకు అందుబాటులోకి వచ్చి భాషను ప్రజాస్వామీకరణ చేసింది.

75ఏండ్ల క్రితం భారతదేశ స్వాతంత్ర్యం మత ప్రాతిపదికన కాకపోయినా మతం ప్రధాన పాత్ర పోషించింది. 1976లో మాత్రమే సోషలిస్టు, సెక్యులర్ అనే పదాలను రాజ్యాంగ పీఠికలో చేర్చాం. మతపరమైన అసహనం దేశాన్ని సంక్షోభంలోకి నెట్టుతుంది, ఆ సంక్షోభం రాజ్యాంగపరమైన, ప్రజాస్వామ్య పరమైనదని అంబేద్కర్ అన్నారు. ఈ పరిమితులుకు జవాబులు అంబేద్కర్ బౌద్ధమతంలో వెతికారు. ఆయన బౌద్ధమతాన్ని ఫ్రెంచ్ విప్లవంతో పోల్చి చూశారు. బౌద్ధమతం దళితులకు ప్రజాస్వామ్యం, సామ్యవాదానికి గల మార్గాలను చూపగలదు అని అన్నారు.

భారతదేశంలో సామాజిక ప్రజాస్వామ్యాన్ని మాత్రమే గౌరవించాలని డాక్టర్ అంబేద్కర్ కోరారు. రాజకీయ ప్రజాస్వామ్యం విజయం సాధించాలంటే దాని పునాది సామాజిక ప్రజాస్వామ్య భావాలతో ఉందన్నారు. 26 జనవరి 1950న ప్రసంగిస్తూ అంబేద్కర్, "మనం వైరుధ్యాల జీవితంలోకి ప్రవేశించబోతున్నాం. రాజకీయాల్లో ఒక మనిషి, ఒక ఓటు, ఒక విలువ అనే సూత్రాన్ని పాటించాం, అయితే సామాజిక, ఆర్థిక నిర్మాణంలో ఒక మనిషి, ఒక విలువ అనే సూత్రాన్ని మాత్రమే పాటిస్తున్నాం" అని అన్నారు. ఈ వైరుధ్యాలను అధిగమించాలంటే దేశాన్ని మతాన్ని కన్నా గొప్పగా చూడాలని కోరారు. లేకపోతే మన స్వాతంత్ర్యం ప్రమాదంలో పడుతుందని కూడా హెచ్చరించారు. ఆయన ఆలోచనలు, విలువలు గౌరవించి పాటిస్తే సామాజిక ప్రజాస్వామ్య విలువలను పాటించినట్లవుతుంది.

(ఏప్రిల్ 14 అంబేద్కర్ జయంతి)

5 హైదరాబాద్ నవతెలంగాణ
మానవి
గురువారం 13 ఏప్రిల్ 2023
www.navatelangana.com



కొన్ని సెట్టింగ్‌లు మార్చుకుంటే...

ప్రపంచవ్యాప్తంగా స్మార్ట్‌ఫోన్ వాడకం రోజురోజుకూ పెరిగిపోతుంది. గతంలో ఫోన్ అంటే కేవలం మాట్లాడుకోవడానికి, మెసేజ్‌లు పంపుకోడానికి మాత్రమే అనుకునే జనం ఇపుడు ప్రతి అవసరానికి ఫోన్ తప్పనిసరైంది. ముఖ్యంగా కరోనా మహమ్మారి నేపథ్యంలో పెట్టిన లాక్‌డౌన్ కారణంగా స్మార్ట్‌ఫోన్ వినియోగం విపరీతంగా పెరిగింది. పిల్లలకు కూడా ఆన్‌లైన్ క్లాసుల ట్రెండ్ అప్పుడే మొదలైంది. దీంతో పెద్దల నుంచి పిల్లల వరకూ స్మార్ట్ ఫోన్ వాడకం తప్పనిసరైంది. స్మార్ట్ ఫోన్ వాడకం వల్ల లాభాలు ఎన్ని ఉన్నాయో? నష్టాలు కూడా అలాగే ఉన్నాయని వైద్య నిపుణులు చెబుతున్నారు. స్మార్ట్‌ఫోన్ ఎక్కువగా వినియోగిస్తే మెదడు ఆలోచించే స్థాయి తగ్గిపోతుందని మానసిక వైద్య నిపుణులు చెబుతున్నారు. అలాగే ఎక్కువసేపు స్మార్ట్ ఫోన్ వినియోగిస్తే ముఖ్యంగా వయసుతో సంబంధంలేకుండా నిద్రలేమి సమస్య వేధిస్తుందని పేర్కొంటున్నారు. స్మార్ట్ ఫోన్ నుంచి వెలువడే కిరణాల వల్ల నిద్రలేమి సమస్య వస్తుందని చెబుతున్నారు. అందువల్ల మీరు వాడే ఫోన్లో కొన్ని సెట్టింగ్స్ మారిస్తే ఈ సమస్య నుంచి గట్టెక్కవచ్చని టెక్ నిపుణులు చెబుతున్నారు. స్మార్ట్ ఫోన్లో మార్చాల్సిన సెట్టింగ్స్ ఏంటో ఓ సారి తెలుసుకుందాం.

- ఫోన్ కాంతి ద్వారా వచ్చే నీలి కాంతి ఉద్గారాలు మీకు నిద్రపోయే సమయాన్ని తగ్గిస్తుంది. ముఖ్యంగా శరీరంలో ఉత్పత్తయ్యే మెలటోనిన్ అనే హార్మోన్‌ను అడ్డుకోవడం వల్ల నిద్ర సామర్థ్యం తగ్గుతుందని నిపుణులు చెబుతున్నారు. ఈ సమస్యను అధిగమించడానికి ఆండ్రాయిడ్ 7.1 వెర్షన్ నుంచి నైట్ లైట్ అనే ఫీచర్‌ను పరిచయం చేశారు. ఇది మనం ఫోన్ వినియోగించే లొకేషన్ ఆధారంగా సహజ కాంతికి అనుగుణంగా డిస్‌ప్లే ద్వారా విడుదలయ్యే బ్లూ లైట్‌ను తగ్గిస్తుంది. ఈ అప్‌డేట్ మీరు త్వరగా నిద్రపోవడానికి సహాయపడుతుంది. ముందుగా ఫోన్‌లోని సెట్టింగ్స్ ఓపెన్ చేసి డిస్‌ప్లే అండ్ బ్రైట్‌నెస్‌ను సెలెక్ట్ చేసి అందులోని నైట్ లైట్/రీడింగ్ మోడ్‌కను ఆన్ చేస్తే కళ్ల ఇబ్బంది లేకుండా ఉంటుంది.
- ప్రస్తుత రోజుల్లో యువత ఎక్కువగా యూట్యూబ్ వీడియోలకు ఎడిక్ట్ అయ్యారు. ముఖ్యంగా నిద్రపోయే సమయంలో నిద్ర పోకుండా యూట్యూబ్ చూసే వాళ్లు ఉంటారు. నిద్రవేళ రిమైండర్ ఆన్ చేసి మీరు వీడియోలను చూడటం ఆపివేసేందుకు, నిద్రించడానికి నోటిఫికేషన్‌ను పొందే అవకాశం ఉంది. ముందుగా యాప్‌ని తెరిచి పైన కుడి వైపున ఉన్న ప్రొఫైల్ చిహ్నంపై క్లిక్ చేసి, ఆపై సెట్టింగ్స్ ఓపెన్ చేసి జనరల్ సెలెక్ట్ చేసి నిద్ర సమయాన్ని రిమైండ్ చేయ్ అనే ఆప్షన్‌ను సెలెక్ట్ చేయాలి. గూగుల్‌ని ఆన్ చేసి అవసరమైన విధంగా నిద్రపోయే సమయాన్ని సెట్ చేసుకుంటే సరిపోతుంది.

వాస్తవ జీవితాలే ఆమె రచనలు

మహిళలు నేటికీ కొన్ని రంగాలలో రాణించడానికి పోరాడుతూనే ఉన్నారు. ఆ కాలం నుండి ఈ ఆధునిక కాలం వరకు సాధికారత కొరకు వారి పోరాటం సాగుతూనే ఉంది. గతంలో 'ఆడపిల్లలకు పెద్ద చదువులెందుకు, అక్షరం ముక్క తెలిస్తే చాలు' అనే వారు. అటువంటి రోజులలో ఓ రచయిత్రిగా తనకంటూ ఒక గుర్తింపు తెచ్చుకోవడం సామాన్యమైన విషయం కాదు. స్వాతంత్ర్యం తర్వాత తెలుగు కథకుల్లో, నవలా కారుల్లో వాసిరెడ్డి సీతాదేవి ప్రముఖ పాత్ర వహించారు. తన రచనల ద్వారా స్త్రీలలో చైతన్యం తీసుకువచ్చారు. నేడు ఆమె వర్ధంతి సందర్భంగా ఆమె పరిచయం నేటి మానవిలో...



గుంటూరు జిల్లా చేబ్రోలులో వాసిరెడ్డి రాఘవయ్య, రంగ నాయకమ్మలకు 1933 డిసెంబర్ 15న జన్మించారు వాసిరెడ్డి సీతాదేవి. చిన్నతనంలో తన చుట్టూ జరుగుతున్న సంఘటనలు ఈమెను ప్రభావితం చేశాయి. ఫ్యూడల్ కుటుంబంలో పుట్టి సాంప్రదాయాల మధ్య పెరిగారు. ఆనాటి స్త్రీలకు అసలు తాము వివక్షను ఎదుర్కొంటున్నామనే కనీస స్పృహ కూడా లేదు. స్త్రీ లంటే ఇలాగే వుండాలనే భావాలతో కుచించుకుపోయిన జీవితాన్ని గడిపేవారు. వీటన్నింటినీ చూస్తూ పెరిగిన సీతాదేవి వివక్షను భరించలేకపోయేవారు. గ్రామంలో స్త్రీలు ఎదుర్కొంటున్న సమస్యలు, గృహహింస, వివక్షను సూటిగా ప్రశ్నించే వారు. ఈ పురుషాధిక్య సమాజం స్త్రీని వంటింటి కుందేలుగా, కోర్కెలు తీర్చుకునే యంత్రంగా మార్చడాన్ని తట్టుకోలేక పోయారు. సొంత వ్యక్తిత్వంలేని స్త్రీ జీవితమంటే ఆమెకు అసహ్యం. నిత్యం హింసతో కూడుకున్న కుటుంబ జీవితమన్నా ఆమెకు గిట్టేది కాదు. అందుకే వివాహం జోలికి పోకుండా ఆ కాలంలోనే తన జీవితాన్ని తానే తీర్చిదిద్దుకున్న సాహసి సీతాదేవి.






ఆలోచింప జేస్తాయి

"సామాజిక సమస్యలనూ, జీవితాలనూ, వ్యథలనూ, గాథలనూ, ఆశలనూ, నిరాశలనూ, నిజాయితీతో, సృజనాత్మకంగానూ, కళాత్మకంగానూ చిత్రించినప్పుడు ఆ రచన పాఠకుల్ని ఆలోచింప చేస్తుంది. మనుషులు మారడం అంటే వారి ఆలోచనలు మారడమే" అనే వాసిరెడ్డి సీతాదేవి రచనలు నిత్య జీవితాలను, ఆ నాటి కాల పరిస్థితులను మహిళల మనోభావాలను చక్కగా చిత్రీకరిస్తాయి. జీవనదిలా ప్రవహించే భావనదిలో పాత్రలను పడవలుగా చేసుకొని సాహితీయాత్ర సాగించారు సీతాదేవి.

ప్రశ్నతోనే మొదలు

సీతాదేవి సాహితీ యాత్రను, జీవిత యాత్రను వేరు వేరుగా చూడలేము. "ప్రశ్న నుంచే నా జీవితం ప్రారంభమయింది. ప్రశ్న నుంచే నా సాహితీ జీవితం కూడా ప్రారంభమైంది" అంటారు ఆమె. ప్రశ్నల మీద ప్రశ్నలు వేసి తల్లిని విసిగించేవారు. ఆడ పిల్లలంటే అమ్మలాటలు, బొమ్మలాటలకు పరిమితమైన ఆ రోజుల్లోనే మగపిల్లలతో గోళీలు ఆడేవారు. మగరాయుడులా ఆ గంతులేంటి అంటూ తనను శాసించినప్పుడల్లా అంతరాంతరాల్లో ఏదో తిరగబడుతున్నట్లై ఏడుస్తూ రాసుకునేవారు. కోనేట్లో ఆడవాళ్ళ శవాలే ఎందుకు తేల్తాయి, మగవాళ్ళ శవాలు ఎందుకు తేలవు అనే ప్రశ్నలు వేధించినప్పుడు రాసుకున్నారు. ఎప్పుడూ మగవాడే ఆడదాని జట్టుపట్టుకొని రోడ్డు మీదకు ఎందుకు ఈడుస్తాడు. అన్న ప్రశ్నకు జవాబు దొరికినప్పుడు మధనపడి రాశారు. తన చుట్టూ వున్న జీవితం గురించిన ప్రశ్నలు, తెలిసీ తెలియని సమాధానాలు తన మస్తిష్కమే కాగితంగా, తన ఆలోచనలే కలంగా రాసుకున్నారు.





ఎలాంటి ఆటంకం లేకుండా

ఈమె రచించిన మొదటి నవల 'జీవితం అంటే' (1950), మొదటి కథ 'సాంబయ్య పెళ్ళి' (1952). అప్పటి నుండి 1955 వరకు తన రచనలకు ఎలాంటి ఆటంకం లేకుండా కొనసాగించారు. ఆరేండ్ల విరామం తర్వాత 1963లో ఓ ముక్కోణపు ప్రేమకథను తీసుకొని 1963లో 'అడవి పల్లె' నవలగా మలిచారు. ఆనాటి యువత మధ్య సాగే ప్రేమలు, ద్వేషాలు, ఆప్యాయతలను ఈ నవలలో చక్కగా చిత్రీకరించారు ఆమె. సుమారు 40 నవలల వరకు రచించారు. ఈమె రచించిన మరీచిక నవల ఓ చర్చకు దారితీసింది. విప్లవ భావాలు కలిగిన ఓ మహిళా పాత్రను ఇందులో చూపించదనే ఆరోపణతో అప్పటి ప్రభుత్వం ఈ నవలను నిషేధించింది.

కథా రచయితగా...

నవలా రచయితగా అద్భుతమైన రచనలు చేసిన సీతాదేవి కథలను కూడా అంతే చక్కగా రచించారు. కుటుంబ సంబంధాలు, మానవ సంబంధాలు, అభ్యుదయ భావాలు, సామాజిక విశ్లేషణలే కథా వస్తువులుగా సుమారు 100కు పైగా కథలను రాశారు. మహిళలను జీవితాలను అద్వితీయంగా చూపించారు. స్త్రీల పట్ల సమాజంలో రావాల్సిన మార్పు ఆమె కథల్లో స్పష్టంగా కనిపిస్తుంది. అలాగే 'అతని కథ', 'మిస్టర్ ముకుందం', 'అమ్మమ్మ చెప్పని కథ', 'విభ్రమ' కథలు పాఠకులను విశేషంగా ఆకట్టుకున్నాయి. కండ్ల ముందు కనిపించే వ్యక్తులు, సమస్యలు అర్థం చేసుకుంటే వాటిని చక్కగా కథలుగా మార్చవచ్చని 'నా కథ రాయవూ'లో వివరంగా చెప్పారు.

అనుభవాలే అక్షరాలుగా

సీతాదేవి దృష్టిలో రచనలంటే ఏదో ఊహించి ఓ అందమైన ప్రపంచానికి అక్షరాల అద్దడం కాదు. మన చుట్టూ జరిగే జీవన పోరాటాలను, మన అనుభవాలను అక్షరాలుగా మలచడం. అది ఆమె రచనల్లో స్పష్టంగా కనిపిస్తుంది. ఈమె చదివింది ఐదవ తరగతి వరకే అయినా ప్రైవేట్‌గా హిందీ ప్రచారక్, ప్రవీణ, సాహిత్య రత్నలో ఉత్తీర్ణులయ్యారు. నాగపూర్ విశ్వవిద్యాలయం నుండి బి.ఎ., ఎమ్.ఎ. పూర్తిచేశారు.



అనువాదాలు

సమకాలీన సమాజాన్ని తీర్చిదిద్దే సామాజిక ఆర్థికాంశాలను తమ రచనలకు వస్తువుగా తీసుకుంటారామె. గ్రామీణ, పట్టణ జీవితాలను నిశితంగా పరిశీలిస్తూ, నేటి యువత, ఆయా పరిస్థితుల్లో ఎదుర్కొంటున్న సమస్యలను వివరిస్తూ తమ రచనల ద్వారా వాటికి పరిష్కార మార్గాలను సూచించారు. వీరి నవలల్లో చాలా భాగం కన్నడం, హిందీ భాషల్లోకి అనువాదం పొందాయి. వీరు రాసిన 'మట్టిమనిషి', 'వైతరణి' నవలలను నేషనల్ బుక్ ట్రస్ట్ వారు 14 భాషల్లోకి అనువాదం చేయించి ప్రచురించారు. 'మృత్యుంజయుడు (1988) శివసాగర్ మిశ్ర రచించిన "అక్షత్" హిందీ నవలకు తెలుగు అనువాదం, 'మట్టిమనిషి' నవలకు ఉస్మానియా విశ్వవిద్యాలయం ఫైనల్ ఎం.ఎ విద్యార్థులకూ, "రాబందులు రామచిలుకలు" నవలను కాకతీయ విశ్వవిద్యాలయం డిగ్రీ విద్యార్థులకూ పాఠ్యగ్రంధాలుగా నిర్ణయించాయి. అలాగే సీతాదేవి రచనల మీద అనేక విశ్వవిద్యాలయాల్లో పలువురు విద్యార్థులు పీహెచ్‌డీ, యం.ఫిల్ కోసం పరిశోధనలు చేశారు. చేస్తు న్నారు. ఆమె తన రచనలకు గాను ఎన్నో అవార్డులు కూడా పొందారు.

సినిమాలుగా...

సీతాదేవివి సుమారు 40 నవలలు, 10 కథా సంకలనాలు, 8 అనువాద పుస్తకాలు, 5 పిల్లల పుస్తకాలు వెలువడ్డాయి. ఈమె నవలల్లో కొన్ని తెలుగు సినిమాలుగా మరికొన్ని దూరదర్శన్ సీరియల్లుగా నిర్మించబడ్డాయి. సమత నవల ఆధారంగా 'ప్రజా నాయకుడు', 'ప్రతీకారం' నవలను 'మనస్సాక్షి' సినిమాగా, మానినీ మనసును ఆమె కథ సినిమాలుగా వచ్చాయి. 'మృగతృష్ణ' నవలను అదే పేరుతో సినిమాగా నిర్మించారు. ఈమె 1985, 1991 మధ్యకాలంలో ఫిల్మ్ సెన్సార్ బోర్డు సభ్యురాలిగా సేవలందించారు. సవిమర్శక వాస్తవికత నుండి సోషలిస్టు వాస్తవికత దిశలో రచనలు సాగించిన తెలుగు రచయిత్రులలో అగ్రశ్రేణి రచయిత్రిగా పేరు గాంచిన డా॥వాసిరెడ్డి సీతాదేవి 76 ఏండ్ల వయసులో ఆస్తమా వ్యాధికి చికిత్స పొందుతూ ఏప్రిల్, 13 2007లో హైదరాబాద్లో తుదిశ్వాస విడిచారు.



సాహిత్యం, రాజకీయం వేరు కాదు

"నేను మార్క్సిస్టును, రచయితకు మార్క్సిస్టు దృక్పథం లేకపోతే ఆ రచన అసంపూర్ణం, అపరిమితం అవుతుంది. సాహిత్యం, రాజకీయం నా దృష్టిలో వేరు వేరు కాదు. అందుచేతనే ఈ దేశంలో రచయితలు విధిగా రాజకీయాల్లో పాల్గొని తీరాలి" అంటారు సీతాదేవి. బాలభవన్ సంచాలకురాలిగా, యువతజన సర్వీసుల శాఖ ఉప సంచాలకురాలిగా పని చేసిన ఈమె నంది ఫిలిం అవార్డు, తెలుగు అడ్వైజరీ రిపోర్ట్, దూరదర్శన్ అడ్వైజరీ కమిటీ, ఆంధ్రప్రదేశ్ సాహితీ అకాడమీలో సభ్యులుగా సేవలసిందించారు. జవహర్ బాలభవన్ డైరెక్టరుగా పదవీ విరమణ చేశారు. 'ఆత్మవిశ్వాసంతో ధైర్యంతో, ఒక లక్ష్యంతో ముందుకు సాగిపోయే స్త్రీని ఈ సమాజం గానీ, ఈ పురుషాధిక్యం కానీ ఏమీ చేయలేదు" అంటారు ఆమె.

- పాలపర్తి సంధ్యారాణి

కారేపల్లి ప్రమాదంపై సీఎం దిగ్భ్రాంతి

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

ఖమ్మం జిల్లా కారేపల్లి మండలం చీమలపాడులో జరిగిన ఘోర ప్రమాదం పట్ల బీఆర్ఎస్ అధినేత సీఎం కె.చంద్రశేఖర్ రావు తీవ్ర దిగ్భ్రాంతిని, విచారాన్ని వ్యక్తం చేశారు. బీఆర్ఎస్ ఆత్మీయ సమ్మేళనంలో ఊహించని రీతిలో సిలిండర్లు పేలి ఇద్దరు కార్యకర్తలు మరణించడం, పలువురికి తీవ్ర గాయాల పాలయ్యారని తెలిసిన వెంటనే ఖమ్మం జిల్లా మంత్రి పువ్వాడ అజయ్‌కి, ప్రమాదం జరిగిన ప్రాంతంలో ఉన్న ఎంపీ నామా నాగేశ్వర్ రావులకు ఫోన్లు చేసి వివరాలు తెలుసుకున్నారు. మరణించిన కార్యకర్తల కుటుంబాలను అన్ని విధాలా ఆదుకుంటామని సీఎం భరోసా ఇచ్చారు.

కేటీఆర్ ఆవేదన

వైరా నియోజకవర్గం కారేపల్లి, చీమలపాడు అగ్నిప్రమాదంపైన మంత్రి కె.తారకరామారావు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ ప్రమాదంలో మరణించిన వారి కుటుంబాలకు, క్షతగాత్రులకు అన్ని విధాలుగా అండగా ఉంటామని తెలిపారు. గాయపడిన వారికి మెరుగైన చికిత్స అందించేలా చర్యలు తీసుకోవాలని ఖమ్మం జిల్లా అధికారులు, నాయకులను మంత్రి ఆదేశించారు.

బీఆర్ఎస్‌లో కొనసాగుతున్న చేరికలు

బీఆర్ఎస్ పార్టీలోకి చేరికల జోరు కొనసాగుతున్నది. వేర్వేరు రాష్ట్రాల్లోని పలు పార్టీల నాయకులు, కార్యకర్తలు, పెద్ద ఎత్తున బిఆర్ఎస్ పార్టీలో చేరుతున్న తీరు సమకాలీన రాజకీయాలను ప్రభావితం చేస్తున్నది. మహారాష్ట్రలోని పల్లె పల్లెకు విస్తరిస్తామన్న బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ ప్రకటనకు అనుగుణంగానే మహారాష్ట్ర నుంచి బీఆర్ఎస్‌లోకి వలసలు శరవేగంగా సాగుతున్నాయి. బుధవారం హైదరాబాద్‌లో పలువురు రాజకీయ నాయకులతో పాటు పలు రంగాలకు చెందిన వృత్తి నిపుణులు, ప్రముఖులు బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ సమక్షంలో గులాబి కండువాలు కప్పుకొని పార్టీలో చేరారు.

ప్రతిపక్షాల ఐక్యతే లక్ష్యం

నవతెలంగాణ-న్యూఢిల్లీ బ్యూరో

ప్రతిపక్ష పార్టీల సమైక్యం కోసం ప్రయత్నం జరుగుతుందని కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ అన్నారు. బుధవారం నాడిక్కడ కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే నివాసంలో కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ, జేడీయూ చీఫ్, బీహార్ ముఖ్యమంత్రి నితీష్ కుమార్, బీహార్ ఉప ముఖ్యమంత్రి, ఆర్జేడి నేత తేజస్వి యాదవ్, జేడీయూ నేత రాజీవ్ రంజన్ సింగ్, ఆర్జేడి ఎంపీ మనోజ్ కుమార్ ఝా, కాంగ్రెస్ నేత సల్మాన్ ఖుర్షీద్ సమావేశమయ్యారు. బీజేపీ ఐకమత్యంగా పోరాడే అవకాశాలపై చర్చించారు. ఈ సందర్భంగా మల్లికా ర్జున్ ఖర్గే మీడియాతో మాట్లాడుతూ ఇది చారిత్రక సమావేశమని అన్నారు. అన్ని ప్రతిపక్ష పార్టీలను ఏకతాటిపైకి తేవడమే తమ లక్ష్యమని తెలిపారు.

రాబోయే ఎన్నికల్లో ఐక్య పోరాటం : రాహుల్ గాంధీ

రాహుల్ గాంధీ మాట్లాడుతూ 'మేం ఇక్కడ ఒక చారిత్రాత్మక సమావేశాన్ని నిర్వహించాం. చాలా విషయాలు చర్చించాం. మేము అన్ని పార్టీలను ఏకంచేసి రాబోయే ఎన్నికల్లో ఐక్యంగా పోరాడాలని నిర్ణయించుకున్నాం. మేము ఈ నిర్ణయం తీసుకున్నాము. దీనికోసం మీమందరం కృషి చేస్తాం' అన్నారు. ప్రతిపక్ష పార్టీలను సమైక్యపరచడం కోసం ప్రయత్నిస్తున్నట్టు తెలిపారు. ఇది ఓ ప్రక్రియ అని, దేశం కోసం ప్రతిపక్షాల దార్శనికతను ఇది తీర్చిదిద్దుతుందన్నారు. తాము రాజ్యాంగాన్ని పరిరక్షిస్తామని, దేశాన్ని కాపాడతామని తెలిపారు.

మరిన్ని పార్టీలను ఏకం చేయడానికి ప్రయత్నం : నితీష్ కుమార్

నితీష్ కుమార్ మాట్లాడుతూ సాధ్యమైనన్ని పార్టీలను సమైక్యపరచి, కలిసికట్టుగా పని చేయడం కోసం ప్రయత్నిస్తున్నట్లు తెలిపారు. "దేశంలో మరిన్ని పార్టీలను ఏకం చేయడానికి మేము అన్ని ప్రయత్నాలు చేస్తాం" అని అన్నారు. అంతకు ముందు ఆర్జేడి అగ్ర నేత లాలూ ప్రసాద్ యాదవ్ ను ఆయన కుమార్తె మీసా భారతి నివాసంలో నితీష్ కుమార్ కలిశారు. లాలూ తన కుమార్తె మీసా భారతి నివాసంలో ఉన్నారు.

దేశం చాలా క్లిష్ట పరిస్థితిల్లో ఉంది : కేజ్రీవాల్

ఆ తరువాత ఢిల్లీ ముఖ్యమంత్రి, ఆప్ అధినేత అరవింద్ కేజ్రీవాల్ ను నితీష్ కుమార్, తేజస్వి యాదవ్‌లను కలిశారు. ఇది వచ్చే ఏడాది సార్వత్రిక ఎన్నికలలో బిజెపిని ఎదుర్కోవడానికి ప్రతిపక్ష పార్టీల ప్రధాన కలయిక ఊహాగానాలకు దారితీసింది. అనంతరం కేజ్రీవాల్ మీడియాతో మాట్లాడుతూ "ప్రతిపక్ష పార్టీలన్నింటినీ ఒకే తాటిపైకి తీసుకురావడానికి నితీష్ కుమార్ మంచి చొరవ తీసుకున్నారు. మేము దీనికి అనుగుణంగా ఉన్నాము. ఆ విధానానికి కట్టుబడి ఉంటాం" అని అన్నారు. "దేశం చాలా క్లిష్ట పరిస్థితిల్లో నడుస్తోంది. స్వాతంత్ర్యం వచ్చినప్పటి నుండి ఈ రోజు దేశంలో అత్యంత అవినీతి ప్రభుత్వం ఉందని నేను చాలాసార్లు చెప్పాను" అని అన్నారు.

కర్నాటక బీజేపీలో అసమ్మతి సెగలు

బెంగళూరు : రాబోయే అసెంబ్లీ ఎన్నికల కోసం 189 మంది అభ్యర్థులతో జాబితాను ప్రకటించిన వెంటనే బీజేపీలో అసమ్మతి సెగలు రేగాయి. వరుసగా రెండోసారి అధికారం దక్కించుకోవాలని ఉవ్విళ్లూరుతున్న బీజేపీ తొమ్మిది మంది సిటింగ్ ఎమ్మెల్యేలకు టికెట్ నిరాకరించింది. వీరిలో ఒక మంత్రి, మరో మాజీ మంత్రి కూడా ఉన్నారు. సీనియర్లను పక్కనపెట్టి 52 కొత్త ముఖాలను అభ్యర్థులుగా ప్రకటించింది. దీనిపై కొందరు పార్టీ నేతలు భగ్గుమంటున్నారు. జాబితాలో పేరు లేకపోవడంతో మాజీ ఉప ముఖ్యమంత్రి లక్ష్మణ్ సావడి ఏకంగా పార్టీ ప్రాథమిక సభ్యత్వానికి రాజీనామా చేశారు. గురువారం సాయంత్రం ఒక బలమైన నిర్ణయానికి వస్తానని, శుక్రవారం నుంచి రంగంలోకి దిగుతానని ఆయన చెప్పారు. సావడి కాంగ్రెస్ పార్టీలో చేరవచ్చునన్న ఊహాగానాలు వినిపిస్తున్నాయి. మంత్రి అంగారా అయితే రాజకీయాలకు గుడ్‌బై చెప్పేశారు. దక్షిణ కన్నడ జిల్లాలోని సులియా నుంచి ఆరుసార్లు ఎమ్మెల్యేగా ఎన్నికైన ఆయన ఈ మేరకు సంచలన ప్రకటన చేశారు. ఈ నెల 20వ తేదీ నామినేషన్ల దాఖలుకు చివరి తేదీ కావడంతో బీజేపీలో పరిస్థితి మరింత దారుణంగా మారింది. తిరుగుబాటుదారుల సంఖ్యపై అప్పటికి పూర్తి సమాచారం అందే అవకాశం ఉంది. ప్రస్తుత ఎమ్మెల్యేలలో అనిల్ బెనాకే (బెళగావి ఉత్తర), హలదీ శ్రీనివాస్ శెట్టి (కుండపురా), ఎస్. అంగార (సులియా), మహదేవప్ప శివలింగప్ప యాదవాడ్ (రామదుర్గ్), రమణ లమానీ (షిరాహట్టి), డీఎం బసవంత్ (కిత్తూరు) సహా పలువురికి పార్టీ అధిష్టానం టికెట్ నిరాకరించింది. దీనిపై యాదవాడ్, బెనాకే మద్దతుదారులు తమ తమ నియోజకవర్గాల్లో ఇప్పటికే నిరసన గళం విన్పిస్తున్నారు.

ఉడిపిలో ప్రస్తుత ఎమ్మెల్యే రఘుపతి భట్‌కు టికెట్ నిరాకరించిన బిజెపి నాయకత్వం యశ్‌పాల్ సువర్ణకు అభ్యర్థిత్వం కట్టబెట్టింది. ఎన్నికల్లో పోటీ చేయడం సువర్ణకు ఇదే మొదటిసారి. అయితే గతంలో హిజాబ్ నిషేధంపై సువర్ణ చేసిన వ్యాఖ్యలు పార్టీకి ఇప్పుడు ఇబ్బందికరంగా మారాయి. హిజాబ్‌పై నిషేధాన్ని సమర్థిస్తూ సువర్ణ గత సంవత్సరం పెద్ద ఎత్తున ప్రచారం నిర్వహించారు. హిజాబ్ ధరించే హక్కు కోసం కొందరు ముస్లిం యువతులు కర్నాటక హైకోర్టును ఆశ్రయించగా వారిని జాతి వ్యతిరేకులుగా సువర్ణ అభివర్ణించారు. మరోవైపు తనకు టికెట్ నిరాకరించడాన్ని భట్ బాహాటంగానే నిరసిస్తున్నారు. టికెట్ ఇస్తామంటూ చివరి నిమిషం వరకూ తనను ఊరించారని, చివరికి మొండిచేయి చూపారని ఆక్రోశం వెళ్లగక్కారు. టికెట్ ఇవ్వడం లేదని ముందుగానే చెప్పి ఉంటే సీనియర్ నేత ఈశ్వరప్ప మాదిరిగా క్రియాశీల రాజకీయాలకు దూరంగా ఉండే వాడినని చెప్పారు. వాస్తవానికి ఈశ్వరప్పకు ఈసారి టికెట్ ఇవ్వకపోవచ్చునని వార్తలు వచ్చాయి. తనకు బదులుగా శివమొగ్గ సీటును కుమారుడికి ఇవ్వాలని ఆయన ప్రతిపాదించారు.

పుత్తూర్ ఎమ్మెల్యే, దక్షిణ కన్నడ బీజేపీ అధ్యక్షుడు సంజీవ మతందార్‌కు కూడా నిరాశే ఎదురైంది. ఆయన స్థానంలో ఆశా తిమ్మప్పకు టికెట్ లభించింది. పార్టీ ఎమ్మెల్యేలు గూలిహట్టి శేఖర్ (హొసదుర్గ), లాలాజీ ఆర్ మెండన్‌లకు కూడా మొండిచేయే చూపారు. విజయనగరకు చెందిన తిరుగుబాటు ఎమ్మెల్యే ఆనంద్ సింగ్‌ది కూడా ఇదే పరిస్థితి. మాజీ ముఖ్యమంత్రి బిఎస్ యడ్యూరప్ప ప్రాతినిధ్యం వహిస్తున్న షికారిపురాలో ఆయన కుమారుడు బివై విజయేంద్రకు టికెట్ ఇచ్చారు. ఎన్నికలలో పోటీ చేయబోనని 80 సంవత్సరాల యడ్యూరప్ప ఇప్పటికే ప్రకటించారు. ఇక మాజీ ముఖ్యమంత్రి జగదీశ్ షెట్టర్ అయితే తాను ఎన్నికలలో పోటీ చేసి తీరతానని తెగేసి చెప్పారు. పోటీకి దూరంగా ఉండాలని పార్టీ అధిష్టానం తనకు సూచించిందని, అయినప్పటికీ పోటీలో నిలవడం ఖాయమని అన్నారు.

మనసుగతి ఇంతే

(మొదటిపేజీ తరువాయి)

ప్రకారం 59.5 శాతం కుటుంబాలు ఆకస్మికంగా వచ్చిపడే ఆరోగ్య సమస్యలపై ఎక్కువ ఖర్చు పెడుతున్నాయి. భారత్ తీవ్రమైన ఆరోగ్య సంక్షోభాన్ని ఎదుర్కొంటోందని, ఆరోగ్య సమస్యలలో ఆరో వంతు మానసిక ఆరోగ్యానికి సంబంధించినవేనని సర్వే ప్రస్తావించింది. ఒత్తిడి, వ్యాకులత, మానసిక అనారోగ్యాలు, మనోవైకల్యం వంటివి వీటిలో ఉన్నాయి. 'మొత్తంమీద 20.7 శాతం కుటుంబాలు పేదరికంలోకి వెళ్లిపోతున్నాయి. ఆరోగ్య సంబంధమైన ఖర్చులను తగ్గించుకోవాలంటే మానసిక ఆరోగ్య సమస్యలను ముందుగానే గుర్తించి, వాటిని పరిష్కరించేందుకు సత్వరమైన చర్యలు చేపట్టాల్సిన అవసరం ఉంది' అని అధ్యయన సహ రచయిత, కొచ్చిలోని అమృత్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ అండ్ రిసెర్చ్ సెంటర్ అధ్యాపకుడు డాక్టర్ డెన్నీ జాన్ తెలిపారు. మానసిన అనారోగ్యాలపై అవుతున్న ఖర్చును తగ్గించేందుకు ఆయా కుటుంబాలకు ఆర్థికంగా సాయపడాల్సి ఉంటుందని ఈ అధ్యయనం సూచించింది.

చేనేతకు బతుకమ్మ జీవం

(మొదటిపేజీ తరువాయి)

945 పవర్‌లూమ్స్‌పై గుడ్డ ఉత్పత్తి కానుంది.

కలర్ చీరలకు స్వస్తి.. బతుకమ్మ చీరలపైనే దృష్టి

ప్రభుత్వం ఇక్కడి పవర్ లూమ్స్‌కు బతుకమ్మ చీరల ఆర్డర్లు ఇవ్వక ముందు విరివిగా కలర్ చీరలు, టవల్స్ ఉత్పత్తి అయ్యేవి. యారన్, ముడి సరుకు ధరలు విపరీతంగా పెరగ్గా, మార్కెట్లో కలర్ చీరలకు డిమాండ్ లేకుండా పోయింది. దీంతో గ్రామంలో కలర్ చీరలు, టవల్స్ ఉత్పత్తి అంతంత మాత్రంగానే ఉంది.

చితికిన బతుకులకు భరోసా
సుంకె రవిశంకర్- చొప్పదండి ఎమ్మెల్యే



పనులు లేక పస్తులతో చితికిపోయిన చేనేత కుటుంబాలకు బతుకమ్మ చీరల ఆర్డర్లతో బతుకుపై భరోసా కల్పించాం. గర్శకుర్తిలో సాంచెల సవ్వడికి బదులు చావు డప్పు మోగింది. ఆత్మహత్యలు, ఆకలి చావులను ఆశ్రయించిన నేతన్నలు ఇప్పుడు గడ్డు పరిస్థితుల నుండి గట్టెక్కారు. పనులు లేక కుదేలైన పవర్ లూమ్స్ వస్త్ర పరిశ్రమలకు ఐదేండ్లుగా జీవం వచ్చింది. బతుకమ్మ చీరలు, స్కూల్ యూనిఫామ్స్, రంజాన్ గుడ్డ ఉత్పత్తికి ఆర్డర్లు కల్పిస్తున్నాం. ప్రతి వ్యాపారి, ఆసామి, కార్మికుడికి ఏడాది మొత్తం పని కల్పిస్తున్నాం.

సర్కారు ఆర్డర్లతో ధీమాగా ఉన్నాం ..
అలువాల విఠోభ- వ్యాపారుల సంఘం అధ్యక్షుడు- గర్శకుర్తి



బతుకమ్మ చీరలు, స్కూల్ యూనిఫామ్స్, రంజాన్ గుడ్డ ఉత్పత్తి ఆర్డర్లతో ధీమాగా బతుకుతున్నం. మా బాధలు గ్రహించిన మాజీ ఎంపీ వినోద్ కుమార్, ఎమ్మెల్యే సుంకె రవిశంకర్, రాష్ట్ర పవర్ లూమ్స్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మెన్ గూడూరి ప్రవీణ్ ప్రత్యేక చొరవ తీసుకుని ప్రభుత్వం నుంచి ఆర్డర్లు వచ్చేలా కృషి చేశారు. ఈ యేడు 33 ఎస్-ఎస్ఐ యూనిట్లకు 32 లక్షల 26 వేల 750 మీటర్ల బతుకమ్మ చీరల ఉత్పత్తికి ఆర్డరు లభించింది. నిన్న, మొన్నటి వరకు స్కూల్ యూనిఫామ్స్, రంజాన్ గుడ్డను ఉత్పత్తి చేయగా, నేడు చీరల తయారీపై దృష్టి పెట్టాం.

వలసలకు స్వస్తి చెప్పాం
వడ్లకొండ పెంటయ్య- పవర్ లూమ్స్ యజమాని- గర్శకుర్తి



ప్రభుత్వ కల్పించిన బతుకమ్మ చీరల ఆర్డర్లతో వలస పోవడం బందైంది. ఉన్న ఊళ్లో ఉపాధి లేక గతంలో బీవండి, షోలాపూర్, సూరత్ వంటి ఇతర రాష్ట్రాలకు కుటుంబాలను వదిలి వలస వెళ్లి ఎంతో గోస పడ్డం. ఇప్పుడు సర్కార్ ఉన్న ఊళ్లోనే ఉపాధి అవకాశాలు మెరుగుపర్చడంతో కుటుంబంతో కలిసి జీవిస్తున్నాం.

ఏడాదంతా పని
మిట్టపల్లి రమేశ్ - చేనేత కార్మికుడు : గర్శకుర్తి



ప్రభుత్వం కల్పించిన బతుకమ్మ చీరల తయారీతోపాటు స్కూల్ యూనిఫామ్స్, రంజాన్ గుడ్డ ఉత్పత్తితో ఏడాదంతా పని దొరుకుతుంది. రోజుకు రూ.800 కూలి గిట్టుబాటు అవుతుంది.

కేసీఆర్ అంటే...

(మొదటిపేజీ తరువాయి)

ఆధునిక సదుపాయాలు, సాంకేతిక పద్ధతులతో కూడిన వ్యవసాయ కళాశాల దేశంలోనే అత్యుత్తమ కళాశాలగా నిలుస్తుందని చెప్పారు. ఈ రోజు రాష్ట్రంలో పండిన ధాన్యమే కరువు ప్రాంతాల్లో ప్రజలకు ఆహారంగా పంపిణీ అవుతుండటం మనందరికీ గర్వకారణం అన్నారు. రాష్ట్రం ఏర్పాటైన కొత్తలో కోటీ 8లక్షల ఎకరాల సాగు విస్తీర్ణం ఉండగా, కేసీఆర్ ప్రత్యేక చొరవతో అది రెండు కోట్ల 30లక్షల ఎకరాలకు పెరిగిందన్నారు.

మంత్రి నిరంజన్‌రెడ్డి మాట్లాడుతూ.. సీఎం కేసీఆర్ సాగునీటి ప్రాజెక్టులు చేపట్టి రాష్ట్రాన్ని సస్యశ్యామలం చేశారని చెప్పారు. భూగర్భ జలమట్టం పెరగడంలో రాజన్న సిరిసిల్ల జిల్లా దేశానికి ఆదర్శంగా నిలిచిందని, ముస్సోరీలోని శిక్షణ ఐఏఎస్‌లకు పాఠంగా మారడం గర్వకారణమన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర ప్రణాళిక సంఘం వైస్ చైర్మెన్ బోయినపల్లి వినోద్ కుమార్, సిరిసిల్ల జెడ్పీ చైర్‌పర్సన్ న్యాలకొండ అరుణ, ఎమ్మెల్యేలు చెన్నమనేని రమేష్‌బాబు, రసమయి బాలకిషన్, సుంకే రవిశంకర్, రాష్ట్ర వ్యవసాయ శాఖ కార్యదర్శి, ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయ ఇన్‌చార్జి వైస్ ఛాన్సలర్ రఘునందన్‌రావు పాల్గొన్నారు.

దేశం మనది..దేశం కోసం పోరాడుదాం

(మొదటిపేజీ తరువాయి)

టీఆర్ఎస్ ప్రభుత్వమొచ్చాక రూ. 12 వేల కోట్లు ఖర్చు పెట్టామని తెలిపారు. అసదుద్దీన్ ఓవైసీ, తదితరుల విజ్ఞప్తి మేరకు అనీస్ ఉల్ గుర్బాను అత్యద్భుతంగా నిర్మించుకున్నామన్నారు. రాష్ట్రంలో రైతు ఆత్మహత్యలు ఇప్పుడు లేవన్నారు. వలసెళ్లినవారు కూడా తిరిగి ఊర్లకు వచ్చి వ్యవసాయం చేసుకుంటున్నారన్నారు. నిరుద్యోగ సమస్యను కూడా మెల్లమెల్లగా తగ్గిస్తున్నామని చెప్పారు. మనం ముందుకు సాగుతున్నాంగానీ దేశం వెనుకబడుతున్నదని ఆందోళన వ్యక్తం చేశారు. తెలంగాణ ప్రభుత్వం మాదిరిగా కేంద్రం కూడా శ్రమిస్తే దేశ జీడీపీ మరో 3, 4 శాతం పెరిగేదని చెప్పారు. దేశం అగమ్యగోచర స్థితిలో పయనిస్తున్నదనీ, ఇలాంటి పరిస్థితుల్లో దేశాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపైనా ఉందని నొక్కి చెప్పారు. దేశ రాజకీయ పరిస్థితులను మార్చేందుకే టీఆర్ఎస్‌ను బీఆర్ఎస్‌గా మార్చామనీ, మహారాష్ట్ర ప్రజలు ఘన స్వాగతం పలుకుతున్నారని అన్నారు. ఈ ఇఫ్తార్ విందులో మండలి చైర్మెన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి, మంత్రులు మహమూద్ అలీ, కొప్పుల ఈశ్వర్, సత్యవతి రాథోడ్, మల్లారెడ్డి, తలసాని శ్రీనివాస్‌యాదవ్, మండలి వైస్ చైర్మెన్ బండా ప్రకాశ్, ఎమ్మెల్సీ పల్లారాజేశ్వర్‌రెడ్డి, మాజీ స్పీకర్ మధుసూదనాచారి, హైదరాబాద్ ఎంపీ అసదుద్దీన్ ఓవైసీ, ఎమ్మెల్యేలు దానం నాగేందర్, బి.సుభాష్‌రెడ్డి, కాలేరు వెంకటేశ్, సీఎస్ శాంతికుమారి, డీజీపీ అంజనీ కుమార్, మైనార్టీ వ్యవహారాల సలహాదారులు ఏకే.ఖాన్, మైనార్టీ వెల్ఫేర్ ప్రధాన కార్యదర్శి అహ్మద్ నదీమ్, మైనార్టీ వెల్ఫేర్ కమిషనర్ షఫీఉల్లాఖాన్, టెన్నిస్ దిగ్గజం సానియా మీర్జా, బాక్సింగ్ ప్రపంచ ఛాంపియన్ నిఖత్ జరీన్, పలు కార్పొరేషన్ల చైర్మెన్లు, ముస్లిం మతపెద్దలతో పాటు 13 వేల మంది ముస్లింలు పాల్గొన్నారు.

చైనా, బ్రెజిల్ సంబంధాలు మరింత బలోపేతం !

- చైనాలో బ్రెజిల్ అధ్యక్షుడు లూలా అధికార పర్యటన
- 20 ద్వైపాక్షిక ఒప్పందాలపై సంతకాలు?

బ్రసీలియా, బీజింగ్ : బ్రెజిల్ అధ్యక్షుడు లూలా డసిల్వా బుధవారం నుండి నాలుగు రోజుల పాటు చైనాలో అధికార పర్యటన జరుపుతున్నారు. లూలా పర్యటనతో అభివృద్ధి చెందుతున్న దేశాలు, ఆర్థిక వ్యవస్థలు కలిగిన చైనా, బ్రెజిల్‌లు రాజకీయ, ఆర్థిక సంబంధాలతో పాటూ మొత్తంగా ద్వైపాక్షిక సంబంధాల్లో కొత్త శకాన్ని ఆవిష్కరిస్తాయని భావిస్తున్నారు. మొత్తంగా ప్రపంచ దేశాల్లోకి సానుకూల ప్రేరణ, ఉత్సాహాన్ని నింపుతాయని పరిశీలకులు పేర్కొంటున్నారు. చైనావిదేశాంగ మంత్రిత్వ శాఖ ప్రతినిధి వాంగ్ వెన్‌బిన్ మంగళవారం పత్రికా సమావేశంలో మాట్లాడుతూ, వందలాదిమంది వాణిజ్య ప్రముఖులు, రాష్ట్రాల గవర్నర్లు, కాంగ్రెస్ సభ్యులు, మంత్రులతో కూడిన అతి పెద్ద ప్రతినిధి బృందంతో లూలా చైనాలో పర్యటిస్తున్నారని, ఈ పర్యటనకు ఉభయ పక్షాలు అధిక ప్రాముఖ్యతను ఇస్తున్నాయని చెప్పారు. బ్రెజిల్ అధ్యక్షుడిగా లూలా చైనాలో పర్యటించడం ఇది మూడోసారి.

రాష్ట్రాన్ని కుప్ప చేస్తున్న డీ9 గ్యాంగ్

(మొదటిపేజీ తరువాయి)

ప్రస్తకే లేదని హెచ్చరించారు. నిజాం కూడా ఇంత విధ్వంసం సృష్టించలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు.సీఎం కేసీఆర్ చేస్తున్న విధ్వంసాన్ని మీడియా సాక్షిగా నిరూపించేందుకు సిద్ధంగా ఉన్నట్టు వెల్లడించారు. బుధవారం హైదరాబాద్‌లోని గాంధీభవన్‌లో పార్టీ నేతలతో కలిసి ఆయన విలేకర్లతో మాట్లాడారు. తెలంగాణ రాష్ట్రాన్ని తెచ్చుకున్నది కేసీఆర్ కుటుంబం కోసమేనా? అని ప్రశ్నించారు.ఆ కుటుంబ స్వార్థానికి హైదరాబాద్ నగరాన్ని బలి చేస్తారా? అంటూ నిలదీశారు. తాను రాజకీయ విమర్శలు చేయడం లేదనీ, హైదరాబాద్ మహానగర భవిష్యత్ కోసమేనని చెప్పారు. నగరంలోని 100 కోట్ల విలువైన 2704 గజాల భూమిని రూ. 17 కోట్లకే కేసీఆర్ తీసుకున్నారని ఆరోపించారు. అదే భూమికి రూ. 40 కోట్లు ఇస్తే, తనకు ఇవ్వగలరా?అని సవాల్ విసిరారు. రాష్ట్ర ప్రభుత్వ పెద్దలే బెదిరించి ఆ భూములు తమ పేరిట రాయించుకుంటున్నారని ఆరోపించారు. కేసీఆర్ భూదోపిడీ కోసం నిఘంటువులో కొత్త పదాన్ని సృష్టించాలని చెప్పారు. గతంలో గ్రేటర్ పరిధిలో కొన్ని నిబంధనలు ఉండేవనీ, బీఆర్ఎస్ అధికారంలోకి వచ్చాక వాటిని తుంగలో తొక్కుతున్నారని చెప్పారు. గత 60 ఏండ్లలో ఎప్పుడూ జరగని విధంగా జీహెచ్ఎంసీ పరిధిలో బీఆర్ఎస్ హయాంలో విధ్వంసం జరిగిందని ఆవేదన వ్యక్తం చేశారు.



జూబ్లీహిల్స్ నైసర్గిక స్వరూపం నేపథ్యంలో అక్కడ కొన్ని ప్రత్యేక నిబంధనలున్నాయని తెలిపారు. కేఎస్ అండ్ సీఎస్ డెవలపర్స్ నిజాం నవాబుల నుంచి హెరిటేజ్ భవనాన్ని కొనుగోలు చేసిందన్నారు. మొత్తం 7,416 గజాల భూమికి రోడ్డు వెడల్పులో పోను 6,900 గజాలు మిగిలిందని తెలిపారు. ఇందులో 1,200 గజాల గ్రీన్ బెల్ట్‌కు ఉందనీ, మిగిలిన 5,800 గజాలకు 60వేల చదరపు అడుగులకు మాత్రమే అనుమతి ఇవ్వాల్సి ఉంటుందన్నారు. కానీ నమస్తే తెలంగాణ దామోదర్ రావుకు 2,704 గజాల భూమిని ప్రభుత్వం అప్పనంగా కట్టబెట్టిందన్నారు. ఇందుకోసం ఆ సంస్థకు నిబంధనలకు విరుద్ధంగా అనుమతి ఇచ్చిందని ఆరోపించారు. జూబ్లీహిల్స్‌లో ఇండ్ల నిర్మాణానికి, వ్యాపార సంస్థలకు ఐదు అంతస్థులకు మాత్రమే అనుమతి ఉంటుందన్నారు. కేబీఆర్ పార్క్‌ను ఎకో టూరిజం, ఎకో సెన్సిటివ్ జోన్‌గా పరిగణిస్తారని తెలిపారు. అందుకే ఆ పార్క్ పరిసరాల్లో కమర్షియల్ భవనాలు చాలా తక్కువగా ఉంటాయన్నారు.

ఐదు అంతస్థుల కంటే ఎక్కువ అనుమతి ఇవ్వవద్దనే నిబంధనలున్నాయని పేర్కొన్నారు. కానీ భూమి రాసిచ్చిన తర్వాత సంస్థకు నాలుగు అంతస్తులు భూమి లోపల, 16 అంతస్తులను భూమిపై కట్టుకునేలా అను మతులు ఇచ్చారని విమర్శిం చారు. నమస్తే తెలంగాణకు కేసీఆర్ యజమాని, అందుకే నిబంధనలకు విరుద్ధంగా 4,78,825 చదరపు అడుగులమేర నిర్మాణాలను చేపట్టేందుకు ప్రభుత్వం అనుమతి ఇచ్చిందని వివరించారు. మూడువేల గజాల్లోనే ఇలాంటి అనుమతులు ఇస్తే...కేబీఆర్ పార్కు జంక్షన్‌లో ట్రాఫిక్ పరిస్థితి ఏంటి? అని ప్రశ్నించారు. పర్యావరణ పరంగా పార్కు పరిస్థితి ఏమిటి? ఆవేదన వ్యక్తం చేశారు. ఏడు ఎకరాల్లో ఉన్న బసవతారకం ఆస్పత్రికి కూడా మూడు అంతస్థులకు మించి అనుమతులు ఇవ్వలేదని రేవంత్ ఈ సందర్భంగా చెప్పారు. ఆనాడు ప్రభుత్వంలో ఉన్నా అప్పటి పాలకులు విధ్వంసం సృష్టించలేదని వివరించారు.

మహేశ్వర్‌రెడ్డికి టీపీసీసీ షోకాజ్ నోటీసు

పార్టీ వ్యతిరేక కార్యక్రమాలు చేపడుతున్నారంటూ ఏఐసీసీ కార్యక్రమాల అమలు కమిటీ చైర్మెన్ ఏలేటి మహేశ్వర్‌రెడ్డికి పార్టీ షోకాజ్ నోటీస్ ఇచ్చింది. గంటలోపు తన వివరణ ఇవ్వాలంటూ టీపీసీసీ క్రమశిక్షణ కమిటీ ఆదేశించింది.

చీమలపాడు అగ్ని ప్రమాదంపై దిగ్భ్రాంతి

ఖమ్మం జిల్లా చీమలపాడు అగ్ని ప్రమాదం సంఘటనపై టీపీసీసీ అధ్యక్షులు రేవంత్‌రెడ్డి దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. బీఆర్ఎస్ స్వార్థ రాజకీయాలకు ముగ్గురు పేదలు అగ్నికి ఆహుతి అయ్యారని తెలిపారు. గాయపడిన వారికి అత్యున్నత వైద్యసేవలు అందించాలని కోరారు. వారి కుటుంబాలను బీఆర్ఎస్ అన్ని విధాలుగా ఆదుకోవాలని డిమాండ్ చేశారు. పార్టీ ఆత్మీయ సమ్మేళనాలు ప్రజల పాలిట శాపంగా మారాయని ఆవేదన వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలకు ఒక్కొక్కరికి రూ.కోటి చొప్పున పరిహారం ఇవ్వాలని టీపీసీసీ ఉపాధ్యక్షులు మల్లు రవి బీఆర్ఎస్‌ను డిమాండ్ చేశారు. గాయపడిన వారికి రూ.25 లక్షలు ఇవ్వడంతో పాటు ఉచిత వైద్యం అందించాలని కోరారు. ఈ ఘటనకు కారకులైన వారిపై తగిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

హమాలీలకు పీఎఫ్ సౌకర్యం కల్పించాలి

- కూలిరేట్ల చెల్లింపు అవకతవకలపై చర్యలు తీసుకోవాలి : సీఐటీయూ

నవతెలంగాణ బ్యూరో–హైదరాబాద్

తెలంగాణ సివిల్ సప్లరు హమాలీలకు అమలు చేస్తున్న పీఎఫ్ సౌకర్యాన్ని గిరిజన కో–ఆపరేటివ్ కార్పొరేషన్ హమాలీలకు కూడా అమలు చేయాలని తెలంగాణ ఆల్ హమాలీ ఫెడరేషన్ (సీఐటీయూ అనుబంధం) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వంగూరు రాములు, సివిల్ సప్లరు, జీసీసీ హమాలీ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి పి. సుధాకర్ డిమాండ్ చేశారు. హమాలీలకు పెరిగిన కూలి రేట్లతో పాటు బోనస్ స్వీట్ బాక్స్, స్టిచ్చింగ్‌చార్జి, స్వీపర్లకు పెరిగిన వేతనాలను వెంటనే చెల్లించాలని కోరారు. బుధవారం హైదరాబాద్‌లో గిరిజన సహకార సంస్థల కార్పొరేషన్ శాఖ కమిషనర్ కిస్టినా జెడ్ చొంగ్తూ, సివిల్ సప్లరు కార్పొరేషన్ కమిషనర్ అనిల్ కుమార్‌లకు తెలంగాణ సివిల్ సప్లరు, జీసీసీ హమాలీ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో వారు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా కమిషనర్లు స్పందిస్తూ తక్షణమే హమాలీలకు రావాల్సిన బకాయిలను ఇప్పిస్తామనీ, జీసీసీ హమాలీలకు పీఎఫ్ సౌకర్యం కల్పించేలా చర్యలు తీసుకుంటామని హామీనిచ్చారు. అనంతరం వంగూరు రాములు, సుధాకర్ మీడియాతో మాట్లాడుతూ.. రాష్ట్రమేర్పడ్డాక నాలుగు సార్లు సివిల్ సప్లరు, జీసీసీ హమాలీల ఎగుమతి–దిగుమతి ఒప్పందాలు జరిగాయన్నారు. ఆ సమయంలో హమాలీ కార్మికులకు పీఎఫ్, ఈఎస్ఐ అమలు చేస్తామనీ, హెల్త్ ఇన్సూరెన్స్ అమలుకు ప్లాన్ చేస్తామని ఇచ్చిన జీవోలు నేటికీ అమలు కాలేదని ఆవేదన వ్యక్తం చేశారు.ఈ ఏడాది రేట్ల ఒప్పందం జరిగి జీవో జారీ చేసినప్పటికీ చెల్లింపులో మాత్రం అధికారులు జాప్యం చేస్తున్నారని వాపోయారు. వెంటనే అమలు చేయాలనీ, లేకుంటే రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు. కార్మికులకు రావాల్సిన డబ్బులను చెల్లించని అధికారులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్మికులందరికీ గుర్తింపు కార్డులివ్వాలనీ, జీసీసీ హమాలీలకు పీఎఫ్ సౌకర్యం కల్పించాలని వారు కోరారు.

ఉద్యోగ విరమణ వయస్సును తగ్గించడం సరికాదు

- విద్యామంత్రికి కాంట్రాక్టు అధ్యాపకుల సంఘం వినతి

నవతెలంగాణ బ్యూరో – హైదరాబాద్

ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో పనిచేస్తున్న కాంట్రాక్టు అధ్యాపకుల ఉద్యోగ విరమణ వయస్సును తగ్గించడం సరైంది కాదని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ కళాశాల కాంట్రాక్టు అధ్యాపకుల సంఘం (టీఎస్‌జీసీసీఎల్ఏ–475) తెలిపింది. ఇలాంటి చర్యల ద్వారా కాంట్రాక్టు అధ్యాపకుల కుటుంబాలను మనోవేదనకు గురిచేయొద్దని కోరింది. ఈ మేరకు విద్యాశాఖ మంత్రి పి సబితా ఇంద్రారెడ్డి, విద్యాశాఖ కార్యదర్శి కార్యాలయంలో బుధవారం టీఎస్‌జీసీసీఎల్ఏ–475 అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు జి రమణారెడ్డి, డాక్టర్ కొప్పిశెట్టి సురేష్ వినతిపత్రం సమర్పించారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో పనిచేస్తున్న కాంట్రాక్టు అధ్యాపకుల ఉద్యోగ విరమణ వయస్సును 61 ఏండ్ల నుంచి 58 ఏండ్లకు తగ్గించడం వల్ల వారు తీవ్ర మానసిక ఆవేదనకు గురవుతున్నారని తెలిపారు. రెగ్యులర్ అధ్యాపకులతో సమానంగా కాంట్రాక్టు అధ్యాపకులు పనిచేస్తున్నారని పేర్కొన్నారు. అందువల్ల రెగ్యులర్ అధ్యాపకుల మాదిరిగానే వారి ఉద్యోగ విరమణ వయస్సును కూడా 61 ఏండ్లకు పెంచాలని కోరారు. అందుకనుగుణంగా ఈ ఏడాది జనవరి 31న ప్రభుత్వ జూనియర్ కాలేజీల్లో పనిచేస్తున్న కాంట్రాక్టు అధ్యాపకుల ఉద్యోగ విరమణ వయస్సును 58 నుంచి 61 ఏండ్లకు పెంచారని వివరించారు. దానివల్ల వంద మంది కాంట్రాక్టు అధ్యాపకులకు న్యాయం జరిగిందని తెలిపారు. కానీ మళ్లీ 58 ఏండ్లకు తగ్గించడం వల్ల వంద మంది కాంట్రాక్టు అధ్యాపకుల కుటుంబాలు వీధిన పడతాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఈనెల ఒకటో తేదీ నుంచి క్రమబద్ధీకరణ చేస్తామంటూ సాక్షాత్తు అసెంబ్లీలో రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిందని గుర్తు చేశారు. ఒకవైపు క్రమబద్ధీకరణ చేయకపోగా, పెంచిన ఉద్యోగ విరమణ వయస్సును తగ్గించడం పట్ల కాంట్రాక్టు అధ్యాపకులు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారని పేర్కొన్నారు. ఈ అంశంలో సీఎం కేసీఆర్ జోక్యం చేసుకుని కాంట్రాక్టు అధ్యాపకులకు న్యాయం చేయాలని కోరారు.

ధాన్యం కొనొద్దని బీజేపీ చెప్తోంది..

బరాబర్ ప్రతి గింజనూ కొంటాం

- రైతులను పీడించేది బీజేపీ.. బాగు కోరేది బీఆర్ఎస్
- ఆంధ్రా ప్రజలు తెలంగాణలో ఉంటామంటున్నారు : ఆర్థిక, వైద్యారోగ్య శాఖ మంత్రి హరీశ్‌రావు



నవతెలంగాణ–జోగిపేట

రైతుల పంటలను కొనొద్దని కేంద్ర బీజేపీ ప్రభుత్వం చెబుతోందని, కానీ రైతులు పండిన ప్రతి గింజనూ రాష్ట్ర ప్రభుత్వం బరాబర్ కొంటుందని ఆర్థిక, వైద్యారోగ్య శాఖ మంత్రి హరీశ్‌రావు స్పష్టం చేశారు. రైతులను పీడించేది బీజేపీ అయితే.. రైతుల బాగు కోరేది బీఆర్ఎస్ అని అన్నారు. సంగారెడ్డి జిల్లా అందోల్–జోగిపేటలో పలు అభివృద్ధి పనుల శంకుస్థాపన, ప్రారంభోత్సవాల్లో మంత్రి పాల్గొన్నారు. ఆందోల్ మండలంలోని లక్ష్మీ నరసింహ ఫంక్షన్ హాల్‌లో ఎమ్మెల్యే చంటి క్రాంతి కిరణ్ అధ్యక్షతన నిర్వహించిన ఆత్మీయ సమ్మేళనంలోనూ పాల్గొని మాట్లాడారు. బోర్ల వద్ద మీటర్లు పెట్టి రైతులను బీజేపీ ప్రభుత్వం పీడిస్తున్నదన్నారు. కానీ బీఆర్ఎస్ ప్రభుత్వం మాత్రం రైతుల కోసం ఉచితంగా 24 గంటల కరెంటును ఇస్తున్నదని తెలిపారు. తెలంగాణలో 56 లక్షల ఎకరాల్లో రైతులు పంటలు సాగు చేస్తున్నారన్నారు. రైతులు అధైర్యపడొద్దని యాసంగికి సంబంధించి చివరి గింజను కూడా ప్రభుత్వమే కొంటుందని భరోసానిచ్చారు. తెలంగాణ ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ పథకాలను చూసి ఆంధ్రా ప్రజలు ఇక్కడే ఉంటామంటున్నారని తెలిపారు. అయితే ఏపీ మంత్రులు మాత్రం లేనిపోని కూతలు కూస్తున్నారన్నారు. ప్రత్యేక హోదా కోసం అధికార, ప్రతిపక్ష పార్టీలు ఎందుకు నోరు మెదపడం లేదని ప్రశ్నించారు. ఏపీ ప్రజలకు వారు ఏమి చేశారో చెప్పాలని డిమాండ్ చేశారు. అనంతరం జర్నలిస్టులకు ఇండ్ల స్థలాల పట్టాలు మంత్రి అందజేశారు. అలాగే, డబుల్ బెడ్‌రూమ్ ఇండ్ల లబ్ధిదారులతో గృహ ప్రవేశాలు చేయించారు. చివరగా జోగిపేట పట్టణంలోని శ్రీరామ ఫంక్షన్ హాల్‌లో ఏర్పాటుచేసిన ఇఫ్తార్ విందులో పాల్గొన్నారు.

వడదెబ్బతో వృద్ధుడు మృతి



(ఫైల్)

నవతెలంగాణ – కౌటాల

కుమురం భీం–ఆసిఫాబాద్ జిల్లా కౌటాల మండలం ముత్తంపేట గ్రామానికి చెందిన దోని రాజులు(70) వడదెబ్బతో బుధవారం మృతి చెందాడు. కుటుంబీకులు తెలిపిన వివరాల ప్రకారం.. ఉదయం పొలానికి వెళ్లిన రాజులు.. మధ్యాహ్నం వరకు అక్కడే ఉన్నాడు. ఈ సమయంలో ఎండ తీవ్రంగా ఉండటంతో వడదెబ్బకు గురై మధ్యాహ్నం తిరిగి ఇంటికి వచ్చాడు. వచ్చిన కొద్దిసేపటికి ఆయాసంగా ఇబ్బంది అనిపించడంతో భార్య రాజుబాయికి చెప్పాడు. దాంతో కుటుంబీకులు అతన్ని వెంటనే ఆస్పత్రికి తరలించే ఏర్పాట్లు చేశారు. సిర్పూర్(టి) సామాజిక ఆస్పత్రికి తీసుకెళ్తుండగా మార్గమధ్యలోనే మృతి చెందాడు.

కేసీఆర్ జీవబంధుకు ప్రతిపాదనలు

డాక్టర్ దూదిమెట్ల బాల్‌రాజ్

నవతెలంగాణ బ్యూరో – హైదరాబాద్

వివిధ రకాల ప్రమాదాల్లో మరణించిన గొర్రెలను కోల్పోయిన కాపరులను ఆదుకునేందుకు వీలుగా 'కేసీఆర్ జీవబంధు పథకం' కోసం ప్రతిపాదనలు ప్రభుత్వానికి పంపినట్టు తెలంగాణ రాష్ట్ర గొర్రెలు, మేకల పెంపకందారుల అభివృద్ధి సమాఖ్య చైర్మెన్ డాక్టర్ దూదిమెట్ల బాలరాజు యాదవ్ తెలిపారు. బుధవారం హైదరాబాద్‌లోని బీఆర్కే భవన్‌లో ఆయన రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారితో సమావేశమయ్యారు. రెండో విడత గొర్రెల పంపిణీ పథకానికి సంబంధించిన ఏర్పాట్లు, విధి విధానాలు, అమలుపై చర్చించారు.జీవబంధు పథకం కోసం "గొర్రెల మంద వద్దపల్లె నిద్ర–గొర్ల కాపరులతో మాట ముచ్చట"లో భాగంగా రాష్ట్రవ్యాప్తంగా పర్యటించి సమగ్రంగా అధ్యయనం చేసినట్టు తెలిపారు. రాష్ట్రంలో ప్రతి ఏటా 6 వేల గొర్రెలు వివిధ ప్రమాదాల్లో మరణిస్తున్నాయని చెప్పారు. రెండో విడత గొర్రెల పంపిణీలో భాగంగా రూ.6,125 కోట్లతో లబ్ధిదారులకు 3.50 లక్షల యూనిట్ల ద్వారా దాదాపు 80 లక్షల గొర్రెలను అందించనున్నట్టు తెలిపారు.

'న్యాక్'కు విశ్వకర్మ అవార్డు



నవతెలంగాణ –హైదరాబాద్

కన్‌స్ట్రక్షన్ ఇండస్ట్రీ డెవలప్‌మెంట్ కౌన్సిల్ (న్యూఢిల్లీ) నిర్మాణ నైపుణ్య అభివృద్ధి అచీవ్‌మెంట్ 14వ అవార్డును 'న్యాక్' గెలుచుకుంది. ఈ అవార్డును జాతీయ నిర్మాణ అకాడమీ డైరెక్టర్లు ఇటీవల న్యూఢిల్లీలో ఐసీఏఆర్ కన్వెన్షన్ సెంటర్‌లో జరిగిన అవార్డుల ప్రదానోత్సవంలో ఆ సంస్థ డైరెక్టర్ జనరల్, డైరెక్టర్లు స్వీకరించారు. కేంద్ర పార్లమెంటరీ వ్యవహారాలు, సాంస్కృతిక శాఖ సహాయ మంత్రి అర్జున్ రామ్ మేఘవాల్ వీటిని ప్రధానం చేశారు. న్యాక్‌కు "నిర్మాణ నైపుణ్య అభివృద్ధి అచీవ్‌మెంట్" విభాగంలో ప్రతిష్టాత్మక విశ్వకర్మ అవార్డు రావడం పట్ల న్యాక్ వైస్ చైర్మెన్, రాష్ట్ర రోడ్లు భవనాలు శాఖ మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డి హర్షం వ్యక్తం చేశారు. న్యాక్ గత ఏడాదిలో 21,240 మంది వ్యక్తులకు నిర్మాణ సంబంధిత శిక్షణా కార్యక్రమాలను నిర్వహించిందని గుర్తు చేశారు. వారిలో చాలా మంది యువతను ప్రయివేటు పరిశ్రమలో విజయవంతంగా ఉపాధి అవకాశాలు కల్పించినందుకు గాను 2023 సంవత్సరానికి భారతదేశంలోనే ఈ ప్రతిష్టాత్మక అవార్డును అందుకున్న ఏకైక నైపుణ్యాభివృద్ధి సంస్థ న్యాక్ అని కొనియాడారు. ఈ ప్రతిష్టాత్మక అవార్డును న్యాక్ సంస్థ అందుకోవడం గర్వించదగ్గ విషయం అని మంత్రి అన్నారు. స్కిల్ డెవలప్మెంట్ పెంచి యువతకు ఉద్యోగ కల్పనకు కృషి చేసేందుకుగాను జిల్లాలకు న్యాక్ విస్తరిస్తున్నదని మంత్రి వెల్లడించారు. అవార్డు రావడానికి కృషి చేసిన న్యాక్ డైరెక్టర్ జనరల్ కె.బిక్షపతి, డైరెక్టర్లు శాంతిశ్రీ, ఎం.రాజిరెడ్డి, హేమలత, సత్యపాల్‌రెడ్డి తదితరులను మంత్రి అభినందించారు. అవార్డు నేపథ్యంలో డీజీ బిక్షపతి స్పందిస్తూ అత్యుత్తమ శిక్షణ ఇవ్వడం ద్వారానే భవిష్యత్ సమాజానికి పునాదులు వేయగలమని వ్యాఖ్యానించారు. సమిష్టి కృషి ద్వారా ఈ అవార్డును సాధించగలిగామని చెప్పారు. డైరెక్టర్ శాంతిశ్రీ మాట్లాడుతూ న్యాక్‌కు కార్పొరేట్ సంస్థలు సహకరిస్తే అద్భుతమైన ఫలితాలు సాధించవచ్చని అభిప్రాయపడ్డారు. యువతను శిక్షణను ఇవ్వడంలో న్యాక్ అంతర్జాతీయ ప్రమాణాలను పాటిస్తున్నదని గుర్తు చేశారు.

మీటర్ రీడింగ్ బాధ్యత వినియోగదారులదే...

అమల్లోకి సెల్ఫ్ మీటరింగ్

- హన్మకొండలో ప్రయోగాత్మకంగా అమలు
- సక్సెస్ అయితే రాష్ట్ర వ్యాప్తంగా...



నవతెలంగాణ–హైదరాబాద్‌బ్యూరో

ప్రతినెలా కరెంటు మీటర్ రీడర్ ఇంటికొచ్చి రీడింగ్ తీసి బిల్లు ఇచ్చి వెళ్తారు. ఆ తర్వాత వినియోగదారులు నేరుగానో లేక ఆన్‌లైన్‌లోనే బిల్లు చెల్లిస్తారు. ఇప్పుడు ఈ పద్ధతికి స్వస్తి చెప్పి, మీటర్ రీడింగ్ బాధ్యతను వినియోగదారుడిపైనే పెట్టే ప్రయత్నానికి విద్యుత్ పంపిణీ సంస్థలు (డిస్కంలు) సిద్ధపడుతున్నాయి. కరోనా సమయంలో తీసుకొచ్చిన సెల్ఫ్ మీటరింగ్ విధానాన్ని సాంకేతికంగా మరింత ఆధునీకరించి ఇప్పుడు నేరుగా అమల్లోకి తేనున్నారు. దీనికోసం హన్మకొండ జిల్లాలో ప్రయోగాత్మకంగా నిర్వహణ చేపట్టాలని నిర్ణయించారు. ఇక్కడ సక్సెస్ అయితే ఉత్తర ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ (టీఎస్ఎన్పీడీసీఎల్)లో పూర్తిగా, ఆ తర్వాత దక్షిణ ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ (టీఎస్ఎస్పీడీసీఎల్)లోనూ అమల్లోకి తెచ్చి, దీన్ని రాష్ట్ర వ్యాప్తం చేయాలని యోచిస్తున్నారు. సెల్ఫ్ మీటరింగ్ యాప్‌ను మొబైల్ ఫోన్‌లో ఇన్‌స్టాల్ చేసుకొని, ప్రతినెలా దానిద్వారా వినియోగదారుడే మీటర్ రీడింగ్ తీసుకొని, అప్పటికప్పుడే బిల్లు చెల్లించే అవకాశాలు కల్పించారు. దీనికోసం వినియోగదారులకు అవగాహనా కార్యక్రమాలు కూడా నిర్వహించనున్నారు. ఇప్పటి వరకు మీటర్ రీడర్లుగా పనిచేసిన వారిని తొలగించబోమనీ, ఇతర పనులకు వారిని ఉపయోగించుకుంటామని డిస్కంల ఉన్నతాధికారులు చెప్తున్నారు. తొలుత 500 యూనిట్లు పైగా వినియోగంలో ఉండే గృహ వినియోగదారులకు దీనిపై అవగాహన కల్పించాలని నిర్ణయించారు. ఆ తర్వాత దశలవారీగా ఇతర వినియోగదారులకు అవగాహనా కార్యక్రమాలు నిర్వహిస్తారు. మీటర్ రీడింగ్ తీయడంలో ఆలస్యం జరిగితే కేటగిరీలు, శ్లాబు రేట్లు మారి కరెంటు బిల్లులు అధికంగా వస్తున్న విషయం తెలిసిందే. సెల్ఫ్ మీటర్ రీడింగ్ బాధ్యతను వినియోగదారుడికే కట్టబెడ్తే, 30 ఆపై రోజుల మీటర్ రీడింగ్‌కు అతడినే బాధ్యుణ్ని చేసే అవకాశాలు ఉన్నాయి. ఎక్కడైనా బిల్లింగ్‌లో తప్పులు దొర్లితే, వాటిని కేస్ టు కేస్ పరిష్కారం చేసుకోవచ్చని విద్యుత్ పంపిణీ సంస్థలు భావిస్తున్నాయి.

బిల్లింగ్‌లో కచ్చితత్వం ఉంటుంది



సెల్ఫ్ మీటర్ రీడింగ్ ద్వారా కరెంటు బిల్లుల్లో ఖచ్చితత్వం పెరుగుతుంది. దీన్ని హన్మకొండలో పైలట్ ప్రాజెక్ట్‌గా అమలు చేస్తున్నాం. అక్కడ సక్సెస్ అయితే రాష్ట్ర వ్యాప్తంగా అమలు చేసే అవకాశాలున్నాయి. ఈ విధానాన్ని వరంగల్‌లో 2020 మే నెలలో కోవిడ్ టైంలో అమలు చేశాం. మంచి ఫలితాలు వచ్చాయి. దీనికి సంబంధించిన యాప్‌ను మరింత ఆధునీకరించాము. డిస్కం పరిధిలో 36 లక్షల మంది వినియోగదారులకు (84 శాతం) ఆండ్రాయిడ్ బిల్లింగ్ ద్వారా చేస్తున్నాం. తొలుత హైవాల్యూ వినియోగదారులకు సెల్ఫ్ మీటర్ రీడింగ్‌ను ప్రవేశపెడుతున్నాం. స్మార్ట్‌ఫోన్ సహాయంతో మీటర్ రీడింగ్ తీసి, అప్పటికప్పుడే బిల్లులు చెల్లించేయొచ్చు. దీనివల్ల డిస్కంకు మరింత త్వరగా బిల్లులు వసూలు అయ్యే అవకాశం కూడా ఉంటుంది. ఈ విధానంలో మీటర్ రీడింగ్‌లో తప్పులు దొర్లే అవకాశాలు కూడా తక్కువ.

– టీఎస్ఎన్పీడీసీఎల్ సీఎమ్‌డీ ఏ గోపాలరావు.

15పేపర్లు లీకైతే..ఆరింటినే రద్దు చేస్తారా?

- కేసును నీరుగార్చేందుకు కుట్ర
- 17న ఇందిరాపార్కు వద్ద నిరహారదీక్ష : వైఎస్ఆర్‌టీపీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల

నవతెలంగాణ–హైదరాబాద్‌బ్యూరో

'టీఎస్‌పీఎస్‌సీలో 15 పేపర్లు లీకైతే 6 పేపర్లను రద్దుచేస్తారా? ఈ కేసులో కీలక నిందితులు ఇద్దరేనా? డ్రగ్స్ కేసు, ఎమ్మెల్యేల కొనుగోలు కేసులాగే టీఎస్‌పీఎస్‌సీ ప్రశ్నాపత్రాల లీక్ కేసునూ సిట్ నీరుగార్చేందుకు ప్రయత్నం చేస్తోంది. ఒక్క పేపర్ లీకైతేనే బయటికి పొక్కే విషయం 15 పేపర్లు లీక్ అయ్యేదాకా బయటకు రాలేదంటే ఇందులో ప్రభుత్వ పెద్దల ప్రమేయం లేదంటారా?' అని వైఎస్ఆర్‌టీపీ అధ్యక్షురాలు వైఎస్.షర్మిల అనుమానం వ్యక్తం చేశారు.ఈ మేరకు బుధవారం ఆమె ఒక ప్రకటన విడుదల చేశారు. ఇంత జరిగినా బోర్డును ప్రక్షాళన చేయలేదంటే ఇంకా కొలువులు అమ్ముకునే ఉద్దేశం మీకుందా? అని ప్రశ్నించారు. ప్రమేయంలేనప్పుడు సీబీఐ దర్యాప్తునకు ఎందుకు భయపడుతున్నారని నిలదీశారు. నిరుద్యోగుల కోసమే టీ–సేవ్ ఫోరం ఏర్పడిందని అన్నారు. విద్యార్థులు, నిరుద్యోగులకు న్యాయం జరిగేవరకు పార్టీలకు అతీతంగా అది పోరాడుతుందని తెలిపారు. అందులో భాగంగా ఈనెల 17న ఇందిరాపార్కు వద్ద జరిగే నిరహార దీక్షకు పెద్దఎత్తున తరలిరావాలని నిరుద్యోగులకు ఆమె పిలుపునిచ్చారు.

ఆర్థిక సంఘం చైర్మెన్, సభ్యులను నియమించాలి

- గవర్నర్‌కు ఫోరం ఫర్ గుడ్ గవర్నెన్స్ లేఖ

నవతెలంగాణ–హైదరాబాద్‌బ్యూరో

రాష్ట్రంలో రెండో ఆర్థిక సంఘానికి చైర్మెన్, నలుగురు సభ్యులను నియమించేందుకు చర్యలు తీసుకోవాలని ఫోరం ఫర్ గుడ్ గవర్నెన్స్ కోరింది. ఈ మేరకు గవర్నర్‌కు బుధవారం లేఖ రాసింది. ఈ సందర్భంగా ఫోరం కార్యదర్శి పద్మనాభరెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర ఆర్థిక సంఘం రాష్ట్రం పన్ను ఆదాయంలో పంచాయతీలకు వాటాను నిర్దేశిస్తుందని అన్నారు. ఆర్థిక సంఘం సిఫార్సులను రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తూ అసెంబ్లీలో పెంచాల్సి ఉందని గుర్తుచేశారు. మొదటి ఆర్థిక సంఘం పదవీకాలం ముగియడంతో పంచాయతీలకు హక్కుగా రావాల్సిన నిధులు రావడంలేదని తెలిపారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం ఆర్థిక సంఘాన్ని ఏర్పాటు చేయడానికి చర్యలు తీసుకునే విధంగా గవర్నర్ జోక్యం చేసుకోవాలని కోరారు.

లీకేజీ ముద్దాయిలను బీజేపీ సన్మానించడం అప్రజాస్వామికం : ఏఐవైఎఫ్

నవతెలంగాణ బ్యూరో – హైదరాబాద్

పదో తరగతి ప్రశ్నాపత్రాల లీకేజీ వ్యవహారంలో ముద్దాయిలుగా ఉన్న వారిని బీజేపీ శ్రేణులు సన్మానించడం అప్రజాస్వామికమని అఖిల భారత యువజన సమాఖ్య (ఏఐవైఎఫ్) విమర్శించింది. ఈ మేరకు ఆ సంఘం రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు వలీ ఉల్లా ఖాద్రీ కె ధర్మేంద్ర బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. లీకేజీ సూత్రధారులకు బీజేపీ అండగా ఉంటుందనే ప్రత్యక్ష సంకేతాన్ని ఇవ్వటాన్ని తాము తీవ్రంగా ఖండిస్తున్నామని తెలిపారు. విద్యార్థుల జీవితాలతో చెలగాటమాడే దుర్మార్గులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. పదో తరగతి ప్రశ్నాపత్రాల లీకేజీ ప్రధాన ముద్దాయి పోలీసు ఉన్నతాధికారులపై అసత్య ఆరోపణలు చేస్తూ, కేసు నుంచి తప్పించుకోవాలనే కుయుక్తులు చేస్తున్నారని తెలిపారు. స్వార్థ రాజకీయ ప్రయోజనాల కోసం విద్యార్థుల జీవితాలను అంధకారంలోకి నెట్టివేసే బీజేపీ కుటిల నీచ రాజకీయాలను విద్యార్థులు, యువత దృష్టికి తీసుకెళ్లి విస్తృతంగా ప్రచారం చేస్తామని పేర్కొన్నారు. పోలీసు యంత్రాంగం పదో తరగతి ప్రశ్నాపత్రాల లీకేజీ కేసును నిష్పక్షపాతంగా విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. లేకుంటే హైకోర్టు న్యాయమూర్తితో సత్వర విచారణ చేపట్టి దోషులను జైలుకు పంపాలని కోరారు.

యూనిఫామ్‌పై మోజుతో పేపర్ లీక్

భయంతో రాంగ్ బబ్లింగ్

- డబ్బుల కోసం పేపర్స్ విక్రయాలు
- ప్రధాన నిందితుడు ప్రవీణ్ లింక్‌లపై ఆరా

నవతెలంగాణ–సిటీబ్యూరో

రాష్ట్రవ్యాప్తంగా సంచలనంగా మారిన టీఎస్‌పీఎస్సీ ప్రశ్నపత్రాల లీకేజీ కేసులో సిట్ దర్యాప్తు చర్చనీయాంశంగా మారిన విషయం తెలిసిందే. ఇప్పటికే సిట్ విచారణలో రోజుకో లింకులు బయటకు రావడంతో మరింత ఆసక్తిగా మారింది. ఈ కేసులో ప్రధాన నిందితులు ప్రవీణ్, రాజశేఖర్‌రెడ్డి, టీఎస్‌పీఎస్సీ కార్యదర్శి అనితా రామచంద్రన్, కమిషన్ సభ్యులు లింగారెడ్డితోపాటు పలువురిని అధికారులు విచారించారు. ఉద్యోగాల నియామకాలు, పేపర్ లికేజీ, ప్రవీణ్‌కు సంబంధించిన వివిధ అంశాలపై సిట్ అధికారులు ఆరా తీశారు. టీఎస్‌పీఎస్సీ కార్యాలయంలోని సెక్రటరీ ఆధీనంలోనే కాన్ఫిడెన్షియల్ విభాగం మొత్తం నడుస్తుంది. ప్రశ్నాపత్రాల తయారీ, వాటిని భద్రపరచడం ఇలా అన్ని కార్యక్రమాలూ సెక్రటరీ ఆధీనంలోనే జరుగుతాయి. లీకేజీ కేసులో ప్రధాన నిందితుడు ప్రవీణ్ అనితా రామచంద్రన్ వద్ద పీఏగా పనిచేసిన విషయం తెలిసిందే. గ్రూప్ వన్ ప్రిలిమ్స్ పరీక్ష రాసిన ప్రవీణ్‌కు అందులో 103 మార్కులు రావడంతో విచారణ అధికారులు ఆ దిశగా ఆరా తీశారు. ఈ కేసులో 18 మంది నిందితుల్లో ఇప్పటి వరకు 17మందిని అరెస్టు చేసిన అధికారులు పలువురిని విచారించారు. వారిచ్చిన సమాచారంతో దర్యాప్తు అంతా ప్రశ్నాపత్రాలు లీక్ కావడం, ఎవరెవరికి వెళ్లాయి, ఎంత మేరకు ఆర్థిక లావాదేవీలు జరిగాయి అనే కోణంలో జరిగింది. ప్రవీణ్ నుంచి కీలక సమాచారం సేకరించారు. మరోసారి ప్రవీణ్, రాజశేఖర్‌రెడ్డిని కస్టడీకి తీసుకుని ఈడీతో కలిసి తిరిగి విచారించాలని సిట్ అధికారులు కసరత్తు చేస్తున్నారు.

వీడు మామూలోడు కాదు...

ప్రవీణ్ తండ్రి ఓ పోలీస్ అధికారి. తన తండ్రికి సమాజంలో వస్తున్న గౌరవాన్ని చిన్నప్పటి నుంచి గమనించేవాడు. దాంతో తాను కూడా పోలీస్ డిపార్టుమెంట్‌లో చేరాలని కోరిక ఉండేది. యూనిఫామ్ వేసుకోవాలన్న కోరిక చిన్నప్పటి నుంచి బలంగా నాటుకు పోయింది. ఇప్పటికీ తన కారుపై పోలీస్ స్టిక్కర్ అతికించుకుని తిరుగుతున్నాడు. అమ్మాయిలను పరిచయాలు చేసుకుని చాటింగ్‌లు చేసేవాడు. ఇదిలావుండగా, ఎలాగైనా యూనిఫామ్‌కు అర్హత సాధించాలనే ఆలోచనతో గ్రూప్–1 పరీక్షలు రాయాలని నిర్ణయించుకున్నాడు. ఈ క్రమంలో రాజశేఖర్‌రెడ్డితో చేతులు కలిపి గ్రూప్–1పేపర్‌ను కంప్యూటర్ నుంచి చాకచక్యంగా తస్కరించాడు. అంతా సజావుగా జరిగిపోయిందను కున్నాడు. కానీ ఏదో తెలియని భయం ప్రవీణ్‌ను వెంటాడింది. ఈ క్రమంలో డబ్బుల కోసం ఆ పేపర్‌ను ఇతరులకు విక్రయించాడు. అంతేకాకుండా గ్రూప్–1 పరీక్షలో మార్కులు అధికంగా వస్తే ఎక్కడ పట్టుపడిపోతానోనని భయంతో కావాలనే బబ్లింగ్ రాంగ్ చేశాడు. పోలీసులకు పట్టుబడకుండా జాగ్రత్తలు తీసుకున్నాడు.

గ్రూప్–1 ప్రిలిమ్స్ పరీక్షలో వేలాది మంది రాంగ్ బబ్లింగ్ చేశారు. వారందరూ కలిసి ఒక వాట్సప్ గ్రూప్‌ను క్రియేట్ చేశారు. దాదాపు 8000 మందిని సభ్యులుగా చేర్చారు. ఆ వాట్సప్ గ్రూప్‌లో

ఆ వాట్సప్‌లో సభ్యులుగా 8 వేల మంది

సభ్యులుగావున్న ప్రవీణ్ ప్రధాన పాత్ర పోషించినట్టు పోలీసులు గుర్తించారు. ఆ గ్రూప్‌లో ప్రవీణ్ ఎవరెవరితో చాట్ చేశాడు, ఆర్థిక లావాదేవీల అంశాలతోపాటు ఇతర అంశాలపై ఆరా తీస్తున్నారు.

దిశ కేసులో పోలీస్ అధికారుల సంఘం పిటిషన్

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

దిశ హత్యాచార కేసు నిందితుల ఎన్‌కౌంటర్ వ్యవహారంలో జస్టిస్ సిర్పుర్కర్ కమిషన్ రిపోర్టుపై హైకోర్టులో తెలంగాణ పోలీస్ అధికారుల సంఘం పిటిషన్ దాఖలు చేసింది. ఆ కమిషన్ నివేదికలో పోలీస్ అధికారులపై పేర్కొన్న అంశాలను సవాల్ చేసింది. ఈ పిటిషన్‌ను ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఉజ్జల్ భూయాన్, జస్టిస్ ఎన్.తుకారాంజీల ధర్మాసనం బుధవారం విచారణకు స్వీకరించింది. పోలీస్ అధికారుల సంఘం తరపున అడ్వకేట్ నిరంజన్‌రెడ్డి వాదనలు వినిపించారు. 'కమిషన్ల రిపోర్టులు క్రిమినల్ కేసుల్లో వర్తించవు. ఆయా కేసుల్లో సీఆర్‌పీసీ ప్రొవిజన్స్ ప్రకారమే నడుచుకోవాలని చట్టాలు చెబుతున్నాయి. జస్టిస్ సిర్పుర్కర్ కమిషన్‌ను నిజనిర్ధారణ కోసం సుప్రీం కోర్టు ఏర్పాటు చేసింది. అదో బైబిల్, ఖురాన్ లాంటి పవిత్ర గ్రంథం కాదు. ఈ కేసు విచారణలో ఆ కమిషన్ నివేదికను ఆధారంగా తీసుకోవద్దు." అని నిరంజన్‌రెడ్డి హైకోర్టుకు విన్నవించారు.

దర్యాప్తునకు సంబంధించిన అనేక అంశాలపై కమిషన్ తన పరిధిని దాటి నివేదికలో కామెంట్ చేసిందని ఆయన అభ్యర్థించారు. క్రిమినల్ ప్రొసిడింగ్స్ నడుస్తున్న సమయంలో ఏకపక్షంగా కమిషన్ నివేదిక ఇవ్వడం సరికాదని విన్నవించారు. ఈ అంశాలు పోలీస్ అధికారుల వృత్తిపై వ్యతిరేక ప్రభావం చూపుతాయని వివరించారు. తప్పనిసరి పరిస్థితుల్లోనే ఆత్మరక్షణ కోసం నిందితులపై పోలీసులు కాల్పులు జరపాల్సి వచ్చిందని తెలిపారు. ఈ వ్యవహారంలో దాఖలైన పిటిషన్‌లన్నింటినీ డిస్మిస్ చేయాలని విన్నవించారు. ఈ కేసు తదుపరి విచారణను జూన్ 21కి హైకోర్టు వాయిదా వేసింది.

లాకర్ల తాళాలు కనిపించకపోవడంపై రిపోర్టు సమర్పించాలి : కేంద్ర ఎన్నికల సంఘానికి హైకోర్టు ఆదేశం

జగిత్యాల జిల్లా ధర్మపురి అసెంబ్లీ సీటుకు 2018లో జరిగిన ఎన్నికలకు చెందిన ఫైళ్లు, ఈవీఎంలు భద్రం చేసిన స్ట్రాంగ్ రూంలోని కొన్ని లాకర్ల తాళాలు కనిపించకుండాపోవడంపై కేంద్ర ఎన్నికల సంఘం దర్యాప్తు చేసి రిపోర్టు ఇవ్వాలని హైకోర్టు ఆదేశించింది. తాళాలు కనిపించకపోవడంపై విచారణ చేయిస్తామని కేంద్ర ఎన్నికల సంఘం చెప్పడంతో ఆ మేరకు బుధవారం జస్టిస్ లక్ష్మణ్ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ నెల 26 నాటికి నివేదిక ఇవ్వాలన్నారు. విచారణను 18కి వాయిదా వేశారు. ధర్మపురి నుంచి కొప్పుల ఈశ్వర్ (మంత్రి) ఎమ్మెల్యేగా గెలుపొందడాన్ని సవాల్ చేస్తూ ఆయనపై పోటీ చేసి ఓడిపోయిన కాంగ్రెస్ అభ్యర్థి ఎ.లక్ష్మణ్ రావు హైకోర్టును ఆశ్రయించారు.

సీసీఎస్‌కు జమ చేయాలి... సొంత అవసరాలకు వాడుకోవద్దు : ఆర్టీసీ అధికారులకు హైకోర్టు ఆదేశం

ప్రతి నెలా సిబ్బంది వేతనం నుంచి తీసుకున్న నిధులను ఆర్టీసీ ఉద్యోగుల సహకార పరపతి సంఘాని(సీసీఎస్)కి జమ చేయాలనీ, ఆర్టీసీ వాటిని తన సొంత అవసరాలకు ఎట్టి పరిస్థితుల్లోనూ వాడుకోకూడదని అధికారులను హైకోర్టు ఆదేశించింది. పిటిషనర్ సొసైటీ తీవ్రమైన కష్టాలను ఎదుర్కొంటోందనీ, కోలుకోలేని నష్టాన్ని ఉందని గుర్తుంచుకోవాలని ఆర్టీసీ ఎండీ, చీఫ్ మేనేజర్‌కు స్పష్టం చేసింది. తదుపరి విచారణను ఈ నెల 18కి వాయిదా వేసింది. సీసీఎస్‌కు జమ చేయాల్సిన నిధులను ఆర్టీసీ సొంతానికి వాడేసుకోవడంతో వడ్డీ సహా రూ.900 కోట్ల బకాయిలు ఏర్పడ్డాయి. ఫలితంగా ఉద్యోగులకు ఈ సంఘం ద్వారా మంజూరు చేయాల్సిన రుణాలు ఆగిపోయాయి. ఈ సంఘంలో పొదుపు చేసుకున్న మొత్తానికి సంబంధించి విశ్రాంత ఉద్యోగులకు చెల్లించాల్సిన వడ్డీ విషయంలోనూ ఇబ్బందులు ఏర్పడుతున్నాయి. దీంతో బకాయిల్లో కొంత మొత్తం చెల్లించాలని ఆ సంఘం ఆర్టీసీని కోరుతున్నా స్పందన రాలేదు. దీంతో హైకోర్టును ఆశ్రయించిన విషయం తెలిసిందే. దీనిపై మంగళవారం న్యాయమూర్తి జస్టిస్ సీ.వీ.భాస్కర్‌రెడ్డి విచారణ చేపట్టారు. పిటిషనర్ తరపున న్యాయవాది ఏ.కే.జయప్రకాశ్‌రావు వాదనలు వినిపిస్తూ.. ఉద్యోగుల నుంచి ప్రతి నెలా నిధులు సేకరిస్తున్నారు. వారి జీతాల నుంచి కట్ చేసిన మొత్తాన్ని సీసీఎస్ ఖాతాలో జమ చేసేలా ఆదేశాలు జారీ చేయాలన్నారు. అలా కాకుండా ఆర్టీసీ వాటిని వాడుకుంటోందనీ, ఇది సరికాదని నివేదించారు. ప్రతివాదుల తరపున న్యాయవాది వాదనలు వినిపిస్తూ.. నిధుల విడుదల విషయంలో ప్రభుత్వంతో ఆర్టీసీ ఎండీ చర్చలు జరుపుతున్నారని చెప్పారు. వాదనలు విన్న న్యాయమూర్తి.. ప్రతినెలా నిధులు జమచేయాలని ఆదేశిస్తూ, విచారణ వాయిదా వేసింది.



అధికారులకు నోటీసులు

ఆర్టీసీ గుర్తింపు సంఘం ఎన్నికల నిర్వహణపై కౌంటర్ దాఖలు చేయాలని అధికారులకు హైకోర్టు నోటీసులు జారీ చేసింది. గుర్తింపు సంఘం ఎన్నికలు వెంటనే నిర్వహించేలా రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆదేశించాలని కోరుతూ ఆర్టీసీ ఎంప్లాయిస్ యూనియన్ హైకోర్టును ఆశ్రయించింది. కార్మిక శాఖ ముఖ్య కార్యదర్శి, కార్మిక శాఖ కమిషనర్, ఆర్టీసీ ఎండీతోపాటు పలువురిని పిటిషన్‌లో ప్రతివాదులుగా చేర్చింది. దీనిపై న్యాయమూర్తి జస్టిస్ సూరేపల్లి నందా మంగళవారం విచారణ చేపట్టారు. పిటిషనర్ తరపున న్యాయవాది ఏకే జయప్రకాశ్‌రావు వాదనలు వినిపించారు. అనంతరం న్యాయమూర్తి ప్రతివాదులకు నోటీసులు జారీ చేస్తూ, విచారణను వచ్చే సోమవారానికి వాయిదా వేశారు.

జస్టిస్ తొట్టతిల్ బి.ఎన్.రాధాకృష్ణన్‌కు నివాళి

తెలంగాణ తొలి ప్రధాన న్యాయమూర్తి, ఉమ్మడి హైకోర్టు చివరి సీజే జస్టిస్ తొట్టతిల్ బి.ఎన్.రాధాకృష్ణన్‌కు హైకోర్టు ఘనంగా నివాళులర్పించింది. ఏప్రిల్ 3న ఆయన కన్నుమూసిన విషయం తెలిసిందే. ఆయనకు ఫుల్‌కోర్టు సంతాపం వ్యక్తం చేసింది. ఆయన కీలక తీర్పులను, అవి సమాజంపై చూపిన ప్రభావాన్ని ఏజీ బీఎస్ ప్రసాద్ వివరించారు. రాధాకృష్ణన్ సేవలు ఎప్పటికి గుర్తుండిపోతాయని సీజే ఉజ్జల్ భూయాన్ అభిప్రాయపడ్డారు.

లౌకిక ప్రజాస్వామ్యంపై బీజేపీ దాడి

- సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు ఈటీ నరసింహ

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

దేశంలో లౌకిక ప్రజాస్వామ్యంపై కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం దాడి చేస్తున్నదని సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు ఈటి నరసింహ విమర్శించారు. హైదరాబాద్‌లోని హిమాయత్ నగర్‌లో ఉన్న సత్యనారాయణరెడ్డి భవన్ వద్ద బుధవారం 'బీజేపీ హటావో-దేశ్‌కో బచావో' పాదయాత్ర ప్రచార హోర్డింగ్‌ను ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా నరసింహ మాట్లాడుతూ బీజేపీకి ఎంఐఎం బీటీమ్‌గా పనిచేస్తున్నదని అన్నారు. బలంలేని చోటకూడా ఎంఐఎం తమ అభ్యర్థులను పోటీలోకి దింపి పరోక్షంగా బీజేపీ అభ్యర్థులను గెలిపిస్తున్నదని విమర్శించారు. బీజేపీ, ఎంఐఎం అనైతిక బంధం వల్ల లౌకిక ప్రజాస్వామ్యం ప్రమాదంలో పడిందన్నారు. మతం ఆధారంగా ప్రజలను విభజించే శక్తులైన బీజేపీ, ఎంఐఎం ఎదుగుదల దేశానికి ప్రమాదకరమని అన్నారు. ఆర్థిక మాంద్యం, నిరుద్యోగం, అధిక ధరలతో దుర్భరమైన జీవితాలు గడుపుతున్న సామాన్య ప్రజల సమస్యలను పరిష్కరించడంలో కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని విమర్శించారు. దేశ సంపదను కార్పొరేట్లకు కట్టబెడుతున్నదని అన్నారు. 'బీజేపీ హటావో-దేశ్‌కో బచావో' నినాదంతో దేశవ్యాప్తంగా ఈనెల 14 నుంచి వచ్చేనెల 15 వరకు పాదయాత్రలు నిర్వహించాలని తమ పార్టీ జాతీయ సమితి పిలుపునిచ్చిందని వివరించారు. అందులో భాగంగా హైదరాబాద్‌లో నెలరోజులపాటు ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని చెప్పారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి ఎస్ ఛాయాదేవి, సహాయ కార్యదర్శి స్టాలిన్, కమతం యాదగిరి, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు బి వెంకటేశం, జిల్లా కార్యవర్గ సభ్యులు నెర్లకంటి శ్రీకాంత్, చెట్టుకింది శ్రీనివాస్, విద్యార్థి నాయకులు కళ్యాణ్ సందీప్, వినోద్ తదితరులు పాల్గొన్నారు.

మార్చి నెల పెండింగ్ పారితోషికాలు వెంటనే చెల్లించాలి

- వైద్యారోగ్యశాఖ కమిషనర్‌కు ఆశా యూనియన్ వినతి

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

ఆశావర్కర్లకు ఈ ఏడాది మార్చి నెల పెండింగ్ పారితోషికాలు వెంటనే చెల్లించాలని తెలంగాణ ఆశా వర్కర్స్ యూనియన్ (సీఐటీయూ అనుబంధం) కోరింది. ఈ మేరకు బుధవారం ఆ యూనియన్ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పి.జయలక్ష్మి, ఆర్.నీలాదేవి, రాష్ట్ర కోశాధికారి పి.గంగమణి ఒక ప్రకటన విడుదల చేశారు. ప్రతి నెల ఒకటి లేదా రెండో తేదీకల్లా ఆశాలకు రాష్ట్ర ప్రభుత్వం పారితోషికాలు చెల్లించేదనీ, మార్చి నెల పది రోజులు ఆలస్యం కావడంతో వారు ఆందోళన చెందుతున్నారని తెలిపారు. అసలే చాలీచాలనీ పారితోషికాలు, మరోవైపు నిత్యావసర వస్తువుల ధరల పెరుగుదల, దీనికి తోడు ఆ పారితోషికాలు సకాలంలో రాకపోవడంతో ఆర్థిక ఇబ్బందులను ఎదుర్కొంటున్నారని తెలిపారు. ఆశావర్కర్లందరూ మహిళలు, అత్యధికులు బడుగు, బలహీనవర్గాలకు చెందిన వారే ఉన్నారనీ, కుటుంబ అవసరాలు తీర్చుకోవడానికి అప్పులు చేయాల్సిన పరిస్థితి ఎదుర్కొంటున్నారని తెలిపారు. వారి పరిస్థితిని అర్థం చేసుకుని వెంటనే సమస్యను పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు.

ఇక్రిశాట్ డైరెక్టర్ జనరల్‌కు సత్కారం

నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

ఇక్రిశాట్ డైరెక్టర్ జనరల్ డా.జాక్విలిన్ హుఘ్స్ బుధవారం హైదరాబాద్‌లోని బీఆర్‌కేఆర్ భవన్‌లో రాష్ట్ర ప్రభుత్వ ప్రధానకార్యదర్శి శాంతికుమారిని మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఇక్రిశాట్ డైరెక్టర్ జనరల్‌ను సీఎస్ శాలువాతో సత్కరించి జ్ఞాపికను అందజేశారు.

ప్రయివేటీకరణను వ్యతిరేకించటమే మా పార్టీ విధానం

మంత్రి పువ్వాడ అజయ్ కుమార్

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

బీజేపీ, కాంగ్రెస్ పార్టీలు తెరచాటు ఒప్పందాలతో రాష్ట్రానికి అన్యాయం చేస్తున్నాయని రాష్ట్ర రవాణాశాఖ మంత్రి పువ్వాడ అజయ్ విమర్శించారు. బుధవారం హైదరాబాద్‌లోని బీఆర్ఎస్ఎల్పీ కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రయివేటీకరణ వ్యతిరేకతే తమ పార్టీ విధానమని స్పష్టం చేశారు. తెలంగాణ విభజన చట్టం ప్రకారం తెలంగాణలో, ఏపీలో వేర్వేరు స్టీల్ ఫ్యాక్టరీలు పెట్టాలని ఉన్నట్టు గుర్తుచేశారు. ఉమ్మడి ఖమ్మం జిల్లాలో ఐరన్ నిక్షేపాలు ఉన్నాయని గుర్తుచేశారు. కానీ అక్కడ ఐరన్ ఓర్ గనులు లేవంటూ కేంద్రం మళ్లీ అబద్దాలు చెబుతోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. బైలడిల్ల నుండి ఐరన్ ఓర్ ఇస్తే ఇక్కడ ఉన్న గనులతో ఫ్యాక్టరీ పెట్టొచ్చని సూచించారు. బయ్యారం, విశాఖ ఉక్కు ఫ్యాక్టరీలను కనుమరుగు చేసి 1,800 కిలోమీటర్ల దూరంలో గుజరాత్‌లో ఉక్కు ఫ్యాక్టరీ పెట్టేందుకు కేంద్రం ప్రయత్నిస్తున్నదని తెలిపారు. ఇదే విషయాన్ని కేటీఆర్ స్పష్టంగా చెప్పినప్పటికీ దానిపై కాంగ్రెస్ బీజేపీ నాయకులు ఇష్టం వచ్చినట్లు మాట్లాడుతున్నారని విమర్శించారు. బయ్యారం స్టీల్ ప్లాంట్ కోసం పెట్టుబడి కింద రాష్ట్ర ప్రభుత్వం 50 శాతం భరించడానికి సిద్ధంగా ఉన్నదని కేటీఆర్ చెప్పారని గుర్తుచేశారు. అక్కడ ఫ్యాక్టరీ ఏర్పాటు చేసుంటే ఈ పాటికే సుమారు 20 వేల ఉద్యోగాలు వచ్చేవని తెలిపారు.

ఎంపీ మాలోత్ కవిత మాట్లాడుతూ ఆదానీకి మేలు చేకూర్చేలా కేంద్రం చర్యలు ఉంటున్నాయని విమర్శించారు. బయ్యారం ఉక్కు కర్మాగారం విషయంలో కాంగ్రెస్ పార్టీ బీజేపీని నిలదీయడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎంపీ వద్దిరాజు రవిచంద్ర మాట్లాడుతూ బయ్యారం ఉక్కు ఫ్యాక్టరీపై అన్ని పార్టీలు ఐక్యంగా ముందుకెళ్లాలని కోరారు.

ప్రభుత్వ పరీక్షల విభాగం సంచాలకులుగా కృష్ణారావు

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

ప్రభుత్వ పరీక్షల విభాగం సంచాలకులు (డీజీఈ)గా ఎ కృష్ణారావు బుధవారం పూర్తిస్థాయి బాధ్యతలను స్వీకరించారు. ప్రభుత్వ పరీక్షల విభాగం సంచాలకులుగా పనిచేసిన అలుగుబెల్లి సత్యనారాయణరెడ్డి గుండెపోటుతో మరణించడంతో గతేడాది, జనవరి 20వ తేదీన ఆయనకు పూర్తిస్థాయి అదనపు బాధ్యతలను అప్పగించిన విషయం తెలిసిందే. ప్రభుత్వ పరీక్షల విభాగం సంచాలకులుగా కృష్ణారావుకు పూర్తిస్థాయి బాధ్యతలను అప్పగిస్తూ పాఠశాల విద్యాశాఖ సంచాలకులు శ్రీదేవసేన ఈనెల మూడో తేదీన ఉత్తర్వులు విడుదల చేశారు. అయితే కుటుంబ ఇబ్బందుల నేపథ్యంలో ఆయన సెలవులో ఉన్నారు. ఇప్పటి వరకు విద్యాశాఖ అదనపు సంచాలకులు కె లింగయ్య ప్రభుత్వ పరీక్షల విభాగం సంచాలకులుగా వ్యవహరించారు. బుధవారం కృష్ణారావు ప్రభుత్వ పరీక్షల విభాగం సంచాలకులుగా పూర్తిస్థాయి బాధ్యతలను స్వీకరించారు.

ఖమ్మం జిల్లాలో నలుగురి మృతి బాధాకరం

క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందించాలి : బండి

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

ఖమ్మం జిల్లా చీమలపాడులో బీఆర్ఎస్ నేతల నిర్లక్ష్యం వల్ల బాణాసంచా నిప్పురవ్వలు ఓ ఇంటిపై పడి నలుగురు మృతి చెందడం బాధాకరమని బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు బండి సంజయ్‌కుమార్ పేర్కొన్నారు. క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందేలా చూడాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. మృతుల, క్షతగాత్రుల కుటుంబాలకు అన్ని విధాలుగా సాయం చేయాలని డిమాండ్ చేశారు. బుధవారం ఈ మేరకు ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. నేతల ఆనందం కోసం ప్రజల ప్రాణాలతో చెలగాటం ఆడటం ఏమిటని ప్రశ్నించారు. బాణాసంచా పేలి ఇద్దరు చనిపోయిన ఘటనకు బాధ్యులైన బీఆర్ఎస్ నేతలపై తక్షణమే కేసులు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. మహబూబ్‌నగర్ కల్తీకల్లు తాగి ఒకరు చనిపోవడం, పలువురు ప్రాణాపాయ స్థితిలో కొట్టుమిట్టాడుతుండటం బాధాకరమని పేర్కొన్నారు.

విశ్వకర్మ సంఘం రాష్ట్ర కార్యదర్శిగా తరుణే మహేంద్రాచారి



నవతెలంగాణ- ఘట్కేసర్

విశ్వకర్మ సంఘం తెలంగాణ రాష్ట్ర కార్యదర్శిగా నియమితులైన ఘట్కేసర్ మండల్ కొర్రెముల గ్రామానికి చెందిన తరిణే మహేంద్రాచారి మంత్రి చామకూర మల్లారెడ్డిని ఆయన నివాసంలో కలిశారు. ఇటీవల అఖిల భారత విశ్వకర్మ సంఘం మహాసభలో ఆయన్ను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా మహేంద్రాచారిని మంత్రి శాలువాతో సన్మానించి అభినందించారు. మంత్రిని కలిసిన వారిలో బీఆర్ఎస్ ఘట్కేసర్ మండల వర్కింగ్ ప్రెసిడెంట్ బైనగారి నాగరాజు, ఎస్సీసెల్ మండల ప్రెసిడెంట్ గ్యార రవి, బీఆర్ఎస్ కొర్రెముల గ్రామ అధ్యక్షులు కుర్రి ఆనంద్, యూత్ మాజీ అధ్యక్షులు కోళ్ల యాదగిరి, నాయకులు కొప్పుల శంకర్ ఉన్నారు.

'పెన్షన్ పంపిణీ కేంద్రాన్ని ఏర్పాటు చేయండి'



నవతెలంగాణ - మీర్ పేట్

వృద్ధులు, వికలాంగుల తదితరుల కోసం పింఛన్ పంపిణీ కేంద్రాన్ని లెనిన్ నగర్‌లో ఏర్పాటు చేయాలని మీర్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్ కార్పొరేటర్లు కమిషనర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. లెనిన్ నగర్ ప్రాంతంలో ఆసరా పథకం ద్వారా సుమారు 800 మంది పింఛన్ పొందుతున్నారని చెప్పారు. వీళ్ల ప్రతినెలా మీర్‌పేట్ వెళ్లి పింఛన్ తీసుకోవాలంటే బస్సు, ఆటో సౌకర్యం లేక నడుచుకుంటూ వెళ్లాల్సి వస్తుందన్నారు. అందువల్ల లెనిన్ నగర్‌లో పింఛన్ సెంటర్ ఏర్పాటు చేయాలని కమిషనర్‌ను కోరామన్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు ముత్తంగి కరుణానిధి, ఇంద్రావత్ రవి నాయక్, బీజేపీ నాయకులు చెవ్వ శ్రవణ్, రవి నాయక్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ, ప్రయివేటు సంస్థలు సైబర్ సేఫ్టీ పాటించాలి

- హోం మంత్రి మహమూద్ అలీ
- హైదరాబాద్ వార్షిక సైబర్ సెక్యూరిటీ సమ్మిట్-2023 అవగాహన సదస్సు
- మా షూటింగ్ సెట్‌లో ఓ వ్యక్తికి కూడా సైబర్ కాల్ వచ్చింది : సినీ దర్శకుడు రాజమౌళి



నవతెలంగాణ-సిటీబ్యూరో

దేశంలోనే తెలంగాణ పోలీసులు నెంబర్ వన్‌గా నిలిచారని హోం మంత్రి మహమూద్ అలీ తెలిపారు. తెలంగాణలో పోలీసుల పనితీరు బాగుందన్నారు. గురువారం హైదరాబాద్ సిటీ సెక్యూరిటీ కౌన్సిల్(హెచ్‌సీఎస్‌సీ), హైదరాబాద్ పోలీసుల ఆధ్వర్యంలో 'హైదరాబాద్ వార్షిక సైబర్ సెక్యూరిటీ సమిట్-2023 పేరుతో అవగాహన సదస్సును నిర్వహించారు. బంజారా హిల్స్‌లోని తాజ్ డెక్కన్‌లో నిర్వహించిన కార్యక్రమానికి హోం మంత్రి ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. రోజురోజుకు హ్యాకింగ్, ఆన్‌లైన్ ఫ్రాడ్స్, ఫిషింగ్ మెయిల్స్, లింక్స్‌తో నేరాలు పెరిగిపోతున్నాయని గుర్తు చేశారు. స్కూల్స్, ఐటీ కంపనీలు, ప్రభుత్వ ప్రయివేటు సంస్థలు సైబర్ సేఫ్టీ పాటించాలన్నారు. సైబర్‌నేరాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండా లన్నారు. ఐటీ, ఇతర కంపెనీల నుంచి పెద్ద మొత్తంలో పెట్టుబడులు వస్తున్నాయన్నారు. డీజీపీ అంజనీకుమార్, సీపీ సీవీ ఆనంద్ లా అండ్ ఆర్డర్‌ను బాగా కంట్రోల్ చేస్తున్నారని ప్రశంసించారు.

విశిష్ట అతిగా పాల్గొన్న ప్రముఖ సినీ డైరెక్టర్ రాజమౌళి మాట్లాడారు. సైబర్ నేరాల పట్ల ప్రజల్లో అవగాహన అవసరమన్నారు. 80 శాతం నేరాలు ప్రజల్లో అవగాహన లేకపోవడం వల్ల జరుగుతున్నాయని గుర్తు చేశారు. బడా రాజకీయ నాయకుల నుంచి స్టార్ సెలబ్రిటీలు, సాధారణ కూలీల వరకు ప్రతీ ఒక్కరూ సైబర్ క్రైమ్ బాధితులే అని తెలిపారు. తమ షూటింగ్ సెట్ వర్క్‌లో ఉన్న ఓ వ్యక్తికి సైతం సైబర్ కాల్ వచ్చిందని, బ్యాంక్ మేనేజర్ అని మాట్లాడుతున్నామని చెప్పడంతో ఓటీపీ చెప్పాడన్నారు. దాంతో అతని 10 నెలల వేతనం అతని బ్యాంక్ ఖాతా నుంచి సైబర్ నేరస్తులు కొట్టేశారన్నారు. డబ్బుపై దురాశతో సైబర్ నేరగాళ్ల రెచ్చిపోతున్నారని తెలిపారు. కష్టపడి సంపాదించే డబ్బుతో వచ్చే ఆనందం వేరన్నారు. ఈజీగా వచ్చే డబ్బు మోసానికి దారితీస్తుందన్నారు. చిన్నప్పటి నుంచే మన పిల్లలకు కష్టం అంటే ఎంటో నేర్పించాలన్నారు. సైబర్ నేరాలపై తెలుగులో ప్రజలకు అవగాహన కలిగేలా విస్తత ప్రచారం చేయాలన్నారు. వంద పెడితే.. వెయ్యి, వెయ్యి పెడితే లక్ష, లక్ష పెడితే పది లక్షలు వస్తాయని అత్యాశకు పోయి డబ్బులు పోగొట్టుకోవడం మన అవి వేకం అవుతుందన్నారు. సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాల న్నారు. బ్యాంక్ అధికారులు ఆన్‌లైన్‌లో ఆర్థిక లావాదేవీల విషయం అడగరని చెప్పారు. సైబర్ నేరాలకు గురైతే వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేయాలన్నారు. లేదా 1930 ఆన్‌లైన్ నెంబర్‌లో డయాల్ చేయాలని కోరారు. రోజురోజుకు అనేక రకాలుగా సైబర్ నేరాలు పెరిగిపోతున్నాయని హైదరాబాద్ సీపీ, సమ్మిట్ చైర్మెన్ సీవీ ఆనంద్ తెలిపారు. లోన్‌ఫ్రాడ్, ఇన్‌స్ట్రాగ్రామ్, మార్ఫింగ్, ఇన్వెస్ట్‌మెంట్, కేవైసీ తదితర పేర్లతో సైబర్ నేరస్తులు రెచ్చిపోతున్నారన్నారు. సైబర్ నేరాలకు కట్టడి చేయడం, దర్యాప్తు వేగవంతగా పూర్తి చేయడంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ఈ సమ్మిట్ నిర్వహించామన్నారు. రియల్ఎస్టేట్, ఐటీ, పాఠశాలలు, ప్రభుత్వ, ప్రయివేట్‌తోపాటు ఇతర సంస్థలలో సైబర్ నేరాలపై అవగాహన తీసుకుని రావడం తోపాటు కట్టడి చేసేవిధంగా తీసుకోవాల్సిన చర్యలపై అభిప్రా యాలను తీసుకుంటున్నామన్నారు. ఈ కార్యక్రమానికి దేశవ్యాప్తంగా నిపుణులు పాల్గొన్నారని తెలిపారు. ప్రతీ సంవత్సరం ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో అదనపు సీపీలు, జాయింట్ సీపీలు, డీసీపీలు, ఏసీపీలు, సీఐలు ఐటీ నిపుణులు, కాలేజీ విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

గుర్తు తెలియని మహిళ మృతదేహం లభ్యం

- సర్దార్ పటేల్ నగర్ ప్రధాన రహదారి పక్కసందులో సంచిలో శవం



నవతెలంగాణ- బడంగ్‌పేట్

రంగారెడ్డి జిల్లా మహేశ్వరం జోన్ పహాడీషరీఫ్ పోలీస్ స్టేషన్ పరిధిలో హార్డ్‌వేర్ పార్క్ సర్దార్ నగర్ గేట్ సమీపంలో సుమారు 30 నుండి 35 సంవత్సరాల మహిళ మృతదేహం ఒక సంచిలో మూటకట్టి పడేసి వెళ్లిన సంఘటన పహాడిషరీఫ్ పోలీస్ స్టేషన్ పరిధిలో తీవ్ర సంచలనం రేపుతోంది. మహేశ్వరం జోన్ డీసీపీ శ్రీనివాస్ తెలిపిన వివరాల ప్రకారం పహడి షరీఫ్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఉన్న సర్దార్ పటేల్ నగర్ ప్రధాన రహదారి పక్కన సంచి నుండి భరించలేని దుర్వాసన రావటం గమనించిన స్థానికులు 100కు డయల్ చేశారు. సమాచారం అందు కున్న పోలీసులు వెంటనే ఏసీపీ అంజయ్య ఆధ్వర్యంలో ఇన్‌స్పెక్టర్ కాశీ విశ్వనాథ్, సిబ్బందితోపాటు సంఘటన స్థలానికి చేరుకున్నారు. అక్కడ పడేసిన యూరియా సంచి విప్పి చూడగా అందులో 30 నుంచి 35 మధ్య వయస్సు ఉన్న గుర్తు తెలియని మహిళ మృతదేహం లభ్యమైంది. ఎరుపు రంగు చీర,మెడకు బిగించిన టవల్,చెప్పులు సంచిలో ఉన్నాయని పోలీసులు తెలిపారు. నాలుక బయటకు రావటంతో టవల్ తో బిగించి హత్య చేసినట్టు పోలీసులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. మహిళ మృతదేహం కుళ్లిన స్థితిలో లభ్యం కావడంతో హత్య చేసి 3 రోజులు అయ్యి ఉండ వచ్చునని పోలీసులు భావిస్తున్నారు. ఎక్కడో హత్య చేసి బుధవారం తెల్లవార జామున వాహనంపై మూటలో శవాన్ని తీసుకువచ్చి ఇక్కడ పడవేసి ఉంటారని పోలీసులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. మృత దేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు. హత్యకు ముందు ఆమెపై లైంగికదాడికి పద్దారనే కోణంలో దర్యాప్తు చేస్తున్నారు. అంతేకాకుండా 3,4రోజుల క్రితం రంగారెడ్డి జిల్లాలో ఏదైనా మిస్సింగ్ కేసు నమోదు అయ్యిందా అనే కోణంలో దర్యాప్తు చేస్తున్నారు. ఆచూకీ లభిస్తే హత్య మిస్టరీ వెలుగులోకి వస్తుందని డీసీపీ శ్రీనివాస్ తెలిపారు. ఈ కేసును పహడి షరీఫ్ పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. మెడలో పసుపు కలర్ తాడు,చేతి కి రెడ్ కలర్ గాజులు,చేతులకు ఉంగరాలు,పసుపు కలర్ జాకెట్, చాకలెట్ కలర్ లంగా,రెడ్ కలర్ చీర,బ్లాక్ రెడ్ కలర్ చెప్పులు ధరించి ఉంది.

అప్పుడు కట్టుకొమ్మన్నారు ... ఇప్పుడు నేలమట్టం



నవతెలంగాణ-బోడుప్పల్

పేదల సంక్షేమమే ధ్యేయంగా సర్కారు పనిచేస్తుందని పాలకులు పదే పదే పేర్కొంటున్నా అవేమి తమకు పట్టవన్నట్టుగా మేడిపల్లి రెవెన్యూ అధికారులు తమ ప్రతాపాన్ని పేదలపై చూపిస్తున్నారని ఆరోపణలు వస్తు న్నాయి. వివరాల్లోకి వెళ్తే మేడ్చల్ జిల్లా మేడిపల్లి మండలం పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని సర్వే 199లోని ప్రభుత్వ స్థలంలో గత ఎనిమిది సంవత్సరాల క్రితం రేకులతో నిర్మించుకున్న ఇంటిని మరమ్మతుల కోసం పునర్: నిర్మించుకోగా దానిని బుధవారం మేడిపల్లి మండల రెవెన్యూ సిబ్బంది. పోలీసులు, జలమండలి అధికారులు దగ్గరుండి కూల్చివేశారు. బాధితురాలు మహా బుబి, హూస్సేనీలు కూల్చివేతను అడ్డుకునే ప్రయత్నం చేయగా పోలీసులు ఈడ్చి పడేశారని మీడియాకు వారు తమ ఆవేదనను వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా బాధితురాలు మహాబుబీ మాట్లాడుతూ.. ఎనిమిది సంవత్సరాల క్రితం ఇంటి నిర్మాణం చేసుకొని నివాసముంటున్నామని చెప్పారు. విద్యుత్ మీటర్ పొంది నల్లా కనెక్షన్ తీసుకోని నెల నెలా బిల్లులు చెల్లిస్తున్నం... వర్షాకాలంలో ఇల్లు కురుస్తుండడంతో నెల రోజులుగా మరమ్మ తులు చేసుకుంటున్నామన్నారు. ఈ విషయం పీర్జాదిగూడ రెవెన్యూ అధికారి ధృష్టికి తీసుకెళ్లగా కట్టుకోవాలని చెప్పారని, ఇప్పుడు నిర్మాణం పూర్తి చేసిన తర్వాత.. ఎలాంటి ముందస్తు సమాచారం ఇవ్వకుండ కూల్చివేయడం ఏమిటని, అందులోను ఒక దివ్యాంగురాలినైన తనపై అధికారులు వ్యవహరించిన తీరు బాధ కలిగించిందని ఆవేదన వ్యక్తం చేశారు.

నిర్మాణ దశలోనే ఎందుకు నివారించలేదు

ప్రభుత్వ భూముల్లో ఎకరాల కొద్ది ఆక్రమించి చేపట్టిన నిర్మాణాలపై చర్యలు తీసుకోవడంలో విఫలమైన అధికారులు 60 గజాల్లో ఇల్లు కట్టుకున్న పేదలపై ప్రతాపం చూపడం వెనుక ఉన్న అంతర్యం ఏంటో అర్థం కావడం లేదని పలువురు అంటున్నారు. దివ్యాంగురాలైన అభాగ్యురాలు పైసాపైసా కూడగట్టుకోని ఇల్లు కట్టుకుంటే అధికారులు మూకుమ్మడిగా దాడి చేసి కూల్చివేయడంతో ఆ కుటుంబం రోడ్డుపాలైంది. అధికారులు ముందే స్పందించి నిర్మాణాన్ని నిలిపివేస్తే పేదవారికి కనీసం పదిలక్షలైన మిగిలేవి కదా అని పలువురు ప్రశ్నిస్తున్నారు.



ఎలివేటర్ కారిడార్ పనులను వేగవంతం చేయాలి

- సమీక్ష సమావేశంలో మేయర్ జక్క వెంకట్ రెడ్డి

నవతెలంగాణ-బోడుప్పల్

పీర్జాదిగూడ మున్సిపల్ కార్యాలయంలో వరంగల్ జాతీయ రహదారిపై నిర్మిస్తున్న ఎలివేటెడ్ కారిడార్ నిర్మాణ పనులపై మేయర్ జక్కవెంకట్ రెడ్డి, కమీషనర్ డా. పి రామకృష్ణ రావు, ప్రాజెక్ట్ మేనేజర్ అశోక్ గోవింద్ భంగార్, నిర్మాణ సంస్థ ప్రతినిధులతో కలిసి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వరంగల్ జాతీయ రహదారిపై నిర్మిస్తున్న ఎలివేటెడ్ కారిడార్ పనుల్లో జరుగుతున్న పురోగతిపై చర్చించారు. ఈ ప్రాజెక్టులో భూ సేకరణ, టీడీఆర్ ద్వారా నష్ట పరిహారం ప్రక్రియను త్వరగా పూర్తిచేయాలని అధికారులకు సూచించారు. ఉప్పల్ నల్ల చెరువు నుంచి నారపల్లి వరకు రోడ్డపై ఏర్పడిన గుంతలను వెంటనే పూడ్చాలని, ఈ గుంతల కారణంగా రోడ్డు ప్రమాదాలు నిత్యాకృత్యమవుతున్నాయని తెలిపారు. వరదనీరు వెళ్లేందుకు నిర్మించాల్సిన కల్వర్టు వెంటనే వేయాలని సూచించారు. పిల్లర్ నెంబర్ 117 దగ్గర, తులిప్స్ వద్ద, బంగారు మైసమ్మ గుడి వద్ద, బుద్ధ నగర్ నుండి వచ్చే వరద నీటిని మళ్లించేందుకు కల్వర్టులు నిర్మించాలని మేయర్ సూచించారు.ఈ కార్యక్రమంలో టీం లీడర్ ఆనంద్ రెడ్డి, అడ్మిన్ ఇంచార్జ్ వాసు తదితరులు పాల్గొన్నారు.

విద్యతోనే సమాజంలో మంచి గుర్తింపు

- డా.ఆర్.ఎస్.ప్రవీణ్ కుమార్
- బాలాపూర్‌లో భీమ్ మండపం సందర్శన



నవతెలంగాణ-బడంగ్‌పేట్

ప్రతీ ఒక్కరికి విద్యతోనే మంచి గుర్తింపు వస్తుందని బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షులు డా.ఆర్.ఎస్.ప్రవీణ్ కుమార్ అన్నారు. సోమవారం రాత్రి బాలాపూర్ గ్రామంలో బాలాపూర్ స్వేరో సర్కిల్ నాయకులు మైలరాం జగన్ ఆధ్వర్యంలో స్వేరో సర్కిల్ సభ్యులు, స్వేరో స్టూడెంట్స్ ఏర్పాటు చేసిన భీమ్ మండపం సందర్శించారు. అంతకుముందు ఆయనకు ఘనంగా స్వాగతం పలికారు. మహేశ్వరం అసెంబ్లీ అధ్యక్షుడు గుడ్ల శ్రీనివాస్ మహరాజ్, కమిటీ సభ్యులు బాలాపూర్ గ్రామానికి వచ్చిన ప్రవీణ్ కుమార్‌ను చూసి ఎంతో ఆనందం వ్యక్తం చేశారు. సర్కిల్ సభ్యులు ఎర్ర అశోక్, జిల్లా బాలరాజు, విక్రమ్, గణేష్ శివను సన్మానించారు. ప్రవీణ్ కుమార్ మాట్లాడుతూ మీరు ఒక్క పూట తినకున్న పర్వాలేదు కానీ మీ బిడ్డలను బాగా చదివించి భవిషత్‌లో ఉన్నత శిఖరాలకు చేరుకునే విధంగా చూడాలన్నారు.ఉన్నత స్థాయిలో చేరి లక్షల రూపాయలు సంపాదిస్తారని, తల్లిదండ్రులు పిల్లల ముందు తిట్టుకోవద్దు, కొట్టుకోవద్దు అని.. వారి ముందు మంచిగా ఉండాలని తల్లిదండ్రులను కోరారు. రానున్న కాలంలో ఇలాంటి భీమ్ మండపాలు, గ్రంథాలయాలను నెలకొల్పాలని కోరారు.

కంటి వెలుగును సద్వినియోగం చేసుకోవాలి

- కార్పొరేటర్ పసునూరి భిక్షపతి చారి



నవతెలంగాణ-మీర్‌పేట్

కంటి వెలుగు కార్యక్రమాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని మీర్‌పేట్ మున్సిపల్ కార్పోరేషన్ 27వ డివిజన్ కార్పొరేటర్ పసునూరి భిక్షపతి చారి అన్నారు. డివిజన్ పరిధిలోని సిర్లహిల్స్‌లో కంటి వెలుగు కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. చాలా మంది కంటి చూపు సమస్యతో బాధపడుతున్నారని, అలాంటి వారు ఈ కార్యక్రమాన్ని ఉపయోగించుకోవాలని కోరారు. ఉచితంగా కంటి పరీక్షలు, అద్దాలు, ఆపరేషన్లు చేస్తారని, మూడురోజుల పాటు ఇక్కడ పరీక్షలు నిర్వహిస్తారని చెప్పారు. అందరూ సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ పెండ్యాల నర్సింహా, ఫ్లోర్ లీడర్ కీసర గోవర్ధన్ రెడ్డి, కో ఆప్షన్ సభ్యులు పల్లె జంగయ్య, బింరాజు కాలనీవాసులు, సతీష్, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

వీధి జంతువుల దాహార్తిని తీర్చేందుకు నీళ్ల తొట్టెల పంపిణీ



నవతెలంగాణ- సరూర్ నగర్

వేసవి కాలంలో దాహార్తిని తీర్చుకునేందుకు నీళ్ల దొరక్క ఆగ్రహావేశాలకు లోనై మనుషులు మీద దాడులు చేస్తున్న కుక్కలు లాంటి వీధి జంతువుల దాహం తీర్చేందుకు జాగతి అభ్యుదయ సంఘం, శ్రీ షిర్డి సాయి అష్టాంగ యోగ శిక్షణా కేంద్రం సంయుక్త ఆధ్వర్యంలో మట్టితో చేసిన నీటి తొట్టెలతోపాటు పిచ్చుకల సంరక్షణా గూళ్లుఉచితంగా పంపిణీ చేశారు. లోటస్ ల్యాప్ స్కూల్ వేదికగా నిర్వహించిన కార్యక్రమానికి అతిథులుగా స్కూల్ డైరెక్టర్ చంద్రశేఖర్ రెడ్డి, ప్రముఖ యోగా గురువులు సిద్ధిరాజ్ తపోదనగిరి స్వామిజి, మంజు ఉమెన్ వెల్ఫేర్ సొసైటీ చైర్మెన్ మంజులా రెడ్డిలు హాజరైనారు. యోగ కేంద్రం గురువు ఇస్మాయిల్ మాట్లాడుతూ ప్రకతిని ని ప్రేమించండి, పోషించండి అంటూ శిక్షకులతో నినాదాలు చేయించారు. పర్యావరణ రక్షణలో భాగంగా పొల్యూషన్ కారకమైనటువంటి వాహనాలు వాడకూడదని, బ్యాటరీతో నడిచే వాహనాన్ని వాడాలని, శ్రీ ఇస్మాయిల్ గురూజీ ఆచరణాత్మకమైన జీవితం ఉండాలని భావనతో ఈ కార్యక్రమంలో ఎలక్ట్రికల్ బైక్ ను స్వామీజీ చేతుల మీదుగా తీసుకున్నారు. ప్రతీ ఒక్కరు వ్యక్తిగత బాధ్యతతో పర్యావరణాన్ని కాపాడుకోవడం దినచర్యలో భాగం చేసుకోవాలని, భావితరాలకు ఒక మంచి ఆహ్లాదానుభూతిని పంచే ఆకుపచ్చని సమాజాన్ని నిర్మించుకోవాలని వక్తలు అభిప్రాయపడ్డారు. కార్యక్రమంలో గోపాల్ దాస్ రాము, యాదా రామలింగేశ్వరరావు, ఓబులేష్ యాదవ్, కవితా గోపాల్ రెడ్డి, నంబూరు తాతయ్య, వెంకట్ నారాయణ, యోగ శిక్షకులు, ఎల్ ఎస్ ఎన్ రెడ్డి వేణు లు పాల్గొన్నారు.



ప్రజలు ఆరోగ్యం పట్ల శ్రద్ధ వహించాలి

- కార్పొరేటర్ బి.సుజాతా నాయక్

నవతెలంగాణ - హస్తినాపురం

హస్తినాపురం డివిజన్‌లోని ప్రజలు సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉంటూ పలు జాగ్రత్తలు తీసుకొని ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని కార్పొరేటర్ బానోత్ సుజాత నాయక్ సూచించారు. జీహెచ్ఎంసీ అధికారులతో కలిసి బుధవారం కృష్ణనగర్ కాలనీలో పర్యటించి.. పలు సమస్యలపై కాలనీ వాసులకు అవగాహన కల్పించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో కార్పొరేటర్ మాట్లాడుతూ.. ప్రజలు పరిసరాలను శుభ్రంగా వుంచుకోవాలని, వ్యర్థాలను రోడ్లపై వేయకుండా తగు చర్యలు తీసుకోవాలని చెప్పారు. డివిజన్‌లోని కాలనీల్లో నెలకొన్న సమస్యలను దశల వారీగా శాశ్వతంగా పరిష్కరిస్తామని, అందుకు తగిన విధంగా అధికారుల సూచనలు పాటిస్తూ కాలనీవాసులు సహకరించాలని కోరారు. జీహెచ్ఎంసీ ఏఈ హేము నాయక్, జలమండలి మేనేజర్ రవీందర్ రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, రేవతి, బిక్కు నాయక్, బీఆర్ఎస్ నాయకులు గోపిరెడ్డి, చంద్రశేఖర్ రెడ్డి, కాలనీ సంక్షేమ సంఘం సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

సీఎంఆర్ఎఫ్ పేదలకు వరం : మున్సిపల్ చైర్‌పర్సన్



నవతెలంగాణ- ఘట్కేసర్

సీఎం రిలీఫ్ ఫండ్ పేదలకు వరమని ఘట్కేసర్ మున్సిపల్ చైర్‌పర్సన్ ముల్లి పావని జంగయ్యయాదవ్ అన్నారు. ఘట్కేసర్ మున్సిపాలిటీలోని రాజమని ఆరోగ్య ఖర్చుల కోసం సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కును బుధవారం అందజేశారు. ఈ సందర్భంగా పావని మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి సహాయనిధులు పేదలకు వరం అన్నారు. లబ్దిదారున్ని శాలువతో సత్కరించి రూ.60,000/- చెక్కును అందజేశారు. ముఖ్యమంత్రి కేసీఆర్ ఆశిస్సులు, మంత్రి చామకూర మల్లారెడ్డి సహకారంతో ఘట్కేసర్ మున్సిపాల్టీ అభివృద్ధి జరుగుతోందన్నారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం పేద ప్రజలకు ఒక నమ్మకంగా నిలిచిందని, సీఎం కేసీఆర్ ప్రతి పేదవానికీ భరోసా కల్పిస్తున్నారని చెప్పారు. ఈ కార్యక్రమంలో 11వ వార్డు కౌన్సిలర్ కడుపొల్లా మల్లేష్, నాయకులు బర్ల రాధాకృష్ణ ముదిరాజ్, వెంకట్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

'రాజ్యాంగాన్ని రక్షించుకుందాం- మనువాదాన్ని మట్టుపెడదాం'



నవతెలంగాణ - హస్తినాపురం

ఏప్రిల్ 6 నుండి 14 వరకు సీఐటీయూ ఆధ్వర్యంలో సామాజిక న్యాయం వారోత్సవాలను నిర్వహిస్తున్న క్రమంలో బుధవారం హస్తినాపురం డివిజన్‌లోని నందనవనంలో సి.ఐ.టి.యు నాయకులు కరపత్రాన్ని విడుదల చేశారు. ఈ సందర్భంగా జీహెచ్ఎంసీ ఎంప్లాయిస్ యూనియన్ రంగారెడ్డి జిల్లా అధ్యక్షులు ఆలేటి ఎల్లయ్య, కార్యదర్శి పి. శ్రీనివాస్ మాట్లాడుతూ మహనీయుల జయంతుల నేపథ్యంలో కుల వివక్ష, దోపిడీలకు వ్యతిరేకంగా రాష్ట్ర వ్యాప్త క్యాంపెయన్ నిర్వహించినట్టు తెలిపారు. మనువాదాన్ని మట్టు పెడదాం అనే అంశం పై ఈనెల 14న అంబేద్కర్ జయంతి సందర్భంగా సి.ఐటి.యు ఆఫీస్ దిల్‌సుఖ్‌నగర్‌లో మున్సిపల్ మండల స్థాయి సదస్సు ను నిర్వహించబోతున్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో సి.ఐ.టి.యు కార్యకర్తలు యాదమ్మ, మైసమ్మ ,శాంతమ్మ, పద్మమ్మ ,పాపమ్మ ,సాయి ,రమేష్ ,అంజమ్మ, ఇంద్ర, శాంతమ్మ ఆదిలక్ష్మి, బుచ్చమ్మ తదితరులు పాల్గొన్నారు

'మంత్రి సహకారంతో అభివృద్ధి పనులు'



నవతెలంగాణ-బడంగ్‌పేట్

సీఎం కేసీఆర్ నాయకత్వంలో విద్యాశాఖ మంత్రి పి.సబితా ఇంద్రారెడ్డి సహకారంతో ఇప్పటికే కోట్లాది రూపాయల నిధులతో అనేక అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తున్నామని జల్‌పల్లి మున్సిపల్ కో ఆప్షన్ సభ్యులు సూరెడ్డి కృష్ణారెడ్డి, వైస్ చైర్మెన్ యూసుఫ్ పటేల్ అన్నారు. బుధవారం జల్‌పల్లిలో వారు విలేకరులతో మాట్లాడుతూ.. జల్‌పల్లి మున్సిపల్‌లో మంత్రి ఏ మాత్రం అభివృద్ధి కార్యక్ర మాలు అమలు చేయటం లేదని మహేశ్వరం నియోజ కవర్గం బీజేపీ ఇన్‌చార్జి అందెల శ్రీరాములు యాదర్ ఆరోపించడం అర్ధరహితమన్నారు. మంత్రి సహకారంతో ఇప్పటికే కోట్లాది రూపాయల నిధులతో అనేక అభివృద్ధి పనులు అమలు చేస్తున్నామని తెలిపారు. రాజకీయ కోసం ప్రభుత్వంపై చిల్లర ఆరోపణలు మానుకోవాలన్నారు. జల్ పల్లి గేటు నుంచి వేసిన బీటీ రోడ్డు కనిపించడం లేదా, కనిపించకుంటే కంటివెలుగు కార్యక్రమంలో చూపిం చుకోవాలని సూచించారు. ఆ వార్డు ఎవరిది, కౌన్సిలర్ ఎవరు, పని చేయాల్సింది ఎవరు, అది తెలియకుండా మాట్లాడుతున్నారని విమర్శించారు. కేంద్ర ప్రభుత్వం నుంచి జల్‌పల్లి మున్సిపాలిటీకి ఎన్ని నిధులు వచ్చాయో వివరంగా తెలియజేయాలని కోరారు. అభివృద్ధికి చిరునామా జల్ పల్లి మున్సిపాలిటీ అని, చిన్నచిన్న సమస్యలను భూతద్దంలో పెట్టి చూడటం బీజేపీ నాయకులకు అలవాటని విమర్శించారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు లక్ష్మినారాయణ, శంకర్, కొండల్ యాదవ్, పమీద అఫ్జాల్, మున్సిపల్ వర్కింగ్ ప్రెసిడెంట్ యాంజాల జనార్దన్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



ఇంటర్నేషనల్ వైశ్య ఫెడరేషన్ రాష్ట్ర యూత్ కార్యదర్శిగా రొంపల్లి సంతోష్ కుమార్

నవతెలంగాణ-నాగోల్

నాగోల్‌లోని ఉప్పల శ్రీనివాస్ గుప్త క్యాంప్ ఆఫీసులో జరిగిన సమావేశంలో రాష్ట్ర ఇంటర్నేషనల్ వైశ్య ఫెడరేషన్ యూత్ వింగ్ ప్రధాన కార్యదర్శిగా తాండూర్‌కు చెందిన రొంపల్లి సంతోష్ కుమార్, యూత్ ఉపాధ్యక్షులుగా కొల్పూరి సంతోష్ కుమార్‌లను నియమించారు. ఈ మేరకు నియామక పత్రాన్ని ఫెడరేషన్ జాతీయ సెక్రెటరీ, ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు ఉప్పల శ్రీనివాస్ గుప్త చేతుల మీదుగా అందజేశారు. ఈ కార్యక్రమంలో ఐవీఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పబ్బ చంద్ర శేకర్, యూత్ ప్రెసిడెంట్ కట్ట రవి కుమార్ గుప్త, రాష్ట్ర కార్యదర్శి జూలకంటి అశోక్, ఇతర నాయకులు పాల్గొన్నారు.

జల్‌పల్లి మున్సిపాల్టీ ప్రజా సమస్యలను పరిష్కారించాలి



నవతెలంగాణ-బడంగ్‌పేట్

రాష్ట్ర ప్రభుత్వం జల్‌పల్లి మున్సిపల్‌లో నెలకొన్న ప్రజా సమస్యలను పరిష్కారం చేయటంలో పూర్తిగా విఫలమైనట్టు బీజేపీ మహేశ్వరం నియోజకవర్గం ఇన్‌చార్జి అందెల శ్రీరాములు యాదవ్ అన్నారు. మంగళవారం జల్‌పల్లి మున్సిపాల్టీలో ప్రజా సమస్యలను పరిష్కారించాలని కోరుతూ మున్సిపల్ కమిషనర్ వసంతకు స్థానిక కౌన్సిలర్ బూడుమాల యాదగిరి, ప్రశాంతి శ్రీధర్ గౌడ్‌తో కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మున్సిపల్‌లో ప్రజలు వివిధ కాలనీలో డ్రయినేజీ, సరైన రోడ్లులేక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, అక్రమ నిర్మాణాలపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. వారం రోజుల్లోగా డ్రయినేజీ, రోడ్ల సమస్యలను పరిష్కారం చేయాలని డిమాండ్ చేశారు. మున్సిపాల్టీకి కేంద్రం నిధులు ఇస్తున్నా... ప్రధాని మోడీ ఫోటో ఎందుకు పెట్టలేదని అభ్యంతరం వ్యక్తం చేశారు. జల్ పల్లి మున్సిపాల్టీలో అధికార పార్టీ, ఎంఐఎం పార్టీల రాజ్యాంగం నడుస్తుందని ఆరోపించారు. మాజీ అధ్యక్షుడు శాంత కుమార్, గొరిగె మల్లేశ్, బీజేవైఎం అధ్యక్షుడు దిలీప్ గౌడ్, శ్రీకాంత్ గౌడ్, మురళి, హరికష్ణ, నర్సింగ్ రావు, శ్రీకాంత్, ఖాజాపాష, రాము, వెంకటేశ్, నర్సింహా, రామారావు, శాంతమ్మ, సీనియర్ నాయకులు మర్రి అంజిరెడ్డి, నిమ్మల రవికాంత్ గౌడ్, మంత్రి మహేష్ ముదిరాజ్, రాళ్లగూడెం రామకష్టారెడ్డి, బీజేపీ, బీజేవైఎం నాయకులు తదితరులు పాల్గొన్నారు.

అంబేద్కర్ జయంతి వేడుకలను అధికారికంగా నిర్వహించాలి



నవతెలంగాణ-బడంగ్‌పేట్

డా.బి.ఆర్.అంబేద్కర్ జయంతి వేడుకలను ప్రభుత్వం అధికారికంగా నిర్వహించాలని బడంగ పేట్ దళిత సంఘం అధ్యక్షులు గుడ్ల శ్రీనివాస్ అన్నారు. ఈ మేరకు బడంగ్ పేట్ మున్సిపల్ కార్పోరేషన్ మేనేజర్‌కు ఆయన వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అంబేద్కర్ అందరి వాడన్నారు. ఈ కార్యక్రమంలో బడంగ్ పేట్ దళిత సంఘం అధ్యక్షుడు శ్రీనివాస్ మహరాజ్, ప్రధాన కార్యదర్శి గట్టుగుడ్ల మహిపాల్, ఆర్గనేసర్ సెక్రటరీ గట్టు బాల కష్ణ, బీసీ నాయకులు రనిజి తదితరులు పాల్గొన్నారు.



సీసీ రోడ్డు పనులు నాణ్యతతో చేపట్టాలని కౌన్సిలర్, టీపీసీసీ సభ్యులు కాకుమాను సునిల్ కాంట్రాక్టర్లకు సూచించారు. బుధవారం మున్సిపాలిటీ పరిధిలోని 18 వ వార్డులోని పాత ఊరి నుంచి చర్చికి వెళ్లే దారిలో సి.సి రోడ్డు పనులకు వారు శంకుస్థాపన చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మున్సిపల్ చైర్ పర్సన్ సహకారంతో వార్డు లో సమస్యలను దశల వారిగా పరిష్కరిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో చర్చ్ కమిటీ సభ్యులు బి. స్టేని .కె. ఆరోగ్యం , ఏ. రాజు కె. డొమినిక్ ,కె మార్తయ్య పి. జోజి , మరియు బి.అల్ఫోన్సమ్మ ,వరాలు .ఏ రాణి తదితరులు పాల్గొన్నారు.

నవతెలంగాణ-తుర్కయాంజల్

ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాల్లో పాల్గొన్న అమరేందర్ రెడ్డి



నవతెలంగాణ-బడంగ్‌పేట్

బడంగ్ పేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని బాలాపూర్ గ్రామంలో శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయంలో 14వ వార్షిక బ్రహ్మోత్సవ కార్యక్రమంలో టీపీసీసీ కార్యదర్శి ఎల్మేటి అమరేందర్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన వెంకటేశ్వర స్వామిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం బాలాపూర్‌లోని అంబేద్కర్ విగ్రహం వద్ద జ్యోతిరావు పూలే విగ్రహానికి పూల మాలలు వేసి ఘనంగా నివాళ్లర్పించారు. ఈ కార్యక్రమంలో జల్‌పల్లి మున్సిపాల్టీ మైనార్టీ నాయకుడు అహ్మద్ బామ్, వంగేటి మధుసూదన్ రెడ్డి, ఆంజనేయులు రామస్వామి, మీసాల కిరణ్ కుమార్, ప్రేమ్ కుమార్, నున్నా నాయక్,శ్రీకాంత్, గోవర్ధన్, తదితరులు పాల్గొన్నారు .

అనుమానస్పదంగా గుర్తుతెలియని వ్యక్తి మృతి



నవతెలంగాణ-నాచారం

గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందిన సంఘటన నాచారం పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. నాచారం ఇన్ స్పెక్టర్ నందీశ్వర్ రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం మతిస్థిమితం కోల్పోయి తిరుగుతున్న ఓ వ్యక్తి(45) హెచ్ఎంటి నగర్ రోడ్డు నెంబర్ 11 వద్ద గాయాలపాలై 11వ తేదీన అనుమానస్పదంగా పడిపోయినట్టుగా సమాచారం రావడంతో పోలీసులు వెంటనే ఘటన స్థలానికి వెళ్లి పరిశీలించగా తల, కాళ్లు, చేతులకు గాయాలపాలై ఊపిరితో కొట్టుమిట్టాడుతున్నాడు. దాంతో చికిత్స నిమిత్తం గాంధీ ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్న క్రమంలో బుధవారం ఉదయం పరిస్థితి విషమించి మృతి చెందినట్టుగా గాంధీ ఆస్పత్రి వైద్యులు తెలిపారు. దీంతో మృతుడు వివరాలు తెలియకపోవడంతో ఈ మేరకు గుర్తుతెలియని వ్యక్తిగా కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్టు పోలీసులు వెల్లడించారు. గుర్తుపట్టిన వారు ఎవరన్నా ఉంటే వెంటనే నాచారం పోలీసులను సంప్రదించాలని కోరారు.

రంజాన్ తోఫా పంపిణీ



నవతెలంగాణ-కాప్రా

మజీద్ ఈ అజిజియ మసీదులో (రైల్వే స్టేషన్ సమీపంలో) , మజీద్ ఈ మహమ్మదీయ పెద్ద చర్లపల్లి మసీదులలో రంజాన్ తోఫా పంపిణీ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా మాజీ మేయర్ బొంతు రామ్మోహన్, చర్లపల్లి డివిజన్ బొంతు శ్రీదేవి యాదవ్ పాల్గొని ముస్లిం సోదర సోదరీమణులకు బట్టలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మైనార్టీ అధ్యక్షులు ఎండీ రియాజ్, ఎండీ ఆజాద్, సయ్యద్ సులేమాన్, అబ్దుల్ అహ్మద్, ఎండీ ఇమ్రాన్, ఎండీ నమి, ఎస్.డీ రెహమాన్, ఎండీ ఇస్మాయిల్ పాషా, ఎండీ అన్వర్, అబ్దుల్ రెహమాన్, , బీఆర్ఎస్ నాయకులు ఇన్‌చార్జి నాగిళ్ల బాల్ రెడ్డి, శ్రీకాంత్ యాదవ్, బొడిగె ప్రభు గౌడ్, ధనంజయ్ గౌడ్, కొమ్ము సురేష్ ,కొమ్ము రమేష్, భానుచందర్, ముత్యాలు, మురళి గౌడు ,గోపి, గణేష్ గౌడ్, రాజ్ కుమార్, నజీర్, అలీ, నహీం ,తన్వీర్ తదితరులు పాల్గొన్నారు.

అగ్గిపడితే బుగ్గి పాలే..!

- మల్లాపూర్ పారిశ్రామికవాడలోని జీపీ పెయింట్స్ కంపెనీలో భారీ అగ్ని ప్రమాదం
- భయాందోళనలతో పరుగులు తీసిన కార్మికులు
- భయం గుప్పెట్లో బాబా నగర్ వాసులు
- భద్రత ప్రమాణాలే లోపమే ప్రమాదానికి కారణం!





నవతెలంగాణ-నాచారం

అగ్గిపడితే కంపెనీ బుగ్గిపాలైనట్లే.. మల్లాపూర్ పారిశ్రామిక వాడలోని జీపి ఇండస్ట్రీస్ ఎనమిళ పెయింట్స్ కంపెనీలో బుధవారం సాయంత్రం పని చేస్తున్న క్రమంలో ఒక్కసారిగా మంటలు అలుముకున్నాయి. పనిచేస్తున్న కార్మికులు భయాందోళనలతో ప్రాణాలు గుప్పెట్లో పెట్టుకుని బయటపడ్డారు. ఈ ఘటనలో ప్రాణ నష్టం ఏమీ జరగలేదు. కానీ ఆస్తి నష్టం భారీగా సంభవించినట్లు సమాచారం. గతంలో జీపీ ఇండస్ట్రీస్ ఎనమిళ పెయింట్ కంపెనీలో అగ్ని ప్రమాదం జరిగినప్పుడు యూనిట్ మొత్తం బాయిలర్లు పూర్తిగా ఖాళీ బూడిద మిగిలింది. అయినా కంపెనీ యజమాని సంతోష్ కుమార్ భద్రత ప్రమాణాలు పాటించకపోవడమే మళ్లీ అగ్ని ప్రమాదానికి కారణమని సంఘటన జరిగిన తీరును బట్టి ఫైర్ అధికారులు, పోలీస్ అధికారులు అంచనా వేస్తున్నారు. అసలే మండుటెండలు ఆపై పెయింట్ కంపెనీ కావడంతో యాజమాన్యం భద్రతా ప్రమాణాలను సమకూర్చకపోవడం ఒక కారణమైతే కంపెనీలు పనిచేస్తున్న కార్మికుల నిర్లక్ష్యం తోడైతే నిలువునా అగ్నికి ఆహుతి అయ్యింది. కోట్ల రూపాయల ఆస్తి కాలి బూడిద అయినా నిర్లక్ష్యం వీడక నిరాశ్రయలవుతున్నారు. ఎండాకాలం వస్తే ఏ వైపు నుంచి మంటలు ఎగిసిపడతాయని అటు కార్మికులు ఇటు సమీప నివాస ప్రజలు భయాందోళనతో బతుకుతున్నారు.

ఎగిసిపడుతున్న అగ్ని కీలలు.....

దట్టమైన పొగలు, ఎగిసిపడుతున్న అగ్ని కిలాలతో సమీపంలో నివాసముంటున్న బాబా నగర్ ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా అప్రమత్తమైన రక్షణ అధికారులు ఇండ్లను ఖాళీ చేయించి ప్రజలను సురక్షిత ప్రాంతానికి తరలించారు. పెయింట్ లిక్విడ్ కావడంతో మంటలు అదుపు చేయడం కష్టతరంగా మారుతుందని ఫైర్ సిబ్బంది పేర్కొన్నారు. గతంలో అగ్ని ప్రమాదం జరిగినప్పుడు సుమారు మూడు రోజులపాటు శ్రమించిన మంటలు పూర్తిగా అదుపు చేయడం కష్టమైందని ఫైర్ అధికారులు వెల్లడించారు. మంట అధికమవుతున్న కొద్ది పొగతో పాటు అగ్ని కిలలు సుడులు తిరుగుతూ ఎగిసిపడ్డాయి. ఆరు ఫైర్ ఇంజన్లు, ఫోమ్ అధునాతన యంత్రం ఫైర్ సిబ్బంది మంటలను అదుపు చేసే ప్రయత్నంలో నిమగ్నమయ్యారు. అయినా ఎగిసిపడుతున్న అగ్ని కీలలు అదుపు అదుపు చేయడంలో ప్రాణాలను తెగించి శ్రమించారు. ఫైర్ సిబ్బంది. ఫైర్ ఇంజన్లకు వాటర్ అందించడం కోసం జలమండలి ఎండి దాన కిషోర్ తో మాట్లాడి అవసర మైనంత నీటిని అందించే విధంగా చర్యలు తీసుకుంటున్నట్లు వెల్లడించారు.

ఇన్సూరెన్స్ కోసం చేసి ఉండొచ్చని అనుమానం..!

ఏడేండ్ల క్రితం అగ్ని ప్రమాదం జరిగినప్పుడు కంపెనీలోని యంత్రాలు, ముడి సరుకు ఉత్పత్తి నిలువలు పూర్తిగా ఖాళీ బూడిద కావడంతో కోట్లలో నష్టం వాటిల్లిందని కంపెనీ యాజమాన్యం ఇన్సూరెన్స్ కంపెనీలను ఆశ్రయించి క్లైమ్ చేసుకుంది. ప్రస్తుత పరిస్థితుల్లో మార్కెట్లో పెయింట్ కంపెనీల ఉత్పత్తులు క్రమక్రమంగా దిగజారుతున్న క్రమంలో జీపీ ఇండస్ట్రీస్ యాజమాన్యం వేసవి కాలాన్ని అదునుగా భావించి ఇన్సూరెన్స్ కోసం ఇటువంటి ఘటనకు పాల్పడి ఉండవచ్చని అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

సంఘటన స్థలాన్ని సందర్శించిన సీపీ డీఎస్ చౌహాన్.

సంఘటన సమాచారం అందుకున్న మల్కాజిగిరి డీసీపీ జానకి రమావత్ పర్యవేక్షణలో పోలీస్ సిబ్బంది భద్రతను కల్పిస్తూ ప్రజలను పరిసర ప్రాంతాలకు రానీయకుండా గట్టుదిట్టమైన చర్యలు చేపట్టారు. రాచకొండ కమిషనర్ డీఎస్ చౌహన్ సంఘటన స్థలాన్ని పరిశీలించి అగ్ని ప్రమాదానికి గల కారణాలను క్షుణ్ణంగా పరిశీలించారు. సమీప పరిశ్రమలకు ఎటువంటి ప్రమాదం జరగకుండా చర్యలు తీసుకోవడంతో పాటు చుట్టుపక్కల కాలనీ ప్రజలకు ఎటువంటి ప్రమాదం జరగకుండా ముందస్తుగా అప్రమతమై సురక్షిత ప్రాంతాలకు తరలించారు.



రోడ్లపై చెత్త వేసే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలి

- మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్
- మోండా మార్కెట్ డివిజన్‌లో మంత్రి పర్యటన



నవతెలంగాణ-బేగంపేట్

రోడ్లపై చెత్త వేసేవారి పట్ల కఠినంగా వ్యవహరించాలని మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ అధికారులను ఆదేశించారు. బుధవారం మోండా మార్కెట్ డివిజన్‌లో గల బండి మెట్, మారుతి వీధి, సజన్ లాల్ వీధులలో వివిధ శాఖల అధికారులతో కలిసి మంత్రి పాదయాత్రగా తిరుగుతూ ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. స్థానిక ప్రజలు పలు సమస్యలను మంత్రి దృష్టికి తీసుకు రాగా వాటి పరిష్కారానికి తగు చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులకు అక్కడికక్కడే ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలోని ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరిం చేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ప్రధానంగా రోడ్లు, సీవరేజ్ సమస్యలపైనే మంత్రికి విన్నవించారు. స్పందించిన మంత్రి మాట్లాడుతూ సీవరేజ్, వాటర్ లైన్ ఏర్పాటు చేసిన అనంతరం రోడ్ల నిర్మాణం చేపడతామని హామీ ఇచ్చారు. ప్రజల సమస్యలను తెలుసుకొనేందుకే తాను ఇక్కడకు వచ్చానని వివరించారు. అన్ని వీధులలో సీవరేజ్, వాటర్ లైన్, రోడ్ల నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. స్థానికంగా ఉన్న పలువురు షాప్స్ నిర్వాహకులు చెత్త, ఇతర వ్యర్థాలను రోడ్లపైనే వేస్తున్నారని, పరిసం ాలు అపరిశుభ్రంగా మారుతున్నాయని మంత్రి దష్టికి స్థానికులు తీసుకురాగా, రోడ్లపై చెత్త వేసే వారికి జరిమానా విధించడంతో పాటు వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని శానిటేషన్ అధికారులను ఆదేశించారు. రోడ్లపై వాహనాలను నిలిపి రాకపోకలకు ఇబ్బందులు కల్పిస్తున్నారని మంత్రికి పిర్యాదు చేయగా, స్పెషల్ డ్రైవ్ చేపట్టి వాహనాలను తొలగించడంతో పాటు రోడ్లపై తిరిగి వాహ నాలు నిలపకుండా చర్యలు తీసుకోవాలని ట్రాఫిక్ పోలీసు లను ఆదేశించారు. పలు చోట్ల విద్యుత్ తీగలు కిందకు వేలాడుతూ ప్రమాదకరంగా ఉండటంతో వెంటనే వాటిని తొలగించేందుకు చర్యలు తీసుకోవాలని ఎలెక్ట్రికల్ అధికారులను ఆదేశించారు. సజన్ లాల్ స్ట్రీట్ లో పర్యటన సందర్భంగా సీవరేజ్ సమస్య తీవ్రంగా ఉందని, స్థానికంగా ఉన్న నాలా పూడిపోయి వర్షాకాలంలో నీరు నిలిచి ఇబ్బందులు పడుతున్నామని, నాలా పై అక్రమ నిర్మాణం చేపట్టారని తెలపగా వెంటనే నాలాను పూర్తిస్థాయిలో శుభ్రం చేయాలని అధికారులను ఆదేశించారు. అదేవిధంగా నాలాపై చేపట్టిన అక్రమ నిర్మాణాన్ని వెంటనే తొలగించాలని జీహెచ్ఎంసీ, టౌన్ ప్లానింగ్ అధికారులను ఆదేశించారు. మంత్రి వెంట డీసీ ముకుంద రెడ్డి, ఈఈ సుదర్శన్, వాటర్ వర్క్స్ జీఎం రమణారెడ్డి, సికింద్రాబాద్ తహసిల్దార్ శైలజ, మహంకాళి ఏసీపీ రమేష్, మోండా మార్కెట్ సీఐ నాగేశ్వరరావు, హార్టికల్చర్ డీడీ గణేష్, ఎలెక్ట్రికల్ ఏడీ కష్ణ, స్ట్రీట్ లైట్ ఏఈ భరత్, నాయకులు తలసాని స్కైలాబ్ యాదవ్, నాగులు, సత్యనారాయణ, జయరాజ్, అమర్, బాబులాల్, రాము తదితరులు ఉన్నారు.

ఓటరు జాబితాను పొరపాట్లు లేకుండా రూపొందించాలి

- మేడ్చల్ జిల్లా అదనపు కలెక్టర్ నర్సింహారెడ్డి



నవతెలంగాణ-మేడ్చల్ కలెక్టరేట్

పొరపాట్లు లేకుండా పకడ్బందీగా ఓటరు జాబితా రూపొందించి, ఓటరు జాబితాలో తొలగించిన ఓటర్ల వివరాలను మరోసారి ధ్రువీకరించాలని మేడ్చల్ జిల్లా అదనపు కలెక్టర్ నర్సింహారెడ్డి అన్నారు. బుధవారం హైదరాబాద్ నుంచి ప్రధాన ఎన్నికల అధికారి వికాస్ రాజ్ సంయుక్త ప్రధాన ఎన్నికల అధికారి టి. రవికిరణ్‌తో కలిసి మేడ్చల్ అదనపు కలెక్టర్ నర్సింహారెడ్డి, జిల్లా రెవెన్యూ అధికారి లింగ్యానాయక్, కీసర ఆర్డీవో రవితో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. సమావేశంలో అదనపు కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వ ఆదేశాల మేరకు క్షేత్రస్థాయిలో పరిశీలించి ఈ కార్యక్రమాన్ని పకడ్బందీగా నిర్వహిస్తున్నామని తెలిపారు. జాబితాలో ఒకే ఓటర్ ఫోటోలు, వివరాలు రెండుమార్లు ప్రచురించిన వాటిని పరిశీలించి తొలిగిస్తున్నామన్నారు. ఎన్నికల కమిషన్ మార్గదర్శకాల మేరకు డాక్యుమెంట్లు అన్ని ఉన్నాయో లేదో పరిశీలించి, ఏమాత్రం లోపాలకు తావులేకండా అప్‌డేట్ చేస్తామని తెలిపారు. జిల్లా వ్యాప్తంగా ఓటర్ల తుది జాబితాను కూడా త్వరితగతిన పూర్తి చేసేందుకు, పకడ్బందీగా ఉండేలా అధికారులు, సిబ్బందితో పనులు జరుగుతున్నాయన్నారు. ఏమాత్రం లోపాలకు తావులేకుండా చర్యలు చేపడుతున్నామని అదనపు కలెక్టర్ వివరించారు.

ప్రజల సంక్షేమం రాష్ట్ర ప్రభుత్వ ధ్యేయం

- ఎమ్మెల్యే హన్మంతరావు
- గాంధీ పార్క్‌లో గాంధీ విగ్రహావిష్కరణ



నవతెలంగాణ-మల్కాజిగిరి

ప్రజల సంక్షేమం రాష్ట్ర ప్రభుత్వ ధ్యేయమని, అన్ని వర్గాల ప్రజలకు న్యాయం చేస్తామని ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావు అన్నారు. బుధవారం చౌరస్తాలోని గాంధీ పార్క్‌లో గాంధీ నూతన విగ్రహాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు ప్రేమ్ కుమార్, సునీత రాము యాదవ్, మీనా ఉపేందర్ రెడ్డి, మాజీ కార్పొరేటర్ జగదీష్ గౌడ్, నాయకులు మల్కాజ్ గిరి సర్కిల్ అధ్యక్షుడు పిట్ల శ్రీనివాస్, అధికార ప్రతినిధి, జీఎన్‌వీ సతిష్ కుమార్, మీడియా కన్వీనర్ గుండా నిరంజన్, రాముయాదవ్,ఉపేందర్ రెడ్డీ, డివిజన్ అధ్యక్షులు నర్సింగ్ రావు, సత్యమూర్తి, పీవీ సత్యనారాయణ, సూరి, సత్తయ్య, సంతోష్ రాందాస్, మోహన్ రెడ్డీ, ఉపేందర్, బాలకష్ణ గుప్త, బాబు, సత్యనారాయణ, సంపత్ రావు, అనిల్ బైరు, పిట్ల నాగరాజు, సయ్యద్ మబ్బు, బాలకృష్ణ గుప్త, మోహన్ రాజ్, గణేష్ ముదిరాజ్, గంగాధరి కృష్ణ, శ్రీనివాస్, రాంచందర్, కిట్టు, నర్సింగ్, రాజు, ప్రవీణ్, భాగ్యవతి, జయశ్రీ, వైశాలి, కవిత, తదితరులు పాల్గొన్నారు

139 ఈస్ట్ ఆనంద్ భాగ్ డివిజన్ పరిధిలోని వసంత పూరి కాలనీలో రూ. 50 లక్షలతో సీసీ రోడ్డు పనులను ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావు కార్పొరేటర్ ప్రేమ్ కుమార్‌తో కలిసి ప్రారంభించారు. ఈఈ లక్ష్మణ్, డీఈ లౌక్య, ఏఈ శ్రీకాంత్, కార్పొరేటర్ సునీత రామూయాదవ్, మాజీ కార్పొరేటర్ జగదీష్ గౌడ్ డివిజన్ అధ్యక్షుడు, సత్యమూర్తి, జీఎన్‌వీ సతీష్ కుమార్, రామూ యాదవ్,పిట్ల శ్రీనివాస్, రామూయాదవ్, గుండా నిరంజన్, బాబు, సత్య నారాయణ,నరేష్ కుమార్, నవీన్ యాదవ్, సంపత్ రావు, సంతోష్ రాందాస్,మోహన్ రెడ్డి,బ్రమ్మయ్య,మహిళ అధ్యక్షురాలు పల్లె విజయ కుమారి,వైశాలి,కవిత, ఉమా తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారం కోసం అధికారులతో సమీక్ష



నవతెలంగాణ-కంటోన్మెంట్

ఓల్డ్ బోయిన్‌పల్లి 119 డివిజన్ గంగపుత్ర సంఘం, ఫ్రెండ్స్ కాలనీ సమస్యల పరిష్కారం కోసం బుధవారం డివిజన్ కార్పొరేటర్ ముద్దం నరసింహ యాదవ్ అధికారులతో సమీక్ష నిర్వహించారు. గంగపుత్ర కాలనీలోని రోడ్లు, డ్రయినేజీ, వాటర్ వర్క్స్ ఎలక్ట్రిసిటీ సమస్యలపై ప్రజల నుంచి తెలుసుకొని అధికారులకు వెంటనే ఆదేశాలు ఇచ్చారు. డ్రయినేజీ సమస్యను అతి త్వరలో పరిష్కరిస్తామని అధికారులు చెప్పారు ఈ కార్యక్రమంలో జీహెచ్ఎంసీ డిప్యూటీ కమిషనర్ రవీందర్ కుమార్, ఏఎంఓహెచ్ అధికారి మమతా, వివో లింగస్వామి, డీఈ బాలకృష్ణ, ఏఈ అరవింద్, వర్క్ ఇన్‌స్పెక్టర్ శ్రీకాంత్ స్వామి వాటర్ వర్క్స్ యజీడీ ఏఈ తేజ ప్రకాష్, ఎలక్ట్రిసిటీ ఏఈ అఖిల్, ఎస్సై యుగంధర్, మార్కెట్ మాజీ వైస్ చైర్మెన్ మన్నే ఉదయ్ యాదవ్, చందు, మల్లేష్ యాదవ్, ఉదయ్, పెంటయ్య, గంగపుత్ర కాలనీ ప్రెసిడెంట్ భిక్షపతి, మహిళా ప్రెసిడెంట్ లలిత జనరల్ సెక్రెటరీ హరినాథ్, 119 డివిజన్ ఎస్సీ సెల్ అధ్యక్షుడు బుర్రి యాదగిరి, సీనియర్ నాయకులు పాల్గొన్నారు. సమీక్ష సమావేశానికి ముందుగా కార్పొరేటర్ అధికారులతో కలిసి బస్తీలలో పర్యటించారు.

అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులకు వేతనాలు పెంచాలి

- కార్పొరేటర్ రాజ్యలక్ష్మి



నవతెలంగాణ-నేరేడ్‌మెట్

వాటర్ బోర్డు లైన్ మెన్, సివరేజ్ వర్కర్స్‌కు వెంటనే వేతనాలు పెంచాలని కార్పొరేటర్ రాజ్యలక్ష్మి విజ్ఞప్తి చేశారు. వాటర్ బోర్డులో దాదాపు 4500 మంది అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులుగా పని చేస్తున్నారని, వీరంతా అతి తక్కువ వేతనంతో పని చేస్తున్నారని కార్పొరేటర్ తెలిపారు. వీరికి జీవో 14 అమలు చేయాలని ఆమె ప్రభుత్వాన్ని కోరారు. వీరంతా కలిసి బుధవారం విచ్చేసి కార్పొరేటర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ మేరకు కార్పొరేటర్ స్పందిస్తూ వీరందరికీ వేతనాలు పెంచాలని, 20వ తేదీ లోపు వారి సమస్యలను తీర్చని యెడల నిరవధిక సమ్మె చేపడతారని తెలిపారు. వారికి తమ మద్దతు ఉంటుందన్నారు. వీరంతా సమ్మెలో వెళ్లినట్టు అయితే ప్రజలు చాలా ఇబ్బంది పడే ఆస్కారం ఉందన్నారు. ఇది ఎండాకాలం అవ్వడంతో, నీళ్ల రాని యెడల, సివరేజ్ పనులు ఆగిపోవడం వల్ల, ప్రజలు ఎంతో ఇబ్బంది పడతారని చెప్పారు. అధికారులు సహదయముతో స్పందించి, వేతనాలను పెంచాలని కోరారు. కార్పొరేటర్‌ను కలిసిన వారిలో కుమారస్వామి, రమా, సురేష్, మురళి, సోమయ్య, హరీష్, ప్రవీణ్, నరసింహ, శివ, నాగార్జున తదితరులు ఉన్నారు.

మధురానగర్‌లో బస్తీ దవఖానాను ప్రారంభించిన ఎమ్మెల్యే



నవతెలంగాణ- నేరేడ్‌మెట్

వైద్య రంగానికి రాష్ట్ర ప్రభుత్వం పెద్దపీట వేస్తుందని మల్కాజిగిరి ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావు అన్నారు. బుధవారం నేరేడ్‌మెట్ డివిజన్ పరిధిలోని మధురానగర్ లో నూతనంగా ఏర్పాటు చేసిన బస్తీ దవాఖానాను నేరేడ్‌మెట్ కార్పొరేటర్ కొత్తపల్లి మీనా ఉపేందర్‌రెడ్డితో కలిసి ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వ ఆస్పత్రులలో కార్పొరేట్ స్థాయి వైద్యం అందించాలన్న సంకల్పంతో ప్రభుత్వం పెద్ద ఎత్తున నిధులు వెచ్చించి బస్తీ దవాఖాన ఏర్పాటు చేస్తున్నట్టు తెలిపారు. పేద మధ్య తరగతి ప్రజల కోసం నాణ్యమైన వైద్య సేవలను అందించడం కోసం ప్రభుత్వం ప్రత్యేకంగా బస్తీ దవాఖానాను మంజూరు చేసినట్టు చెప్పారు. ముఖ్యమంత్రి కేసీఆర్ నాయకత్వంలో వైద్య ఆరోగ్యశాఖ మాత్యులు హరీష్ రావు నేతత్వంలో బస్తీ దవాఖానాలు ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. ఈ దవాఖానాలో అర్హత కలిగిన ఎంబీబీఎస్ డాక్టర్ అందుబాటులో ఉంటారని తెలిపారు. ప్రజలందరూ ఆరోగ్య సేవలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ పుట్ల శ్రీనివాస్, జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా డాక్టర్ ఎల్ కపూర్, వైద్యాధికారిణి పీహెచ్‌సీ మల్కాజిగిరి, మున్సిపల్ డిప్యూటీ కమిషనర్ రాజు, బస్తీ దవాఖాన వైద్యాధికారి డా.వెంకటేష్, ఎన్ఎస్ఎన్ రెడ్డి, హెచ్ఈఓ సిబ్బంది , ఆశ వర్కర్స్ బీఆర్ఎస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

హైదరాబాద్ లో జెఎస్ డబ్ల్యూ వన్ హెూమ్స్ తొలి స్టూడియో ప్రారంభం

నవతెలంగాణ-హైదరాబాద్

జెఎస్ డబ్ల్యు వన్ ప్లాట్‌ఫార్మ్స్ టెక్ -ఎనేబుల్డ్ హెూమ్ కన్స్ట్రక్షన్ సొల్యూషన్స్ విభాగమైన జెఎస్ఓబ్ల్యూ వన్ హెూమ్స్ తన మొదటి స్టూడియోను హైదరాబాద్లో ప్రారంభించింది. తెలంగాణ మార్కెట్లోకి జెఎస్ డబ్ల్యు వన్ హెూమ్స్ ప్రవేశంలో ఇది ఒక భాగం. తెలంగాణలో జెఎస్ డబ్ల్యు వన్ హెూమ్స్ కోసం పెరుగుతున్న వ్యాపార అవకాశాల గురించి జెఎస్ డబ్ల్యు వన్ ప్లాట్ఫారమ్ల సీఈఓ గౌరవ్ సచేవా మాట్లాడుతూ... తెలంగాణ జెఎస్ డబ్ల్యు వన్ హెూమ్స్కు ఒక ముఖ్యమైన మార్కెట్ అన్నారు. ఇది మెట్రోపాలిటన్ నగరం చుట్టుపక్కల, సమీపంలోని స్వతంత్ర గృహాల కోసం ఉత్పత్తి చేసే బలమైన డిమాండ్‌ను పరిగణనలోకి తీసుకుంటుందన్నారు.

జెఎస్ఓడబ్ల్యు వన్ హెూమ్స్ స్టూడియో ప్రారంభం తెలంగాణ మార్కెట్లోకి విజయవంతంగా ప్రవేశిస్తున్న ప్పుడు దక్షిణ భారతదేశంలో తమరిటైల్ ఉనికిని బలోపేతం చేస్తుందన్నారు. ఈ మార్కెట్లో ప్రతి సంవత్సరం 100 కంటే ఎక్కువ గృహాలను నిర్మించి. అందజేయాలని తాము ఆశిస్తున్నామన్నారు.

స్ట్రీట్ నెంబర్ 5లో డిప్యూటీ మేయర్ పర్యటన

నవతెలంగాణ-ఓయూ



తార్నాక డివిజన్‌లోని స్ట్రీట్ నెంబర్ 5లో నగర డిప్యూటీ మేయర్ మోతె శ్రీలత శోభన్ రెడ్డి పర్యటించారు. ఈ సందర్భంగా స్ట్రీట్ నెంబర్ 5 కాలనీవాసులు ఎదుర్కొంటున్న మంచినీటి కాలుష్య పరిష్కారానికి జీహెచ్ఎంసీ, వాటర్ వర్క్స్ అధికారులతో కలిసి పర్యటించి సమస్యపై సమీక్ష నిర్వహించారు. మంచినీటితోపాటు మురుగు నీళ్లు కూడా కలిసి వస్తుండటంతో కాలనీవాసులు తీవ్ర ఇబ్బందులను, ఆరోగ్య సమస్యలను ఎదుర్కొంటున్నారు. వెంటనే సమస్యను పరిష్కరించాలని కాలనీవాసులు ఇబ్బంది పడకుండా చూడాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జీహెచ్ఎంసీ ఇంజినీరింగ్ విభాగం డీఈ రఘు, ఏఈ వెంకటేష్, వాటర్ వర్క్స్ అధికారులు నికిత రెడ్డి, కాలనీ సభ్యులు పాల్గొన్నారు.

పెన్షనర్లకు ప్రతి నెలా ఒకటో తేదీన పెన్షన్ చెల్లించాలి

నవతెలంగాణ-ముషీరాబాద్



పెన్షనర్లకు ప్రతినెలా 1వ తేదీన పెన్షన్ చెల్లించాలని తెలంగాణ ఆల్ పెన్షనర్స్, రిటైర్డ్ పర్సన్స్ అసోసియేషన్ రాష్ట్ర కమిటీ ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. బుధవారం సుందరయ్య కళానిలయంలో అసోసియేషన్ రాష్ట్ర కమిటీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు కృష్ణ మూర్తి మాట్లాడుతూ కొత్త పీఆర్సీని వెంటనే అమలు చేయాలన్నారు. హెల్త్ కార్డులను అన్ని హాస్పిటల్స్‌లో అమలు చేయాలన్నారు. త్వరలో సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో రాష్ట్ర మహాసభలను నిర్వహించనున్నట్టు తెలిపారు. చర్చించి భవిష్యత్తు కార్యచరణను సిద్ధం చేసుకుంటామన్నారు. ఈ సమావేశంలో అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రంగయ్య, రాష్ట్ర ఉపాధ్యక్షురాలు సుజావతి, రాష్ట్ర కార్యదర్శి అశోక్, రాష్ట్ర ఉప కార్యదర్శులు నాగేశ్వరరావు, వీరన్న పాల్గొన్నారు.

అంతా మా ఇష్టం

- సర్కార్ ఆదేశాలు బేఖాతర్
- ట్యాంపరింగ్ కేసులో ఆ ముగ్గురి డ్రామా
- జేసీ చెప్పిందే వేదం
- ఏసీ నామమాత్రమే
- కమిషనర్‌ను తప్పుదోవపట్టిస్తున్న ఏసీ, జేసీ

నవతెలంగాణ-సిటీబ్యూరో

జీహెచ్ఎంసీ పరిపాలనా విభాగం ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తోంది. ఆ విభాగంలో జేసీ చెప్పిందే వేదం. సర్కార్ ఆదేశాలను పట్టించుకోరు. కమిషనర్ నిర్ణయాలను ఖాతర్ చేయరు. ప్రమోషన్ల విషయంలో కమిషనర్ ఆదేశాలను పట్టించుకోకపోవడమే ఇందుకు నిదర్శనం. ప్రమోషన్ల విషయంలో ఓ వ్యక్తికి అనుకూలంగా వ్యవహరించారని రాష్ట్ర ప్రభుత్వం మెమో జారీ చేసినా సదరు ఉద్యోగిపై ఎలాంటి చర్యలు తీసుకోకపోవడంతోపాటు మెమో టాంపరింగ్ విషయంలో రెండేండ్లుగా ఫైల్‌ను పెండింగ్‌లో పెట్టిన క్లర్క్ రఘుపై ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం వంటి చర్యలను ఆ విభాగం జేసీ, ఏసీలు సమర్థించుకోవడంతో పాటు సర్కార్‌ను, జీహెచ్ఎంసీని తప్పుదోవపట్టిస్తున్న పరిపాలనా విభాగంపై కమిషనర్ ఎందుకు చర్యలు తీసుకోవడంలేదని ఉద్యోగులు ప్రశ్నిస్తున్నారు.

సర్కార్ ఆదేశాలు బేఖాతర్

జనరల్ బ్రాంచిలో పని చేస్తున్న ఓ ఉద్యోగికి అర్హత లేకున్నా ప్రమోషన్ ఇచ్చిన విషయంలో విజిలెన్స్‌కు ఫిర్యాదు చేశారు. ఈ ఫిర్యాదును పరిశీలించిన రాష్ట్ర ప్రభుత్వం అప్పటి సీనియర్ అసిస్టెంట్‌పై ప్రభుత్వం 24 ఆగష్టు2021న మెమో జారీ చేసింది. దీనిపై పూర్తిస్థాయి నివేదిక పంపించాలని కోరింది. ఈ విషయంలో కమిషనర్ సైతం సీరియస్ అయ్యారు. సీనియర్ అసిస్టెంట్‌పై చర్యలు తీసుకోవాలని ఆదేశాలు జారీ చేశారు. కానీ ఎలాంటి చర్యలు తీసుకోకుండానే సదరు వ్యక్తిని బదిలీ చేశారు. ఈ విషయంలో పరిపాలనా విభాగం ఏసీ, జేసీ కమిషనర్‌ను తప్పుదోవ పట్టించారనే విమర్శలూ లేకపోలేదు.



డిజిటల్ కీ

'నేను జాయింట్ కమిషనర్‌ను. జీహెచ్ఎంసీ అంతా నా చేతిలోనే నడుస్తోంది. పైగా నేను ఎల్ఎల్‌బీ చేశాను. అన్ని చట్టపరమైన అంశాలపై నాకు పట్టుంది. కమిషనర్, అడిషనల్ కమిషనర్ (పరిపాలన) సైతం నా దగ్గర సలహాలు తీసుకుంటా రు. పరిపాలనా విభాగంలో నాతోపాటు సీనియర్ సూపరింటెం డెంట్ కూడా ఎల్ఎల్‌బీ చేశాడు. మేమిద్దరమే ఈ విభాగాన్ని నడిపిస్తున్నాం' అంటూ ఉద్యోగులను ఎల్బీనగర్ ఏఎంసీ, ఇన్ చార్జి జేసీ భయపెడుతున్నారని ఉద్యోగులు ఆందోళన వ్యక్తం చేస్తు న్నారు. అయితే ఏఎంసీగా ఉన్న వ్యక్తి జేసీగా చలామణి అవుతు న్నారు. పైగా ఏఎంసీ పేరుతో ఉండాల్సిన డిజిటల్ కీని సైతం జేసీ పేరుతో తీసుకున్నారు. దీనికి ఏసీ అండదండలున్నాయని యూనియన్ నేతలు విమర్శిస్తున్నారు. కానీ ఏఎంసీ నుంచి జేసీగా ప్రమోషన్ రావాలంటే సీడీఎంఏ నుంచి అనుమతి తప్పని సరిగా ఉండాలనీ, అది లేకుండా ఆయనే మూడేండ్లుగా ప్రకటించుకోవడం సరికాదని సీనియర్ ఉద్యోగులు అభిప్రాయపడు తున్నారు.

ఈ వార్తలు మనల్నేం చేస్తయ్

జీహెచ్ఎంసీ వివాదాలకు నిలయంగా మారింది. నకిలీ బర్త్ అండ్ డెత్ సర్టిఫికెట్ల విచారణ జరుగుతుండగానే పదో తరగతి మార్కుల మెమోను టాంపరింగ్ చేసి అపాయింట్‌మెంట్ ఆర్డర్ ఇచ్చిన విషయం దుమారం రేపుతోంది. దీన్ని విజిలెన్స్ విచారణకు ఫైల్ పంపకుండా పరిపాలనా విభాగం ఏసీ, జేసీ తాత్సారం చేస్తున్నారు. అయితే ఈ అంశంపై నవతెలంగాణలో వరుస కథనాలు ప్రచురితమయ్యాయి. 'ఎన్ని వార్తలు వచ్చినా మనకేం కాదు. నేనున్నా కదా జేసీగా చూసుకోవడానికి' అంటూ సదరు క్లర్క్‌తో అన్నట్టు జోరుగా ప్రచారం జరుగుతుంది. ఇదిలా ఉండగా టాంపరింగ్‌పై ఇంత చర్చ జరుగుతున్నా జీహెచ్ఎంసీ కమిషనర్ పట్టించుకోపోవడం విడ్డూరంగా ఉందనీ, ఇప్పటికైనా కమిషనర్ స్పందించి పరిపాలనా విభాగంలోని అవినీతి పరులైన ఆ ముగ్గురిపైనా చర్యలు తీసుకోవడంతోపాటు ఆ విభాగం నుంచి వెంటనే బదిలీ చేయాలని డిమాండ్ చేస్తున్నారు. లేకుంటే మంత్రి కేటీఆర్‌ను కలుస్తామనీ, అవసరమైతే ప్రగతిభవన్, జీహెచ్ఎంసీ ముందు పెద్ద ఎత్తున ధర్నా చేస్తామని యూనియన్ నేతలు, ఉద్యోగులు హెచ్చరిస్తున్నారు. టాంపరింగ్ కేసుపై జీహెచ్ఎంసీ విజిలెన్స్, ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగం ఎలాంటి చర్యలు తీసుకోకపోవడంపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయనీ, అందుకు ఆ విభాగంలో జేసీ అనుచరులు ఉన్నారనీ, వాళ్లే ఫైల్‌ను తొక్కిపడుతున్నారని పలువురు ఉద్యోగులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా విజిలెన్స్, ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్ జోక్యం చేసుకొని విచారణకు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

బీజేపీ పాలిత రాష్ట్రాల్లో దళితులపై మూడు రెట్ల హింస



నవతెలంగాణ-హైదరాబాద్

బీజేపీ పాలిత రాష్ట్రాల్లో దళితులపై మూడు రెట్లు హింసలు పెరగడం దారుణమని సీఐటీయూ చాంద్రాయణగుట్ట జోన్ కార్యదర్శి ఎస్.కిషన్ అన్నారు. సీఐటీయూ చాంద్రాయణ గుట్ట జోన్ కమిటీ ఆధ్వర్యంలో ఈ నెల 6 నుంచి 14వ తేదీ వరకు సామాజిక న్యాయ వారోత్సవాలు విజయవంతం చేయాలని చాంద్రాయణ గుట్టలోని గౌస్ నగర్, ఈడబ్ల్యూఎస్ కాలనీ, ఆశమాబాద్, చాంద్రాయణ గుట్టలో కరపత్రాలను పంచుతూ ప్రచారం చేస్తూ, సర్వే నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దళితుల, గిరిజనుల, మహిళలు, మైనార్టీలపై జరుగుతున్న దాడులను లైంగిక దాడులను ఖండిస్తూ, కుల వివక్షలకు వ్యతిరేకంగా పోరాడటమే ధ్యేయంగా సీఐటీయూ పని చేస్తుందన్నారు. ఉద్యోగులు కార్మికులంతా సామాజిక ఉద్యమాలకు సంఘీభావంగా కలిసికట్టుగా ఉండాలన్నారు. బీజేపీ పాలిత రాష్ట్రాల్లో దళితులపై మూడు రెట్లు హింసలు పెరిగాయన్నారు. మతం, కులం పేరుతో దేశభక్తి ముసుగులో ప్రలోభాలకు గురి చేస్తున్నారన్నారు. ప్రజలు, కార్మికుల్లో చిచ్చు పెడుతున్నదన్నారు. రాష్ట్రంలో 76 కుల దురహంకార హత్యలు జరిగినా పట్టించుకునే నాథుడే లేరన్నారు. ఈ నెల 13వ తేదీన జరిగే ర్యాలీలో అన్ని వర్గాల ప్రజలు పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జోన్ నాయకులు గౌస్, స్వామి, జీవన్, మాజర్, బాబు రావు, ఎండీ గౌస్ తదితరులు పాల్గొన్నారు.

రాజ్యాంగం ప్రకారం విద్య, ఉద్యోగ, ఆర్థిక, రాజకీయ, సామాజిక రంగాల్లో బీసీలకు వాటా ఇవ్వాలి

నవతెలంగాణ-అడిక్‌మెట్



బీసీలకు రాజ్యాంగం ప్రకారం విద్య ఉద్యోగ, ఆర్థిక, రాజకీయ, సామాజిక రంగాల్లో వాటా ఇవ్వాలనీ, కేంద్రంలో ప్రత్యేక మంత్రిత్వ శాఖ ఏర్పాటు చేయాలని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు ఎంపీ ఆర్.కృష్ణయ్య డిమాండ్ చేశారు. బుధవారం రాష్ట్రపతి ద్రౌపది ముర్మును కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆర్.కృష్ణయ్య మాట్లాడుతూ దేశంలో కేంద్ర ప్రభుత్వాలు 75 ఏండ్లుగా బీసీలకు ఏ రంగంలో కూడా జనాభా ప్రకారం వాటా ఇవ్వలేదన్నారు. విద్య, ఉద్యోగ, రాజకీయ, ఆర్థిక, సామాజిక రంగాల్లో కనీస ప్రాతినిధ్యం లభించలేదన్నారు. ఇది ప్రజాస్వామ్య దేశం అనీ, ప్రజాస్వామ్యంలో అన్ని సామాజిక కులాలకు వారి వారి జనాభా ప్రకారం అన్ని రంగాల్లో వాటా ఇవ్వాలని కోరారు. భారత వ్యవస్థలో 56 శాతం జనాభా గల బీసీలకు రాజకీయ రంగంలో 14 శాతం, ఉద్యోగ రంగంలో 9 శాతం. పారిశ్రామిక రంగంలో ఒక శాతం, ప్రైవేటు రంగంలోని ఉద్యోగాల్లో 5 శాతం, ఉన్నత న్యాయ స్థానాల్లో 2 శాతం ప్రాతినిధ్యం లేదంటే పరిస్థితి ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చు అన్నారు. 56 శాతం జనాభా గల బీసీలకు ఇంత తక్కువ ప్రాతినిధ్యం ఉంటే ఇదేం ప్రజాస్వామ్యం అని ప్రశ్నించారు. కేంద్ర ప్రభుత్వ శాఖల్లో, ప్రభుత్వ రంగ సంస్థల్లో ఖాళీగా ఉన్న 16 లక్షల ఉద్యోగ ఖాళీలను భర్తీ చేయాలని కోరారు. బీసీల డిమాండ్లపై రాష్ట్రపతి స్పందించి బీసీలకు అన్ని రంగాల్లో సమాన వాటా ఇచ్చే ప్రక్రియ ప్రారంభమైందన్నారు. ఇంకా పూర్తిస్థాయిలో న్యాయం చేయడం కోసం చర్యలు తీసుకుంటామని రాష్ట్రపతి హామీనిచ్చారని తెలిపారు. ఈ సమావేశంలో గుజ్జ కృష్ణ, లాల్ కృష్ణ, భూపేష్ సాగర్, రాము, నీల వెంకటేష్, జర్రిపోతుల పరుషారామ్, తదితరులు పాల్గొన్నారు.

'మతోన్మాద శక్తులు జీర్ణించుకోలేకే విద్యార్థి సంఘం ఎన్నికల్లో హత్యలు'



నవతెలంగాణ-హిమాయత్‌నగర్

విద్యార్థుల సమస్యల పరిష్కారం కోసం ఉస్మానియా వేదికగా అనేక పోరాటాలు నిర్వహించే క్రమంలో విద్యార్థుల్లో జార్జిరెడ్డికి వచ్చే ఆదరణను మతోన్మాద శక్తులు జీర్ణించుకోలేక విద్యార్థి సంఘం ఎన్నికల్లో ఆయనను హత్య చేసి భౌతికంగా దూరం చేశారని పీడీఎస్‌యూ మాజీ రాష్ట్ర కార్యదర్శి ఎస్.ఎల్ పద్మ ఉస్మానియా యూనివర్సిటీ ప్రొఫెసర్ గుమ్మడి అనురాధ ఆవేదన వ్యక్తం చేశారు. ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం (పిడిఎస్‌యూ) నిజాం కళాశాల కమిటీ ఆధ్వర్యంలో బుధవారం జార్జిరెడ్డి 51వ వర్ధంతి సందర్భంగా నిజాం కళాశాలను తోరణాలతో ఎరుపు మయం చేసి జార్జిరెడ్డికి విద్యార్థులు నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థుల సమస్యల పరిష్కారం కోసం ఉస్మానియా వేదికగా అనేక పోరాటాలు నిర్వహించే క్రమంలో విద్యార్థుల్లో జార్జ్‌కు వచ్చే ఆదరణను మతోన్మాద శక్తులు జీర్ణించుకోలేక విద్యార్థి సంఘ ఎన్నికల్లో 1972 ఏప్రిల్ 14 హత్య చేశారని ఆరోపించారు. ఆయన భౌతికంగా దూరమై 51 ఏండ్లు గడిచిందని గుర్తు చేశారు. జార్జ్‌ను హత్య చేసిన అదే భావజాల శక్తులే నేడు అధికారంలో ఉన్నాయనీ, ఆ మతోన్మాద ప్రభుత్వాలే నేడు విద్యను కాషాయీకరణ చేయడం కోసం నూతన జాతీయ విద్యా విధానాన్ని తీసుకొస్తున్నారనీ, దీన్ని ఏక పక్షంగా అమలు చేయడానికి పూనుకున్నారని ఆరోపించారు. రాష్ట్ర ప్రభుత్వం నీళ్ళు, నిధులు, ఉద్యోగాల పేరుతో అధికారంలో ఉన్న ఈ తొమ్మిది ఏండ్ల కాలం అధికార దుర్వినియోగానికి పాల్పడుతూ కోట్ల రూపాయల అవినీతి ధనం ప్రగతి భవన్ కు మళ్లిందనీ, కోటి ఆశలతో తెచ్చుకున్న తెలంగాణలో ఉద్యోగాలు వస్తాయనుకుంటే ఉద్యోగాలు ముందుగానే అమ్ముడై పోతున్నాయని విమర్శించారు. విద్యార్థులు మరో ఉద్యమానికి సిద్ధం కావాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పీవైఎల్ రాష్ట్ర కార్యదర్శి ప్రదీప్, కృష్ణ, పీడీఎస్‌యూ గ్రేటర్ హైదరాబాద్ అధ్యక్షులు అనిల్, ప్రధాన కార్యదర్శి ప్రవీణ్, సహాయ కార్యదర్శి రాకేష్, తిరుపతి, నాగరాజు, పవిత్ర, నవ్య, నవీన్, సాయి, కళాశాల విద్యార్థులు పాల్గొన్నారు.

మంత్రి కేటీఆర్‌ను కలిసిన ఆశిష్ కుమార్ యాదవ్



నవతెలంగాణ-సుల్తాన్‌బజార్

తెలంగాణ భవన్‌లో ఐటీ శాఖ మంత్రి తారక రామారావును మర్యాదపూర్వకంగా గోషామహల్ నియోజకవర్గం బీఆర్ఎస్ నాయకులు ఆశిష్ కుమార్ యాదవ్, తదితరులు కలిశారు.

16న వీరశైవ లింగాయత్ / జంగమ వధూవరుల వివాహ పరిచయ వేదిక

నవతెలంగాణ-అడిక్‌మెట్

వీరశైవ లింగాయత్ జంగమ మహేశ్వర వధూవరుల వివాహ పరిచయ వేదికను ఈ నెల 16వ తేదీన మలక్‌పేట ముసారాంబాగ్‌లోని శ్రీ వెంకటేశ్వర స్వామి దేవస్థానంలో నిర్వహించనున్నట్టు విశ్వ లింగాయత్ ట్రస్టు అధ్యక్షుడు పసారం శ్రీనివాస్ ఒక ప్రకటనలో తెలిపారు. తమ ట్రస్టు ఆధ్వర్యంలో 15 రోజులుగా వివాహ పరిచయ వేదికలు నిర్విహిస్తున్నామనీ, తెలంగాణ, ఏపీ, కర్ణాటక, మహారాష్ట్ర తదితర రాష్ట్రాల్లో నుంచి వధూవరులు పాల్గొంటారని తెలిపారు. వివాహం కావాల్సిన లింగాయత్, జంగమ మహేశ్వర వధూవరులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. మిగతా వివరాలకు 9246359842 నెంబర్‌ను, www.vishwalingayatmarriage.com వెబ్ సైట్‌ని సంప్రదించాలన్నారు.

కె.వి.ఆర్ లా అసోసియేషన్ ఆఫీసు ప్రారంభం



నవతెలంగాణ-జూబ్లీహిల్స్

జూబ్లీహిల్స్ నియోజకవర్గం మధురనగర్ మెట్రో స్టేషన్, పిల్లర్ నెంబర్ 1482 ఎదురుగా గల బిల్డింగ్ మూడో అంతస్తులో అడ్వకేట్ కె.ఆనంద్ రాజ్ ఆధ్వర్యంలో కె.వి.ఆర్ లా అసోసియేషన్ ఆఫీసును స్టేట్ సివిల్ సప్లై కార్పొరేషన్ చైర్మన్ రవీందర్ సింగ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆనంద రాజ్ మాట్లాడుతూ పేదవారు కోర్టుల చుట్టూ తిరగలేక, లాయర్ల ఫీజులు చెల్లించలేక అనేకమంది ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారనీ, సరైన లాయర్లు దొరకక్క కొంతమంది జైలు పాలు అవుతున్నారని తెలుసుకుని అలాంటి పేద నేరస్తులకు తమ ఆఫీస్ తరపున తక్కువ ఫీజుతో సేవ చేయాలనే ఉద్దేశంతో తన తండ్రి కె.వి.ఆర్ పేరుతో ఆఫీసును ప్రారంభించినట్టు తెలిపారు. ప్రస్తుతం తెలంగాణ, ఏపీ, చెన్నై, బాంబేలో ఉండే వారికి హైదరాబాదు నుంచి తమ సేవలు అందించుటకు అన్ని ఏర్పాట్లు చేసుకున్నామని తెలిపారు. సివిల్, క్రిమినల్ కేసుల వారికి ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటామనీ, స్వయంగా తమ ఆఫీసుకు వచ్చి అన్ని వివరాలు తెలియజేయాలని కోరారు. సుమారు 30 మంది లాయర్లు పేదవారికి అండ గా ఉండి కేసులు వాదించుటకు సిద్ధంగా ఉన్నామని తెలిపారు.

స్థానిక సమస్యలపై దృష్టి సారించండి

నవతెలంగాణ-అంబర్‌పేట



స్థానిక సమస్యలపై అధికారులు దృష్టి సారించడం లేదని నల్లకుంట కార్పొరేటర్ వై.అమృత అన్నారు. బుధవారం నల్లకుంట డీఎస్ పరిధిలోని కార్పొరేటర్ డెవలప్మెంట్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో బీజేపీ అసెంబ్లీ కన్వీనర్ శ్యామ్ రాజ్‌తో కలిసి ఆమె మాట్లాడారు. రెండేండ్లుగా అధికారులకు ఎన్ని వినతి పత్రాలు అందజేసినా పట్టించుకోవడం లేదన్నారు. స్థానిక అధికారులు డెవలప్మెంట్ అభివృద్ధి పనులు పాటించేటప్పుడు ప్రోటోకాల్ పాటించడం లేదన్నారు. నల్లకుంట డివిజన్ కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి ఎమ్మెల్యేగా ఉన్నప్పుడే చేసిన అభివృద్ధి తప్ప మరో అభివృద్ధి కనిపించడం లేదన్నారు. కార్పొరేటర్లకు కనీస బడ్జెట్ కేటాయించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. 20 ఏండ్ల క్రితం వేసిన ఇనుప స్తంభాలు నేలకొరిగాయని అధికారులకు వినతి పత్రాలు అందజేసినా పట్టించుకోవడం లేదన్నారు. కార్యక్రమంలో బీజేపీ డివిజన్ అధ్యక్షులు రామ్ రెడ్డి, సీనియర్ నాయకులు మధు యాదవ్, బాబు, లక్ష్మణ్, మహిళా మోర్చా కన్వీనర్ శిరీష, ఇర్ఫానా సుల్తాన్ తదితరులు పాల్గొన్నారు.



పరిసరాల శుభ్రత అందరి బాధ్యత

నవతెలంగాణ-అంబర్‌పేట

పరిసరాల శుభ్రత ప్రతి ఒక్కరి బాధ్యత అనీ, చుట్టుపక్కల పరిసరాలు, ప్రాంతాలను శుభ్రంగా ఉంచుకోవాలని అంబర్ పేట ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్ అన్నారు. బుధవారం కాచిగూడ డివిజన్ పరిధిలోని చప్పల్ బజార్‌లో ఎమ్మెల్యే కాచిగూడ కార్పొరేటర్ కన్నె ఉమా రమేష్ యాదవ్ స్థానిక అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలకు పరిశుభ్రమైన పరిసరాల అవసరంపై అవగాహన కల్పించారు. పరిసరాలు శుభ్రంగా ఉంటే అంటు వ్యాధులు ప్రబలవనీ, అనారోగ్యం దగ్గరకి రాదని చెప్పారు. ముఖ్యంగా పిల్లలు, పెద్దలకు రక్షణ లభిస్తుందని పేర్కొన్నారు. ఈ సందర్భంగా ప్రజలు ఇంట్లోని చెత్తను పారిశుధ్య సిబ్బంది తీసుకువచ్చే బండిలోనే వేయాలని లేదా వీధిలో ఏర్పాటు చేసిన చెత్త కుండీలలోనే వేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో నోడల్ ఆఫీసర్ లాలా సాహెబ్, ఎఎంహెచ్ఓ జ్యోతి, డీసీ వేణుగోపాల్, మాజీ కాచిగూడ డివిజన్ బీఆర్ఎస్ అధ్యక్షులు భీష్మ దేవ్, సీనియర్ నాయకులు ధాత్రిక్ నాగేందర్ బాబ్జి, సదానందు, మన్నె శ్రీనివాస్ యాదవ్, బబ్లూ పాల్గొన్నారు.

పెంచిన పీహెచ్డీ ఫీజులకు నిరసనగా తరగతుల బహిష్కరణ

నవతెలంగాణ-ఓయూ



హేతుబద్ధత లేకుండా పెంచిన పీహెచ్డీ ఫీజులను నిరసిస్తూ ఉస్మానియా యూనివర్సిటీ పరిశోధక విద్యార్థులు రీసెర్చ్ మెథడాలజీ క్లాసును బైకాట్ చేసి క్లాస్ నుంచి ర్యాలీగా బయలుదేరి పెంచిన ఫీజును తగ్గించాలనీ పీహెచ్‌డీ అడ్మిషన్ పొందిన ప్రతి విద్యార్థికీ హాస్టల్ మెస్ సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేస్తూ ఆర్ట్స్ కాలేజ్ ముందు వరకు వచ్చి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులు మాట్లాడుతూ నాలుగేండ్ల నిరీక్షణ తర్వాత పీహెచ్‌డీ అడ్మిషన్ పొందిన విద్యార్థులకు ఉస్మానియా యూనివర్సిటీలో ఉన్నత విద్య చదువుకోవాలా.. వద్దా.. అనే విధంగా పీహెచ్‌డీ ఫీజులు నిర్ణయించారని చెప్పారు. పెంచిన ఫీజులను వెంటనే తగ్గించి పీహెచ్డీ అడ్మిషన్ పొందిన ప్రతి విద్యార్థికీ హాస్టల్ మెస్ సౌకర్యం కల్పించే వరకు విద్యార్థులను, ప్రొఫెసర్లను వివిధ విద్యార్థి సంఘాలను కలుపుకుని వివిధ పద్ధతుల్లో ఉద్యమాలు కొనసాగిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో పొలిటికల్ సైన్స్ రీసర్చ్ స్కాలర్ నెల్లి సత్య, తెలుగు రీసర్చ్ స్కాలర్ బొడ్డుపల్లి అఖిల్, ఎకనామిక్స్ రీసర్చ్ స్కాలర్స్, చారులత, వెంకటేష్, సాహితీ, శ్రీ వాస్తవ, మనోజ్, రవి, పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్ రీసెర్చ్ స్కాలర్స్, కిరణ్, మహేష్, సోషలజీ రీసెర్చ్ స్కాలర్ ప్రవీణ్ పాల్గొన్నారు.

మతోన్మాద, ఫాసిస్టు విధానాలకు వ్యతిరేకంగా జార్జిరెడ్డి వర్ధంతి సభలను నిర్వహిద్దాం



నవతెలంగాణ-అడిక్‌మెట్

మతోన్మాద, ఫాసిస్టు విధానాలకు వ్యతిరేకంగా జార్జిరెడ్డి 51వ వర్ధంతి సభలను నిర్వహిద్దాం అని పీడీఎస్‌యూ జాతీయ నాయకులు ఎస్. నాగేశ్వరావు, రాష్ట్ర అధ్యక్షులు పెద్దింటి రామకృష్ణ పిలుపునిచ్చారు. జార్జిరెడ్డి 51వ వర్ధంతి సభలను విజయవంతం చేయాలని పీడీఎస్‌యూ రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో విద్యానగర్‌లోని మర్క్స్ భవన్‌లో వాల్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పీడీఎస్‌యూ జాతీయ నాయకులు నాగేశ్వరావు మాట్లాడుతూ జార్జిరెడ్డి ఉస్మానియా యూనివర్సిటీలో న్యూక్లియర్ ఫిజిక్స్‌లో గోల్డ్ మెడలిస్ట్, యూనివర్సిటీ కింక్ బాక్సింగ్ చాంపియన్ అన్నారు. ఉస్మానియా యూనివర్సిటీలో ఆధిపత్య, మతోన్మాద ఆగడాలను చీల్చి చెండాడిన వీరుడు. ఉస్మానియా అరుణ కిరణంగా పరిచయమైన ప్రతి వ్యక్తితో స్వతంత్రమైన ఆలోచనా శక్తిని రేకెత్తించగల అధ్యయన శీలి అన్నారు. నిత్యం మతోన్మాద, ఆధిపత్య బ్రాహ్మణీయ దాడులను ఎదుర్కొంటూ పేదల, బడుగు జీవులవైపు దృఢంగా నిలిచిన సాహసికుడు అన్నారు. జీవించాలంటే మరణం నేర్చుకో.. అడుగడున పోరాటాలు నేర్చుకో అంటూ.. తన జీవితాన్ని పోరాటంగా మల్చుకుని వేలాది మంది విద్యార్థులకు స్ఫూర్తినిచ్చిన హైదరాబాద్ చేగువేరా కామ్రేడ్ జార్జిరెడ్డి అన్నారు. దోపిడీ, పీడన, అసమానతలు లేని నూతన సమాజాన్ని కాంక్షించిన స్వాప్నికుడు, అసాహసికుడు, మేధావి మతోన్మాద గుండాల చేతిలో అతికిరాతకంగా అమరత్వం పొంది 51వ ఏండ్లు నిండుతున్నవని తెలిపారు. ఆ నాటి పరిస్థితులే నేడు దేశవ్యాప్తంగా ముందుకొచ్చినవనీ, అందులో భాగంగానే ప్రగతిశీల శక్తులను, ప్రశ్నించే గొంతుకలను నొక్కుతున్న హిందు ఫాసిజానికి వ్యతిరేకంగా పోరాడుదాం, మానవీయ, ప్రజాస్వామిక విలువలను, హక్కులను కాపాడుకుందామని పిలుపునిచ్చారు. విద్యార్థుల్లో శాస్త్రీయ దృక్పథం పెంపొందేలా విద్యావిధానం ఉండాలన్నారు. విస్తతమవుతున్న హిందూ ఫాసిజానికి వ్యతిరేకంగా, పెట్టుబడిదారీ, సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా అమరవీరుడు కామ్రేడ్ జార్జి రెడ్డి స్ఫూర్తితో మరింతగా పోరాడమే ఆయనకు నిజమైన నివాళి అని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పీడీఎస్‌యూ రాష్ట్ర ఉపాధ్యక్షులు అనిల్, సహాయ కార్యదర్శి ప్రవీణ్, రాష్ట్ర నాయకులు సుమంత్, రాకేష్, ప్రశాంత్, నాయకులు కోటి, నబీ, అనిల్ పాల్గొన్నారు.

ఎక్స్‌పోర్టు ఇంపోర్ట్ బ్యాంకుతో హెచ్‌డీఎఫ్ సీ బ్యాంకు ఒప్పందం

నవతెలంగాణ-హైదరాబాద్

భారతదేశంలోని ప్రముఖ ప్రైవేట్ రంగ బ్యాంకు హెచిఎఫ్సి బ్యాంక్, ఎక్స్‌పోర్టు ఇంపోర్ట్ బ్యాంక్ ఆఫ్ కొరియాతో 300 మిలియన్ డాలర్ల క్రెడిట్ కోసం మాస్టర్ ఇంటర్ బ్యాంక్ క్రెడిట్ అగ్రిమెంట్పై సంతకం చేసినట్టు ప్రకటించింది. గుజరాత్లోని గిఫ్ట్ సిటీలో ఈ ఒప్పందంపై సంతకం చేసుకున్నారు. ఇది కొరియా-సంబంధిత వ్యాపారాలకు విస్తరించే విదేశీ కరెన్సీ నిధులను సమీకరించడంలో హెచిఎఫ్సి బ్యాంకు సహకరిస్తుంది. ఈసందర్భంగా ట్రెజరీ, సేల్స్ అనలిటిక్స్, ఓవర్సీస్ బిజినెస్ గ్రూప్ హెడ్ అరూప్ రక్షిత్ మాట్లాడుతూ... కొరియన్ ఎగ్జిమ్బ్యాంక్ చేసుకున్న ఒప్పందం భారతదేశం, కొరియా మధ్య వాణిజ్యం, పెట్టుబడులకు మద్దతు ఇస్తూ మరింత బలోపేతం చేస్తుందన్నారు. తాము ఈ ఒప్పందం ప్రకారం డీల్స్ ను కొనసాగిస్తామ న్నారు. ఇంటర్ బ్యాంక్ ఫైనాన్స్ డిపార్ట్మెంట్ హెడ్ డైరెక్టర్ జనరల్ చౌన్-జే లీ నేతృత్వంలోని ఎక్స్పోర్ట్ ఇంపోర్ట్ బ్యాంక్ ఆఫ్ కొరియా బృందం ఈ ఒప్పంద కార్యక్రమానికి హాజరయ్యారు. ఎక్స్పోర్ట్ ఇంపోర్ట్ బ్యాంక్ ఆఫ్ కొరియా నుంచి కార్యక్రమంలో పాల్గొన్న ఇతరుల్లో కి-యంగ్ జంగ్, సీనియర్ లోన్ ఆఫీసర్, ఇంటర్ బ్యాంక్ ఫైనాన్స్ డిపార్ట్మెంట్, సాంగ్ కిమ్, చీఫ్ రిప్రజెంటేటివ్, న్యూఢిల్లీ రిప్రజెంటేటివ్ ఆఫీస్, హెచీఎఫ్సి బ్యాంకు తరఫున సేల్స్, అనలిటిక్స్, ఓవర్సీస్ బిజినెస్ గ్రూప్ హెడ్ అరూప్ రక్షిత్, ఎగ్జిక్యూటివ్ వైస్ ప్రెసిడెంట్ కపిల్ బన్సల్, హెడ్ ఓవర్సీస్ బిజినెస్ ట్రెజరీ, ఆనంద్ అయ్యర్, హెడ్ గిఫ్ట్ సిటీ ఐబీయూ ఉన్నారు.

'ప్రజాస్వామ్యంపై బీజేపీ, ఎంఐఎం దాడి'



నవతెలంగాణ-హిమాయత్‌నగర్

బద్ధ శత్రువులుగా నటిస్తూ బీజేపీ, ఎంఐఎంలు కలసి దేశ లౌకిక ప్రజాస్వామ్యంపై ప్రమాదకరమైన దాడులు చేస్తున్నారని సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు ఈ.టి. నరసింహ ఆరోపించారు. మెజారిటీ, మైనారిటీ మతతత్వం మన దేశానికి పెను ముప్పు కలిగిస్తున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. బుధవారం హిమాయత్‌నగర్‌లోని సత్యనారాయణరెడ్డి భవన్ వద్ద 'బీజేపీ హటావ్-దేశ్ బచావ్' పాద యాత్ర ప్రచార హోర్డింగ్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఈ.టి.నరసింహ మాట్లాడుతూ బీజేపీయేతర ఓట్లు ఒకే చోట చేరకుండా చూసుకోవడం ద్వారా బీజేపీని గెలిపించాలనే కచ్చితమైన లక్ష్యంతో ఎంఐఎం బీజేపీకి బీ టీమ్‌గా వ్యవహరిస్తుందనే బహిరంగ రహస్యం మరొకటి లేదన్నారు. బలం లేని చోట ఎంఐఎం తమ అభ్యర్థులను పోటీలోకి దింపి పరోక్షంగా బీజేపీ అభ్యర్థులను గెలిపిస్తుందనీ, బీజేపీ, ఎంఐఎం అనైతిక బంధం వల్ల లౌకికవాద సంప్రదాయం, వైవిధ్యం పట్ల నిబద్ధత ఉన్న 'సెక్యులర్ పార్టీల' అభ్యర్థులు ఎన్నికల పరాజయాలను చవిచూస్తున్నారని చెప్పారు. ఇద్దరి మధ్య ఉన్న ఒప్పందం ఏంటో బీజేపీ దేశానికి చెప్పాలని డిమాండ్ చేశారు. లౌకిక ప్రజాస్వామ్యానికి ఆరోగ్యకరమైన విధానాలు అవలంభిస్తున్న ఎంఐఎం ఉద్దేశం, రాజకీయాలను ముస్లిం మేధావులు ప్రశ్నించడం ప్రారంభించాలని కోరారు. మతం ఆధారంగా ప్రజలను విభజించే శక్తులైన బీజేపీ ఎదుగుదలతో పాటు ఎంఐఎం ఎదుగుదల రెండూ దేశానికి ప్రమాదకరమనీ, హిందూ-ముస్లిం విభజనను అడ్డుకోవాలని లౌకిక, ప్రజాస్వామ్య ప్రగతిశీల శక్తులకు ఆయన సూచించారు. ఆర్థిక మాంద్యం, నిరుద్యోగం, అధిక ధరలతో దుర్భరమైన జీవితాలు గడుపుతున్న సామాన్య ప్రజల సమస్యలను పరిష్కరించడంలో కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందన్నారు. రాజ్యాంగాన్ని, ప్రజాస్వామ్యాన్ని, లౌకికవాదాన్ని ధ్వంసం చేయడమే మోడీ ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుని ప్రజల మధ్య విభజన సృష్టిస్తుందని చెప్పారు. మోడీ నేతృత్వ కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం దేశ సంపదను కార్పొరేట్లకు అమ్ముకుంటున్న తీరు, మత విద్వేషాలు రెచ్చగొట్టడం, ప్రజా వ్యతిరేక విధానాలు ప్రజలకు తెలిపేందుకు 'బీజేపీ హటావ్-దేశ్ బచావ్' నినాదంతో దేశవ్యాప్తంగా ఈ నెల 14 నుంచి మే 15 వరకు పాదయాత్రలు నిర్వహించాలని సీపీఐ జాతీయ సమితి పిలుపు మేరకు హైదరాబాద్ జిల్లా సమితి హైదరాబాద్ జిల్లా వ్యాప్తంగా నెల రోజుల పాటు 'బీజేపీ హటావ్-దేశ్ బచావ్' నినాదంతో పాదయాత్రలు నిర్వహిస్తుందనీ, ఈ పాదయాత్రలు పార్టీ శ్రేణులు, ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని, విజయవంతం చేయాలని విజ్ఞప్తి చేశారు.ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి ఎస్. ఛాయాదేవి, సహాయ కార్యదర్శి స్టాలిన్, కమతం యాదగిరి, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు బి.వెంకటేశం, జిల్లా కార్యవర్గ సభ్యులు నేర్లకంటి శ్రీకాంత్, చెట్టుకింది శ్రీనివాస్, విద్యార్థి నాయకులు కల్యాణ్ సందీప్, వినోద్ పాల్గొన్నారు.

నవతెలంగాణ
కుత్బుల్లాపూర్
గురువారం 13 ఏప్రిల్ 2023

బాపునగర్ సమస్యలపై ఎమ్మెల్సీకి కమిటీ సభ్యుల వినతి



నవతెలంగాణ -దుండిగల్

కుత్బుల్లాపూర్ నియోజక వర్గం పరిధిలోని బాపునగర్ సమస్యలపైన మండలిలో ప్రభుత్వ చీఫ్‌విప్, ఎమ్మెల్సీ శంభిపూర్ రాజుని దుడిమెట్ల సోమేష్ యాదవ్ ఆధ్వర్యంలో బాపునగర్ అధ్యక్షుడు జగదీష్ గౌడ్, వర్కింగ్ ప్రెసిడెంట్ క్రిష్ణ, కమిటీ సభ్యులు మర్యాదపూర్వకంగా కలిసి వినతి పత్రం అందించారు. ఎమ్మెల్సీ సానుకూలంగా స్పందించి బాపునగర్‌లోని రోడ్ నెంబర్. 1,2,4,5లకు సిసి రోడ్లు, కమ్యూనిటీ హాల్ నిర్మాణం, ఇతర సమస్యలను పరిష్కరించేందుకు సంబంధింత అధికారులతో మాట్లాడి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

గంజాయి రవాణాతో పట్టుబడ్డ యువకుల అరెస్ట్



నవతెలంగాణ-కూకట్‌పల్లి

గంజాయి సేవించే వారిని లక్ష్యంగా చేసుకొని గంజాయి విక్రయించేందుకు సీలేరు ప్రాంతం నుంచి అక్రమంగా గంజాయి తీసుకొని వచ్చిన నలుగురు నిందితులను కూకట్ పల్లి పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఈ మేరకు బుధవారం కూకట్‌పల్లి పోలీస్ స్టేషన్ ఏసీపీ చంద్రశేఖర్ విలేకరులకు వివరాలు వెల్లడించారు. పోలీసులు వాహనాల తనిఖీలు చేస్తుండగా కారులో గంజాయి తరలిస్తూ.. గోదావరిఖని ప్రాంతానికి చెందిన మేకల అభిలాష్(22) ,చల్లా దను(27) నిమ్మల మణికంఠ (21)తో పాటు మంథనికి చెందిన లింగం శ్రీపాదును (21) అదుపులోకి తీసుకున్నామని తెలిపారు. నిందితుల నుంచి 5.3 కేజీల గంజాయితో పాటు కారు, మూడు మొబైల్స్ సీజ్ చేసినట్లు తెలిపారు. ప్రధాన నిందితుడు మేకల అభిలాషపైన పీడీ యాక్టు నమోదు చేస్తామని, కూకట్‌పల్లి వై జంక్షన్ వద్ద వాహనాల తనిఖీల్లో భాగంగా కారు డిక్కీలో గంజాయి తీసుకొని వెళ్తుండగా అరెస్టు చేశామని ఏసీపీ తెలిపారు. నిందితులపైన కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించామని తెలియజేశారు.

నేటి నుంచి 'పది' మూల్యాంకనం

- సెయింట్ పాయిస్, హోలీ మేరి స్కూల్‌లో ఏర్పాట్లు
- జిల్లాకు చేరిన 3.66 లక్షల జవాబు పత్రాలు
- 'స్పాట్' విధుల్లో 1600 మంది ఉపాధ్యాయులు



నవతెలంగాణ-సిటీబ్యూరో

నేటి నుంచి హైదరాబాద్ జిల్లాలో పదో తరగతి వార్షిక పరీక్ష పత్రాల మూల్యాంకనం నిర్వహించనున్నారు. నగరంలోని సెయింట్ పాయిస్ ఉన్నత పాఠశాలలో (మేజర్ క్యాంపు), ఏసీ గార్డ్‌లోని హోలీ మేరి ఉన్నత పాఠశాలలో (మైనర్ క్యాంపు) ఈ నెల 21వ తేదీ వరకు స్పాట్ వ్యాలూవేషన్ జరగనుంది. ఇందుకు ఇప్పటికే అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. మరీ ముఖ్యంగా పది ప్రశ్నాపత్రాల లీకేజీ నేపథ్యంలో స్పాట్ వాల్యూవేషన్‌పై అధికారులు ప్రత్యేక దృష్టి సారించారు. రాష్ట్రంలోని 22 జిల్లాలకు చెందిన మేజర్, మైనర్ క్యాంపునకు సంబంధించి 3.66 లక్షల జవాబుపత్రాలు ఇప్పటికే హైదరాబాద్‌కు చేరాయి. స్పాట్ వాల్యూవేషన్ కోసం 1608 మందికి విధులు కేటాయించగా.. ఇందులో మేజర్ క్యాంపునకు చీఫ్ ఎగ్జామినర్లు 123, అసిస్టెంట్ ఎగ్జామినర్లు 736, స్పెషల్ అసిస్టెంట్లు 246 మంది ఉంటారు. ఇక మైనర్ క్యాంపులో చీఫ్ ఎగ్జామినర్లు 68, అసిస్టెంట్ ఎగ్జామినర్లు 299, స్పెషల్ అసిస్టెంట్లు 136 మంది ఉంటారు.

పకడ్బందీగా ఏర్పాట్లు..

రాష్ట్రంలోని వివిధ జిల్లాల్లో పదో తరగతి వార్షిక పరీక్షలు మొదలైన తొలిరోజుతో పాటు ఆ తర్వాత రోజు ప్రశ్నాపత్రాలు లీకేజీ వార్తలు కలకలం సృష్టించిన నేపథ్యంలో జిల్లాలోని స్పాట్ వాల్యూవేషన్ కేంద్రాల వద్ద విద్యాశాఖ అధికారులు పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశారు. స్పాట్ వాల్యూవేషన్ కేంద్రాలైన సెయింట్ పాయిస్, హోలీ మేరి స్కూల్ వద్ద గట్టి నిఘా పెట్టారు. టెన్త్ జవాబుపత్రాల వాల్యూవేషన్ సందర్భంగా సెంటర్ సమీపంలోకి ఎవరినీ అనుమతించకుండా చర్యలు తీసుకొనున్నారు. ఉదయం 8.30 గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు క్యాంప్ ఉంటుందనీ, ఒక్కో ఉపాధ్యాయుడికి రోజుకు 40 జవాబుపత్రాలు కేటాయిస్తామని అధికారులు తెలిపారు. అలాగే స్పాట్ కేంద్రంలోకి సెల్‌ఫోన్లు అనుమతి లేదనీ, ఆదివారాల్లోనూ కొనసాగుతుందని అధికారులు చెప్పారు సీసీ కెమెరాల పర్యవేక్షణలో మూల్యాంకన ప్రక్రియ కొనసాగనుంది. పొరబాట్లు జరిగితే సంబంధింత అధికారిపై శాఖాపరమైన చర్యలు ఉంటాయని డీఈఓ రోహిణి తెలిపారు. ఎక్కడైనా అసౌకర్యానికి గురైతే తమ దృష్టికి తీసుకురావాలని సూచించారు.

మతాలను అడ్డుపెట్టుకొని రాజకీయాలు చేయడమే బీజేపీ లక్ష్యం



- రాష్ట్ర కార్మికశాఖ మంత్రి మల్లారెడ్డి
- ఎమ్మెల్యేగా పోటీ చేయడానికి నాయకుడు లేని పార్టీలు కాంగ్రెస్, బీజేపీ
- దేశానికి అన్నం పెట్టే స్థాయికి తెలంగాణ చేరుకుంది : ఎమ్మెల్సీ పల్లా రాజేశ్వర్ రెడ్డి

నవతెలంగాణ-మేడ్చల్

రాష్ట్రంలోని నియోజకవర్గలలో ఎమ్మెల్యేగా పోటీ చేయడానికి కనీసం నియోజకవర్గ స్థాయి నాయకుడు లేని పార్టీలు కాంగ్రెస్, బీజేపీవి అని రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి చామకూర మల్లారెడ్డి విమర్శించారు. బుధవారం మేడ్చల్ మండల బీఆర్ఎస్ పార్టీ ఆత్మీయ సమ్మేళనం మండల అధ్యక్షుడు దయానంద్ యాదవ్ ఆధ్వర్యంలో కండ్లకోయ చౌరస్తాలోని నిమ్మల కన్వెన్షన్‌లో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మంత్రి మల్లారెడ్డి, జిల్లా ఇంఛార్జి, రైతుబంధు రాష్ట్ర అధ్యక్షుడు, ఎమ్మెల్సీ పల్లా రాజేశ్వర్‌రెడ్డి, ఎమ్మెల్సీ సురభి వాణిదేవీలతో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మల్లారెడ్డి మాట్లాడుతూ ఉద్యమకారులకు బీఆర్ఎస్ పార్టీ తగిన గుర్తింపునిస్తుందన్నారు. సీఎం కేసీఆర్ నాయకత్వంలో దేశానికే ఆదర్శంగా తెలంగాణ రాష్ట్రం ఉందన్నారు. సంక్షేమ పథకాల అమలులో దేశంలోనే తెలంగాణ రాష్ట్రం నెంబర్ వన్‌గా ఉందని తెలిపారు. స్వరాష్ట్రం సాధించిన నాటి నుంచి అన్ని రంగాల్లో పురోగతి సాధించి ఆదర్శవంతమైన రాష్ట్రంగా తెలంగాణ రూపుదిద్దుకుందని అన్నారు. కేవలం మతాన్ని అడ్డుపెట్టుకొని రాజకీయాలు చేయడమే బీజేపీ పనిగా పెట్టుకుందన్నారు. తెలంగాణలో అమలు చేసే పథకాలు దేశంలో ఎక్కడా లేవని, దమ్ముంటే బీజేపి పాలిత రాష్ట్రాల్లో తెలంగాణ పథకాలు అమలు చేసి చూపించాలని కోరారు. రెండు కోట్ల ఉద్యోగాలు ఇస్తామని చెప్పి మోసం చేసిన మోడీ ప్రభుత్వానికి రాబోయే రోజుల్లో బుద్ధి చెప్పాలన్నారు. ప్రజల్లో ఉన్న ఆదరణ చూసి ఓర్వలేక ఈడి, ఐటీ దాడులు చేస్తూ బీఆర్ఎస్ నేతలను ఇబ్బందులు పెట్టడమే లక్ష్యంగా కేంద్రం వ్యవహరిస్తోందని అన్నారు. అభివృద్ధి, సంక్షేమంలో దూసుకుపోతున్న మేడ్చల్ నియోజకవర్గంలో మూడోసారి గులాబీ జెండా ఎగరడం ఖాయమన్నారు. పల్లా రాజేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ సీఎం కేసీఆర్ ప్రవేశ పెడుతున్న రైతు సంక్షేమ పథకాల ద్వారా దేశానికి అన్నం పెట్టే స్థాయికి తెలంగాణ రాష్ట్రం ఎదిగిందన్నారు. రాష్ట్రంలో యాసంగిలో రైతులు 50లక్షల ఎకరాలలో వరి ధాన్యం సాగు చేశారన్నారు. ఈ కార్యక్రమంలో జడ్పీ చైర్మెన్ శరత్ చంద్ర రెడ్డి, మాజీ ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి, మల్కాజ్‌గిరి పార్లమెంట్ బీఆర్ఎస్ ఇంఛార్జి మర్రి రాజశేఖర్ రెడ్డి, నియోజకవర్గ బీఆర్ఎస్ ఇంచార్జ్ మహేందర్ రెడ్డి, గ్రంధాలయ సంస్థ జిల్లా చైర్మన్ దయాకర్ రెడ్డి,మార్కెట్ కమిటీ జిల్లా చైర్మెన్ భాస్కర్ యాదవ్, ఎంపీపీ రజిత రాజ మల్లారెడ్డి, జడ్పీటీసీ శైలజ విజయానందా రెడ్డి, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు దయానంద్ యాదవ్, ప్రధాన కార్యదర్శి సుదర్శన్, ఎంపీటీసీలు, సర్పంచ్ లు,వార్డు సభ్యులు, కో-ఆప్షన్ సభ్యులు,గ్రామ స్థాయి అధ్యక్షులు, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

దేశానికి దారి చూపిన నిర్మాత అంబేద్కర్



- విగ్రహావిష్కరణలో కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు

నవతెలంగాణ-బాలానగర్

భారత రాజ్యాంగ నిర్మాత, భారతరత్న డాక్టర్ బీఆర్ అంబేద్కర్ దార్శనికత వల్లనే నేడు దళిత, గిరిజన, బహుజన వర్గాలతోపాటు సకల జనులకు ఆర్థిక, సామాజిక న్యాయం లభించిందని ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు అన్నారు. కూకట్‌పల్లి సర్కిల్ బాలానగర్ డివిజన్ పరిధి లో బుధవారం తెలంగాణ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అంబేద్కర్ విగ్రహాన్ని ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు, కార్పొరేటర్ ఆవుల రవీందర్ రెడ్డి, ఫతేనగర్ డివిజన్ కార్పొరేటర్లతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు మాట్లాడుతూ నేడు దేశంలో మనందరం ఈ విధంగా జీవిస్తున్నామంటే అంబేద్కర్ రచించిన రాజ్యాంగం ఫలాలేనని, నేడు మేము ఎంతో గౌరవప్రదమైన పదవులు పొందడం కూడా ఆయన రాసిన రాజ్యాంగం వల్లనేనని ఆయన అన్నారు. దేశంలోనే అత్యంత ఎత్తైన అంబేద్కర్ కాంస్య విగ్రహాన్ని ముఖ్యమంత్రి కేసీఆర్ ఏర్పాటు చేయడం సంతోషంగా ఉందని, దానికి ముందు బాలానగర్‌లో ఈ విగ్రహాన్ని ఆవిష్కరించడం సంతోషంగా ఉందన్నారు. విగ్రహ దాత సుదీప్ పటేల్‌ను అభినందించారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షులు అదిముల రాము, ప్రధాన కార్యదర్శి ఎస్ కె శ్రీనివాస్, అశోక్ కుమార్, ముఖ్య సలహాదారు నల్ల విల్సన్, కార్యదర్శి ఎస్.కే శ్రీనివాస్, కోశాధికారి మెడి అశోక్, ఎక్సాఫీసియో సభ్యుడు ఎడ్ల ప్రభాకర్, గౌరవ అధ్యక్షులు మహంకాళి శివశంకర్, కార్యనిర్వాహక అధ్యక్షుడు కలమురి శ్రీనివాస్ రావు, మీడియా సెక్రెటరీ చింత నర్సింగ్ రావు, మీడియా ప్రతినిధి రవి స్టీవెన్సన్, సలహాదారులు జెరుపోతుల రవీందర్ రావు, ఫతేనగర్ కార్పొరేటర్ సతీష్‌గౌడ్, ఏన్.వి రత్నం, మల్లిగిరి లక్ష్మీనారాయణ, మదాసు నర్సిం హలు, ఏస్.పి.లక్ష్మణ రావు, ఉపాధ్యక్షులు మహంకాళి సూర్యనారాయణ, రమేష్, దండు రవికుమార్, హెూలియ దాసరి సంక్షేమ సంగం అధ్యక్షులు అదిముల నగేష్, కార్యదర్శి శ్రీకాంత్, ఎక్స్‌ఫీసియో సభ్యుడు ఆదిముల వెంకటేష్, దళిత మహిళ నాయకురాలు ఎడ్ల కవిత, మల్లిగారి భారతి, దీప్తి, సుంకె సరోజ పాల్గొన్నారు.

సంరక్షణ కేంద్రంలో దరఖాస్తు చేసుకోవాలి



నవతెలంగాణ-కుత్బుల్లాపూర్

స్పాన్సర్ షిప్ కొరకు అంగన్వాడి సెంటర్లలో కాకుండా అల్వాల్ బాలల సంరక్షణ కేంద్రంలో దరఖాస్తు చేసుకోవాలని సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి ఉమా మహేష్ తెలిపారు. తల్లిదండ్రులు లేని అనాధలు, తల్లిని లేదా తండ్రిని కోల్పోయిన వారు, అంగవైకల్యం ఉన్న తల్లిదండ్రుల పిల్లలు కేంద్రం నుండి లభించే 4 వేల పారితోషకం కోసం అంగన్వాడీలో దరఖాస్తు చేసుకోవాలని గత రెండు రోజులుగా సోషల్ మీడియాలలో ప్రచారం జరుగుతున్నది. ఇట్టి దరఖాస్తులను అల్వాలలో గల బాలల సంరక్షణ విభాగంలో దరఖాస్తు చేసుకోవాలని ఉమా మహేష్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ప్రజలు తెలియక అంగన్వాడి కేంద్రాలకు వెళితే ఆ సిబ్బందికి ఇంకా వారిపై అధికారుల నుండి ఆదేశాలు లేకపోవడం వల్ల ప్రజలు అయోమయానికి గురవుతున్నారని అన్నారు.



ఆల్విన్ కాలనీ డివిజన్ ఎల్లమ్మబండ పరిధిలోని ఎన్టీఆర్‌నగర్‌కు చెందిన పోచమ్మ (58) అనారోగ్యంతో బాధపడుతూ మృతిచెందింది. విషయం తెలుసుకున్న డివిజన్ కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్ గౌడ్ బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు. డివిజి ట్రస్ట్ ద్వారా 5 వేల రూపాయలు ఆర్థిక సహాయం అందించారు. ఈ కార్యక్రమంలో పోశెట్టిగౌడ్, నాగరాజు, ప్రీతి తదితరులు ఉన్నారు. నవతెలంగాణ-కూకట్‌పల్లి

సామాన్యులకు అందుబాటులో అధికారులు



నవతెలంగాణ-జగద్గిరిగుట్ట

కుత్బుల్లాపూర్, గాజులరామారం జంట సర్కిళ్ల జీహెచ్‌ఎంసీ ఆధ్వర్యంలో బుధవారం రంగారెడ్డి నగర్ డివిజన్ పరిధి గాంధీ నగర్ మహాత్మాగాంధీ కమ్యూనిటీ హాల్‌లో ప్రజలతో ముఖాముఖి కార్యక్రమం నిర్వహించారు. మునిసిపల్, వాటర్ వర్క్స్, శానిటేషన్, ఎలక్ట్రికల్, ఇంజనీరింగ్ శాఖకు చెందిన అధికారులు పాల్గొని ప్రజల నుంచి నేరుగా వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ప్రజలకు అందుబాటులో అధికారులు నిరంతరం పనిచేస్తుంటారని స్థానిక నాయకులు జల్దా లక్ష్మినాథ్ తెలిపారు .ఈ కార్యక్రమంలో నోడల్ అధికారి ఉమా రాణి, వాటర్ వర్క్స్ మేనేజర్ పూజిత, ఎలక్ట్రికల్ ఏ.ఈ శంకర్ నాయక్, కిషోర్, స్థానిక నాయకులు ,కార్తీక్ గౌడ్, నీలగిరి, రాజి రెడ్డి,శ్రీనివాస్,రజాక్,వెంకట సాయి, నవీన్, యేసు రత్నం, పద్మ, ఈశ్వర్, రామ్ దాస్, కష్ణ, సందీప్, సాయి, ఆనంద్, శివ పాల్గొన్నారు.

గ్రంథాలయాల అభివృద్ధే ధ్యేయంగా నిరంతరం కృషి

- జిల్లా గ్రంథాలయ సంస్థ చర్మైన్ దర్గా దయాకర్ రెడ్డి



నవతెలంగాణ-మేడ్చల్

మేడ్చల్ జిల్లాలోని గ్రంథాలయాల అభివృద్ధి ధ్యేయంగా నిరంతరం పనిచేస్తానని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ దర్గా దయాకర్ రెడ్డి అన్నారు. బుధవారం ఆయన మాట్లాడుతూ తాను పదవి బాధ్యతలు చేపట్టిన తర్వాత జిల్లాలోని అన్ని గ్రంథాలయాలను పరిశీలించినట్లు తెలిపారు. జిల్లా వ్యాప్తంగా 18 గ్రంథాలయాలలుండగా.. వాటిలో ఆరు సొంతభవనాల కలిగి ఉన్నా. కొన్ని ఇతర మరమ్మత్తులు చేయాల్సిన అవసరముందని తెలిపారు. మిగతావి ఇతర కమ్యూనిటీ హాళ్లు, దాతల సహకారంతో కొనసాగుతున్నాయని తెలిపారు. జిల్లాలోని అన్ని నియోజకవర్గలలో ప్రజల అవసరాలను దృష్టిలో పెట్టుకుని స్థానిక శాసనసభ్యుల సహకారంతో త్వరలోనే గ్రంథాలయాల నూతన భవనాలు నిర్మించి ప్రజలకు అందుబాటులోకి తీసుకొస్తామని వెల్లడించారు. మేడ్చల్ పట్టణంలోని జిల్లా గ్రంథాలయ భవనాన్ని త్వరలోనే అత్యాధునిక హంగులతో మార్పులు చేయనున్నట్లుగా చెప్పారు. కాంపిటేటివ్ పరీక్షలకు ప్రిపేర్ అయ్యే విద్యార్థులకు గతంలో కంటే మెరుగ్గా రూ.2లక్షల 75వేల పుస్తకాలను కొనుగోలు చేసి అందుబాటులోకి తెచ్చామన్నారు. లైబ్రరీకి వచ్చే పాఠకుల అవసరాలను దష్టిలో పెట్టుకొని వేసవిలో వారికి సరిపడే తాగునీరు, పరిశుభ్రమైన మరుగుదోడ్లు సౌకర్యం కల్పిస్తున్నట్టు తెలిపారు. కాంపిటీటివ్ పరీక్షలను దష్టిలో పెట్టుకొని ప్రభుత్వ సెలవు దినాలలో సైతం జిల్లా గ్రంథాలయ కార్యాలయాన్ని తెరిస్తున్నట్లు వెల్లడించారు.

నర్సింహారెడ్డి ఇంజినీరింగ్ కాలేజీలో విద్యార్థి సంఘం ఏర్పాటు



నవతెలంగాణ-దుండిగల్

మైసమ్మగూడలోని నర్సింహారెడ్డి ఇంజనీరింగ్ కళాశాలలో బుధవారం సివిల్ ఇంజనీరింగ్ విద్యార్థులు నిర్మాణ్ పేరిట విద్యార్థి సంఘాన్ని కళాశాల చైర్మెన్ జక్కుల నరసింహారెడ్డి చేతుల మీదుగా ఏర్పాటు చేశారు. ఈ సంఘానికి అధ్యక్షులుగా అరుణ్ తేజ, ఉపాధ్యక్షులుగా రిషిత, కార్యదర్శిగా ప్రవళిక, కోశాధికారిగా నాగరాజు, సభ్యులుగా సాయిరాజ్, సాయి కృష్ణ, గణేష్, వైష్ణవి, అనితలు ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా చైర్మెన్ మాట్లాడుతూ విద్యార్థులు ఐక్యంగా ఉండటం వల్ల నాయకత్వ లక్షణాలతో పాటు సమస్యలపై పోరాడే తత్వం పెంపొందుతుందన్నారు. ప్రిన్సిపాల్ డాక్టర్ ఆర్.లోకనాథం మాట్లాడుతూ విద్యార్థులందరూ కళాశాల దశ నుంచి తమకు ఎదురయ్యే సమస్యల మీద ఐక్యంగా పోరాడటానికి, నాయకత్వ లక్షణం పెంచుకోవడంతో పాటు విద్యార్థుల్లో దాగి ఉన్న ప్రతిభను వెలికి తీసేందుకు, తమ హక్కుల సాధనకు ఉపయోగపడుతుందన్నారు. ప్రొఫెసర్ రామదాసు మాట్లాడుతూ ఇలాంటి అసోసియేషన్లు ఏర్పాటు చేయడం వల్ల విద్యార్థులకు ఎంతో మేలు జరగడంతో పాటు వారి వికాసానికి తోడ్పడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల చైర్మెన్ జె. నర్సింహారెడ్డి ,కార్యదర్శి జె.త్రిశూల్ రెడ్డి, కోశాధికారి జె. త్రిలోక్ రెడ్డి, డైరెక్టర్ డాక్టర్ ఏ. మోహన్ బాబు, కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఆర్. లోకనాథం, ప్రొఫెసర్ టిఎల్. రామదాసు పలు విభాగాధిపతులు, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

కల్వర్టు త్వరగా పూర్తి చేయండి : మాజీ కార్పొరేటర్



నవతెలంగాణ-కూకట్‌పల్లి

శేర్లింగంపల్లి నియోజకవర్గం వివేకానంద నగర్ డివిజన్ పరిధిలోని సుమారు రూ 80 లక్షల అంచనాతో వడ్డేపల్లి ఎంక్లేవ్ నుంచి మాధవరం నగర్ ప్రధాన రహదారిని(హై టెన్షన్ లైన్) కలుపుతూ పోయే కల్వర్టు పనులు నత్తనడకన జరుగుతున్నాయి. ఈ పనులను ఈఈ గోవర్ధన్, ఏఈ ఆశ లతో కలిసి డివిజన్ మాజీ కార్పొరేటర్ మాధవరం రంగారావు పరిశీలించారు. ఈ సందర్భంగా రంగారావు మాట్లాడుతూ,వీలైనంత తొందరగా నాణ్యతా ప్రమాణాలతో కల్వర్టు పనులను పూర్తి చేసి, కల్వర్టును ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని కోరారు.

రానున్న ఎన్నికల్లో కాంగ్రెస్‌కు అధికారం ఖాయం



నవతెలంగాణ-జగద్గిరిగుట్ట

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల పాలనపై తెలంగాణ రాష్ట్ర ప్రజలు పూర్తిగా విసుగు చెందారని, వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్ అధికారంలోకి రావడం ఖాయమని టీపీసీసీ ప్రతినిధి కొలను హనుమంత్ రెడ్డి ధీమా వ్యక్తం చేశారు. బుధవారం కుత్బుల్లాపూర్ నియోజక వర్గం, రంగారెడ్డి నగర్ డివిజన్, పరిధి ఛత్రపతి శివాజీ విగ్రహం చౌరస్తాలో కాంగ్రెస్ పార్టీ జెండా ఎగురవేసి చెన్నరెడ్డి నగర్, పంచశీల కాలనీల్లో 'గడప గడపకు హాథ్ సే హాథ్ జోడో అభియాన్ యాత్ర(57వ రోజు)చేస్తూ ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అదేవిధంగా కరపత్రాలను అందజేస్తూ బీజేపీ, బీఆర్ఎస్ ప్రభుత్వాల ద్వందనీతిని, అధికారం కోసం మోసపూరిత హామీలతో ప్రజలకు జరిగిన అన్యాయం గురించి వివరిస్తూ.. ప్రజలను చైతన్యవంతులను చేశారు. రానున్న ఎన్నికలలో కాంగ్రెస్ పార్టీని గెలిపించాలని కోరారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే రూ. 500కే గ్యాస్ సిలిండర్, రూ. 5లక్షలతో పేదవాడి సొంతింటి కల నిజం చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో టీపీసీసీ సంయుక్త కార్యదర్శి సువ్వారి శ్రీనివాస్, మేకల ఎల్లయ్య ,ఐ.ఎన్.టి. యూ.సి కార్మిక నాయకులు అమర్ బాబు, మాజీ వార్డు సభ్యులు బి.శివ కుమార్,టి. శ్రీనివాస్, హమ్మి రెడ్డి, గురువా రెడ్డి, శ్యామ్, ఎం.డి అజీమ్ ఉద్దీన్, నిజాముద్దీన్, ప్రవీణ్,రాజ శేఖర్‌రెడ్డి, హరీష్, డోరా అరుణ్, రాంచందర్, గురువారెడ్డి, సతీష్, పుల్లారెడ్డి, భాస్కర్, శ్రీనివాస్, గణేష్, ఎండీ అంజాద్, ఎం.డి నయీ మ్ పాషా, గురుమూర్తి, శివ, రాహుల్, చల్లా, ప్రశాంత్ రెడ్డి, ప్రశాంత్ ముదిరాజ్, మహిళా నాయకు రాళ్లు కౌసల్య, లలిత, యాదమ్మ, గౌసియా, హసీనా, కుమారి పాల్గొన్నారు.

ప్రజా సమస్యలను పరిష్కరించడమే ధ్యేయం



- శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరికెపూడి గాంధీ

నవతెలంగాణ-కేపీహెచ్‌బీ

ప్రతి కాలనీలలో ప్రజల సమస్యలను పరిష్కరించడమే తన ధ్యేయమని శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ అన్నారు. కూకట్ పల్లి సర్కిల్ పరిధిలోని వివేకానంద నగర్, ఆల్విన్ కాలనీ, హైదర్ నగర్, కూకట్‌పల్లి డివిజన్ల పరిధిలో నిర్వహించబోయే 'కాలనీ కాంటాక్ట్' కార్యక్రమంపై బుధవారం వివేకానందనగర్ లోని ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ కార్యాలయంలో కార్పొరేటర్లు జూపల్లి సత్యనారాయణ, నార్నె శ్రీనివాసరావు, మాజీ కార్పొరేటర్ మాధవరం రంగరావు, ఏఎంఓహెచ్ మమత , సంబంధిత అధికారులతో కలిసి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గాంధీ మాట్లాడుతూ ప్రతి కాలనీ, బస్తీ, రెసిడెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్‌లలో గల పలు సమస్యలు పరిష్కారమే ధ్యేయంగా జీహెచ్‌ఎంసీ, వివిధ ప్రభుత్వ అధికారులతో కలిసి ప్రత్యక్షంగా వెళ్లి సమస్యలు తెలుసుకోవాలనే ముఖ్యోద్దేశంతో ఈ కార్యక్రమాన్ని చేపట్టడం జరిగిందన్నారు. ఏప్రిల్ 15వ తేదీ నుండి ప్రారంభించడం జరుగుతుందని తెలిపారు. అన్ని వర్గాల ప్రజలు పాల్గొన్ని ఈ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ప్రాజెక్టు ఆఫీసర్ ఇంద్రసేన , జీహెచ్‌ఎంసీ ఏఈ రాజీవ్, ఆశ, శ్రావణి, ఎంటమాలజీ ఏఈ ఉషారాణి, ఎస్ఆర్పి సత్యనారాయణ, వినయ్ కాంత్ రెడ్డి, బీఆర్ఎస్ పార్టీ నాయకులు దొడ్ల రామ కష్ణ గౌడ్, వర్క్ ఇన్స్పెక్టర్లు మహదేవ్, రవి కుమార్ తదితరులు పాల్గొన్నారు.

విమెన్ ఐపీఎల్ ఆర్సీబీతో హిమాలయా రోజ్ ఫేస్ వాష్ వేడుక

నవతెలంగాణ-హైదరాబాద్

హిమాలయా వెల్నెస్ కంపెనీ, అగ్ర వెల్నెస్ బ్రాండ్, దాని తాజా ప్రాడక్ట్ విడుదలని ప్రకటించింది హిమాలయా నాచురల్ గ్లో రోజ్ ఫేస్ వాష్. విమెన్ ప్రీమియమ్ లీగ్ లో రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు బృందంతో సహకారంతో నడిపిన నాట్రేయిర్ క్యాంపేన్ ద్వారా ఈ విడుదల మద్దతు ఇవ్వబడింది. ఈసందర్భంగా హిమాలయా వెల్నెస్ కంపెనీ బిజినెస్ డైరెక్టర్ రాజేష్ కృష్ణమూర్తి మాట్లాడుతూ... హిమాలయా వద్ద తాము ప్రతి వారి స్వీయ అసమాన అందం కలిగి ఉంటారని, దీనికి వయస్సు, లింగం, లేదా చర్మ వర్ణతో పనిలేదని నమ్ముతామన్నారు.

విమెన్ ప్రీమియమ్ లీగ్లో ఆర్సీబీతో భాగస్వామ్యానికి తాము ఎంతో ఆసక్తిగా ఉన్నామన్నారు. ఫేష్ వాష్ కేటగిరీ మేనేజర్ గాయత్రి కబిలన్ మాట్లాడుతూ... హిమాలయా నాచురల్ రోజ్ ఫేస్ వాష్ సహజమైన రోజాపువ్వు నుండి తీయబడిన, ఇతర చర్మాన్ని ప్రేమించే సామగ్రితో చేయబడిందన్నారు. ఈ నమ్మకమైన ఫేస్ వాష్ పారాబిన్స్, పృథలటెస్, సిలికాన్స్ రహితమన్నారు. రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు హెడ్ అండ్ వైస్ ప్రెసిడెంట్ రాజేష్ మీనన్ మాట్లాడుతూ... ఆర్సీబీ లాగే కలుపుకోవడాని, వైవిధ్యత వంటి మూల విలువలని పంచుకునే హిమాలయాతో భాగస్వాములు కావడానికి తాము ఎంతో ఆనందంగా ఉన్నామన్నారు.

ఏకపక్షంగా నివేదిక!

భారత అగ్రశ్రేణి మల్లయోధులు జంతర్‌మంతర్ వద్ద చేపట్టిన ధర్నాతో క్రీడా రంగంలో కలవరం రేగింది. వినేశ్ ఫోగల్, సాక్షి మాలిక్, అన్షు మాలిక్ సహా బజరంగ్ పూనియా, రవి దహియాలు రెజ్లింగ్ ఫెడరేషన్ అధ్యక్షుడు, బిజెపి ఎంపీ బ్రిజ్‌భూషణ్ శరణ్ సింగ్ ఆగడాలపై గళమెత్తారు. రెజ్లర్ల ఆరోపణలపై కమిటీని నియమించిన క్రీడా మంత్రిత్వ శాఖ.. విచారణ ప్రక్రియ ఏకపక్షంగా, ఓ వ్యక్తికి అనుకూలంగా సాగుతున్నప్పటికీ జోక్యం చేసుకోలేదు. ఆరుగురు సభ్యుల విచారణ కమిటీ ఏకపక్షంగానే నివేదికను తయారు చేసిందని కమిటీలోని ఓ సభ్యుడు విమర్శలు గుప్పించటంతో నివేదిక ప్రామాణికతపై అనుమానం కలుగుతుంది!.



- అభ్యంతరాలు నమోదు చేయలేదు
- ఓ వ్యక్తికి అనుకూలంగా సాక్ష్యాలు
- రెజ్లింగ్ సమాఖ్య విచారణ కమిటీ సభ్యుడు



నవతెలంగాణ-న్యూఢిల్లీ

భారత రెజ్లింగ్ సమాఖ్య (డబ్ల్యూఎఫ్ఐ) అధ్యక్షుడు, బిజెపి ఎంపీ బ్రిజ్‌భూషణ్ శరణ్ సింగ్‌పై మహిళా రెజ్లర్ల లైంగిక ఆరోపణలు, ఫెడరేషన్ నిధుల దుర్వినియోగం పట్ల విచారణకు ఏర్పాటైన కమిటీ.. ఏప్రిల్ 5న కేంద్ర క్రీడా మంత్రిత్వశాఖకు పూర్తి నివేదికను అందజేసింది. జనవరి 23న ఏర్పాటైన విచారణ, పర్యవేక్షణ కమిటీ రెండు నెలలకు పైగా సమయం తీసుకుని నివేదిక తయారు చేసింది. దిగ్గజ బాక్సర్ ఎంసీ మేరీకోమ్ సారథ్యంలోని పర్యవేక్షణ కమిటీ రూపొందించిన నివేదికపై ఇప్పుడు అనుమానాలు రేకెత్తుతున్నాయి. అందుకు కారణం, పర్యవేక్షణ కమిటీలోని ఓ సభ్యుడే విచారణ ప్రక్రియ, ఏకపక్షంగా వాంగ్మూలం నమోదు సహా తదితర అంశాలపై విమర్శలు చేయటం. అధికారికంగా నివేదికలోని అంశాలను క్రీడాశాఖ బయటకు వెల్లడించకముందే, నివేదిక ఏకపక్షంగా తయారు చేశారనే ఆరోపణలు రావటం గమనార్హం.

అభ్యంతరాలతో సంతకం : ఆరుగురు సభ్యుల పర్యవేక్షణ కమిటీ ఏప్రిల్ 5న నివేదికను అందజేసింది. నివేదికపై సభ్యులు అందరూ సంతకం చేయాల్సి ఉంటుంది. సంతకం చేయడానికి ముందు నివేదికలోని పూర్తి అంశాలను చదివేందుకు సభ్యులకు అవకాశం ఇవ్వలేదని ఓ సభ్యుడు ఆరోపించారు. దీంతో అతడు తుది నివేదికపై సంతకం చేస్తూ, తన అభ్యంతరాలను అక్కడ రాసినట్టు వెల్లడించాడు. 'విచారణ నివేదికను క్రీడామంత్రిత్వ శాఖకు సమర్పించడానికి ముందు సభ్యులు సంతకాలు చేయాల్సి ఉంటుంది. అభ్యంతరాలు పేర్కొంటూ నివేదికపై సంతకం చేశాను. నివేదికను పూర్తిగా చదివేందుకు అవకాశం ఇవ్వలేదు. నేను ఆ అంశంపై అభ్యంతరం తెలిపాను. ఏప్రిల్ 5న క్రీడాశాఖకు సమర్పించిన నివేదికలో నేను లేవనెత్తిన అభ్యంతరాలు తొలగించారనే అంశం అర్థమైంది. అభ్యంతరాలు నమోదు చేయాలని కోరినా.. అది జరుగలేదు. దీంతో నా నిరసన వ్యక్తం చేస్తూనే నివేదికపై సంతకం చేశాను' అని ఓ సభ్యుడు తెలిపాడు. ఆరుగురు సభ్యుల పర్యవేక్షణ కమిటీకి ఎంసి మేరీకోమ్ చైర్మెన్‌గా వ్యవహరించారు. టాప్స్ (టార్గెట్ ఒలింపిక్ పోడియం స్కీమ్) మాజీ సీఈవో రాజగోపాలన్, శాయ్ మాజీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ రాధిక, మాజీ బ్యాడ్మింటన్ క్రీడాకారిణి తృప్తి, రెజ్లర్లు యోగేశ్వర్ దత్, బబిత ఫోగట్‌లు సభ్యులుగా ఉన్నారు.

ఓ వ్యక్తికి అనుకూలంగా సాక్షులు : ఇక విచారణ ప్రక్రియపైనా సదరు సభ్యుడు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశాడు. ఓ వ్యక్తికి అనుకూలంగా వాంగ్మూలం ఇచ్చిన వ్యక్తులు ఎటువంటి రుజువులు చూపించలేదు. కమిటీ సైతం వారి నుంచి ఎటువంటి ఆధారాలు సేకరించేందుకు ఆసక్తి చూపలేదు. 'విచారణలో భాగంగా సాక్షుల వాంగ్మూలం వీడియో రికార్డు చేయలేదు. సాక్షుల వాంగ్మూలం కాపీలను సభ్యులతో పంచుకోలేదు. సాక్షుల వాంగ్మూలంపై అటు సాక్షులు, ఇటు సభ్యులు ఎవరూ సంతకం చేయలేదు. సాక్షుల వాంగ్మూలం నిజమా? కాదా? తెలుసుకునే ప్రయత్నం జరుగలేదు. సాక్షులు ఏం చెబితే అదే రాసుకున్నారు. కొందరు సాక్షులు ఓ వ్యక్తికి అనుకూలంగా వాంగ్మూలం ఇచ్చారు. అందుకు సాక్షులకు నజరానాలు ముట్టినట్టు అనిపిస్తుంది!' అని అన్నారు.

విచారణ ప్రక్రియలో అత్యంత కీలకం.. బిజెపి ఎంపీ బ్రిజ్‌భూషణ్ శరణ్ సింగ్ వాంగూల్మం. లైంగిక ఆరోపణల విచారణ సమయంలో బాధితులు, ఆరోపణలు ఎదుర్కొంటున్న వ్యక్తులను వాంగ్మూలాలను న్యాయవాదుల సమక్షంలో నమోదు చేయాలి. లైంగిక ఆరోపణలపై ఫిర్యాదు చేసిన అథ్లెట్ల వాంగ్మూలం న్యాయవాదుల సమక్షంలో తీసుకున్నారు. బ్రిజ్‌భూషణ్ శరణ్ సింగ్ వాంగ్మూలం నమోదు న్యాయవాది లేకుండానే చేశారని వెల్లడించారు.

అంతా ఏకపక్షం : 'కమిటీ సమావేశాల్లో లేవనెత్తిన అభ్యంతరాలను నమోదు చేయలేదు. అభ్యంతరాలను ఎందుకు మీటింగ్ మినిట్స్‌లో రికార్డు చేయలేదని ప్రశ్నిస్తే.. ఆ అంశంపై మరోసారి చర్చిద్దామని దాటవేశారు. ఈ విధంగా నా అభ్యంతరాలను తొక్కిపెట్టారు. నిర్ణయాలు అత్యంత ఏకపక్షంగా తీసుకున్నారు' అని ఆ సభ్యుడు అన్నాడు.

సిఫారసులు ఏవీ? : రెజ్లింగ్ సమాఖ్య చీఫ్ బ్రిజ్‌భూషణ్ శరణ్ సింగ్‌పై లైంగిక ఆరోపణలు, నిధుల దుర్వినియోగంపై విచారణ చేయటంతో పాటు పరిపాలన, ఇతర అంశాల పట్ల రెజ్లర్లు లేవనెత్తిన సమస్యలకు పరిష్కారం చూపేలా సిఫారసులు సైతం చేయటం పర్యవేక్షణ కమిటీ బాధ్యత. కానీ మేరీకోమ్ కమిటీ ఆ విషయాన్ని విస్మరించిందని కమిటీ సభ్యుడు విమర్శించాడు. 'రెజ్లర్లు ఆందోళన సందర్భంగా లేవనెత్తిన ఆరోపణలపై ఎటువంటి సిఫారసులు చేయలేదు. రెజ్లర్ల ఆరోపణలకు మద్దతు లేదా విభేదించేలా ఎటువంటి సూచనలు రాయలేదని' ఆయన అన్నాడు. లైంగిక ఆరోపణలు, నిధుల దుర్వినియోగం సహా రెజ్లర్లకు ప్రయివేట్ స్పాన్సర్‌షిప్‌ల అంశంలో ఫెడరేషన్ పెత్తనం, శిక్షణ వ్యవస్థ ప్రక్షాళన, ఫెడరేషన్‌లో అధ్వాన పరిపాలన, షెడ్యూల్ రెజ్లర్లను ఇబ్బందులు సృష్టించేలా తయారు చేయటం వంటి అంశాలను మల్లయోధులు క్రీడామంత్రి అనురాగ్ ఠాకూర్‌తో సమావేశంలో ప్రస్తావించారు. అయితే, వీటిపై పర్యవేక్షణ కమిటీ నివేదికలో ఎటువంటి ప్రస్తావన లేదని తెలుస్తోంది. పర్యవేక్షణ కమిటీ నివేదికను క్రీడామంత్రిత్వ శాఖ అధికారికంగా వెల్లడించలేదు. నివేదిక బహిర్గతమైతే, విచారణ ప్రక్రియ తీరుపై ఓ అభిప్రాయం రానుంది.

ధోని దంచికొట్టినా..!

- ఉత్కంఠ ఛేదనలో చెన్నై చతికిల
- రాజస్థాన్ రాయల్స్ మెరుపు విజయం



నవతెలంగాణ-చెన్నై

12 బంతుల్లో 40 పరుగులు అవసరం. క్రీజులో ధోని, జడేజా. సూపర్‌కింగ్స్ వైపు మొగ్గు. 19వ ఓవర్లో హెూల్డర్ 19 పరుగులు సమర్పించుకోగా.. చివరి ఓవర్లో 21 పరుగులు కావాలి. తొలి మూడు బంతులకు ధోని 14 పరుగులు పిండుకున్నాడు. మూడు బంతుల్లో 7 పరుగులే కావాలి. ఒత్తిడి సందీప్ శర్మపైనే ఉంది. కండ్లుచెదిరే యార్కర్లు సంధించిన చివరి మూడు బంతులకు ఒక్క బౌండరీ ఇవ్వలేదు. ధోని (32 నాటౌట్, 17 బంతుల్లో 1 ఫోర్, 3 సిక్స్‌లు), జడేజా (25 నాటౌట్, 15 బంతుల్లో 1 ఫోర్, 2 సిక్స్‌లు) మెరిసినా సూపర్‌కింగ్స్ 3 పరుగుల తేడాతో పరాజయం పాలైంది. డెవాన్ కాన్వే (50), రహానె (31) రాణించినా.. ఆరంభం నుంచీ చెన్నై ఇన్నింగ్స్ నెమ్మదిగా సాగింది. చివరి ఓవర్లలో సాధించాల్సిన రన్‌రేట్ భారీగా ఉండటం సూపర్‌కింగ్స్‌పై ప్రభావం చూపింది. రాయల్స్ స్పిన్నర్లు అశ్విన్ (2/25), చాహల్ (2/27) చెన్నైని గట్టి దెబ్బకొట్టారు. ఈ మ్యాచ్‌తో చెన్నైకి సారథిగా ధోని 200వ మ్యాచ్ ఆడాడు. అంతకముందు తొలుత బ్యాటింగ్ చేసిన రాజస్థాన్ రాయల్స్ 20 ఓవర్లలో 8 వికెట్లకు 175 పరుగులు చేసింది. జోశ్ బట్లర్ (52, 36 బంతుల్లో 1 ఫోర్, 3 సిక్స్‌లు) అర్థ సెంచరీతో మెరువగా.. దేవదత్ పడిక్కల్ (38) తొలి పది ఓవర్లలో రాయల్స్ స్కోరును నడిపించారు. జడేజా (2/21) మాయజాలంతో రాయల్స్ జోరు తగ్గినా.. అశ్విన్ (30), హెట్‌మయర్ (30 నాటౌట్) మెరుపులతో రాజస్థాన్ మంచి స్కోరు నమోదు చేసింది.

స్కోరు వివరాలు :

రాజస్థాన్ రాయల్స్ : 175/8 (బట్లర్ 52, పడిక్కల్ 38, హెట్‌మయర్ 30, జడేజా 2/21)

చెన్నై సూపర్‌కింగ్స్ : 172/6 (కాన్వే 50, రహానె 31, ధోని 32, అశ్విన్ 2/25, చాహల్ 2/27)

పసిడి పోరుకు పంగాల్

- కాంస్య పోరుకు మరో ముగ్గురు
- ఆసియా రెజ్లింగ్ చాంపియన్‌షిప్స్

అస్టానా : యువ రెజ్లర్ అంటిమ్ పంగాల్ కౌంటర్ ఎటాకింగ్ ఆటతీరుతో అదరగొట్టింది. ప్రత్యర్థిని ఓ పట్టు పట్టిన పంగాల్ ఆసియా రెజ్లింగ్ చాంపియన్‌షిప్స్ మహిళల 53 కేజీల విభాగంలో ఫైనల్లోకి ప్రవేశించింది. 18 ఏండ్ల పంగాల్ నిరుడు అండర్-20 ప్రపంచ చాంపియన్‌గా నిలిచి ఆ ఘనత సాధించిన తొలి భారత మహిళా రెజ్లర్‌గా చరిత్ర సృష్టించింది. తాజాగా ఆసియా చాంపియన్‌షిప్స్‌లో ప్రత్యర్థులను చిత్తు చేస్తూ పసిడి పోరుకు చేరుకుంది. ఉజ్బెకిస్థాన్ రెజ్లర్‌పై 8-1తో గెలుపొందిన పంగాల్.. హెచ్చరిక రూపంలో మాత్రమే ఓ పాయింట్‌ను ప్రత్యర్థికి కోల్పోవాల్సి వచ్చింది.



లెఫ్ట్ లెగ్ ఎటాక్‌తో టేక్‌డౌన్‌తో దాడి చేసిన పంగాల్..మ్యాట్‌పై పూర్తి ఆధిపత్యం

చూపించింది. జపాన్ రెజ్లర్, 2021 వరల్డ్ చాంపియన్ అకారి పుజినమితో పంగాల్ పసిడి పోరులో పోటీపడనుంది. మనీశ (65 కేజీల విభాగం), రితిక (72 కేజీల విభాగం), సోనమ్ మాలిక్ (62 కేజీల విభాగం)లు నేడు కాంస్య పతక పోరులో తలపడనున్నారు. జపాన్ రెజ్లర్‌తో బౌట్‌లో గాయపడిన అన్షు మాలిక్ 1-5తో తడబడి.. కాంస్య పోరుకు పరిమితమైంది. ఫిట్‌నెస్ సహకరిస్తే కాంస్య పతక మ్యాచ్‌కు అన్షు మ్యాట్‌పై అడుగుపెట్టనుంది. నిశ దహియ (68 కేజీల విభాగం), ప్రియ (76 కేజీల విభాగం) రజత, కాంస్య పతకాలు సాధించిన సంగతి తెలిసిందే.

అగ్రస్థానంలోనే సూర్య

ఐసీసీ టీ20 ర్యాంకింగ్స్



దుబాయ్ : అత్యంత పేలవ ఫామ్, గోల్డెన్ డక్ ఇన్నింగ్స్‌లతో తీవ్ర ఒత్తిడి ఎదుర్కొంటున్న ఆటగాడు సూర్యకుమార్ యాదవ్. ఆస్ట్రేలియాతో వన్డేల్లో మూడు మ్యాచుల్లో తొలి బంతికే అవుటైన సూర్యకుమార్.. తాజాగా ఐపీఎల్‌లో తొలి మూడు మ్యాచుల్లోనూ తేలిపోయాడు. బ్యాటింగ్‌తో పాటు ఫీల్డింగ్‌లోనూ సూర్య నిరాశపరిస్తున్నాడు. ఫామ్ కోల్పోయినా ఐసీసీ టీ20 ర్యాంకింగ్స్‌లో అగ్రస్థానం మాత్రం సూర్య అట్టిపెట్టుకున్నాడు. 906 రేటింగ్ పాయింట్లతో సూర్య వరల్డ్ నం.1గా కొనసాగుతుండగా.. మహ్మద్ రిజ్వాన్ (811), బాబర్ ఆజామ్ (755), ఎడెన్ మార్క్‌రం (748), డెవాన్ కాన్వే (745) టాప్-5లో నిలిచారు. విరాట్ కోహ్లి 15వ స్థానం నిలుపుకున్నాడు. బౌలర్ల జాబితాలో రషీద్ ఖాన్ అగ్రస్థానంలో నిలిచాడు.

కొందరికి శాశ్వత నివాసంగా ఎన్‌సీఏ!



ముంబయి : భారత క్రికెటర్ల గాయాల నిర్వహణ పట్ల మాజీ చీఫ్ కోచ్ రవిశాస్త్రి విమర్శలు గుప్పించారు. కొందరు ఆటగాళ్లకు జాతీయ క్రికెట్ అకాడమీ (ఎన్‌సీఏ) శాశ్వత నివాసంగా మారిందని అన్నాడు. 'గత 3-4 ఏండ్ల నుంచి కొందరు క్రికెటర్లు ఎన్‌సీఏను శాశ్వత నివాసంగా చేసుకున్నారు. ఇది ఏమాత్రం మంచి పరిణామం కాదు. గాయాల బారిన ఆటగాళ్లెవరూ వరుసగా నాలుగు మ్యాచ్‌లు ఆడింది లేదు. ఎందుకు పదేపదే గాయాలు, ఎందుకు మళ్లీ ఎన్‌సీఏ బాట పట్టడం? రీ ఎంట్రీలో మూడు మ్యాచులు ఆడటం వెంటనే ఎన్‌సీఏకు వెళ్లటం సాధారణమైంది' అని రవిశాస్త్రి వ్యంగ్యాస్త్రాలు సంధించాడు. చీటికిమాటికి ఆటగాళ్లకు గాయాలు కావటం బోర్డు, ఐపీఎల్ జట్లకు, కెప్టెన్లకు ఎంతో చికాకు కలిగిస్తోందని శాస్త్రి అన్నాడు.

నవచిత్రం



కావ్యా కళ్యాణ్ రామ్, శ్రీ సింహ కోడూరి

ఉస్తాద్ టీజర్ అదుర్స్

శ్రీసింహ కోడూరి, కావ్యా కళ్యాణ్ రామ్ హీరో, హీరోయిన్లుగా వారాహి చలనచిత్రం, క్రిషి ఎంటర్‌టైన్‌మెంట్స్ బ్యానర్స్‌పై ఫణిదీప్ దర్శకత్వంలో రజినీ కొర్రపాటి, రాకేష్ రెడ్డి గడ్డం, హిమాంక్ రెడ్డి దువ్వూరు నిర్మిస్తున్న చిత్రం 'ఉస్తాద్'. ఈ సినిమా టీజర్‌ను బుధవారం రానా దగ్గుబాటి రిలీజ్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, 'టీజర్ చాలా ఇంట్రెస్టింగ్‌గా ఉంది. అందరూ మంచి సినిమా చేసుంటారని అనుకుంటున్నాను. పవన్ కళ్యాణ్ టైటిల్ లాంటిదే ఓ మోటర్ బైక్‌కి పెట్టాశాడంటే డైరెక్టర్ ఫణిదీప్ గట్స్ వేరే లెవల్ అని అర్థమవుతుంది' అని తెలిపారు. 'ఈ సినిమాలో హీరోకి బైక్ ఎలాగైతే ఉస్తాద్ అయ్యిందో నాకు కూడా అలాగే అయ్యింది. ఎందుకంటే నాకు బైక్ సరిగా రాదు. షూటింగ్ సమయంలోనే బాగా నేర్చుకున్నాను. చాలా మంచి జ్ఞాపకాలున్నాయి. టీజర్ అందరికీ నచ్చే ఉంటుందని భావిస్తున్నాను' అని హీరో శ్రీసింహ అన్నారు.

నిర్మాత రాకేష్ రెడ్డి మాట్లాడుతూ, 'టీజర్‌లో మీరు చూసింది చాలా చిన్నది. సినిమా చాలా పెద్ద రేంజ్‌లో ఉంటుంది. సాయికొర్రపాటికి థ్యాంక్స్. ఆయనిచ్చిన భరోసాతోనే ఈరోజు ఇలా నిలబడ్డాం' అని చెప్పారు.

సమ్మర్ స్పెషల్‌గా రామబాణం

గోపీచంద్, దర్శకుడు శ్రీవాస్ కాంబినేషన్‌లో వస్తున్న మూడో చిత్రం 'రామబాణం'. పీపుల్ మీడియా ఫ్యాక్టరీ పతాకంపై టీజీ విశ్వ ప్రసాద్ ఈ చిత్రాన్ని అత్యంత భారీ బడ్జెట్‌తో రూపొందిస్తున్నారు. వివేక్ కూచిభొట్ల సహ నిర్మాత. యాక్షన్ అంశాలతో కూడిన ఫ్యామిలీ ఎంటర్‌టైనర్‌గా రూపొందుతున్న 'రామబాణం' గ్లింప్స్, ఫస్ట్ సింగిల్ 'ఐఫోన్ సాంగ్'కి ట్రెమండస్ రెస్పాన్స్ వచ్చింది. తాజాగా ఈ చిత్రం నుంచి సెకండ్ సింగిల్ 'దరువెయ్యరా..' పాటని ఈనెల 14న కర్నూల్ అవుట్ డోర్ స్టేడియంలో జరిగే గ్రాండ్ ఈవెంట్‌లో లాంచ్ చేయనున్నట్టు మేకర్స్ అనౌన్స్ చేశారు. గోపిచంద్, డింపుల్ హయాతీ పండగ వాతావరణంలో సంప్రదాయ దుస్తులలో గ్రేస్‌ఫుల్‌గా డ్యాన్స్ చేస్తున్న పోస్టర్ అందర్నీ ఆకట్టుకుంటోంది. సమ్మర్ కానుకగా మే 5న ఈ సినిమా ప్రపంచ వ్యాప్తంగా ప్రేక్షకుల ముందుకు రానుంది. జగపతిబాబు, ఖుష్బు ముఖ్య తారాగణంగా నటిస్తున్న ఈ చిత్రంలో సచిన్ ఖేడేకర్, నాజర్, అలీ, రాజా రవీంద్ర, వెన్నెల కిషోర్, సప్తగిరి, కాశీ విశ్వనాథ్, సత్య, గెటప్ శ్రీను, సమీర్, తరుణ్ అరోరా తదితరులు ఇతర పాత్రల్లో కనిపించనున్నారు. ఈ చిత్రానికి సంగీతం: మిక్కీ జె మేయర్, డీవోపీ: వెట్రి పళనిసామి, ఎడిటర్: ప్రవీణ్ పూడి, కథ: భూపతి రాజా.



గోపీచంద్, డింపుల్ హయాతి

ఈ తరానికీ కనెక్ట్ అయ్యే ప్రేమకథ



గుణశేఖర్

అప్పటి ప్రేమగాథే అయినప్పటికీ ఇప్పటి తరానికి కూడా 'శాకుంతలం' బాగా కనెక్ట్ అవుతుంది' అని దర్శకుడు గుణశేఖర్ చెప్పారు. సమంత ప్రధాన పాత్రధారిణిగా ఆయన తెరకెక్కించిన చిత్రం 'శాకుంతలం'. శ్రీ వెంకటేశ్వరక్రియేషన్స్ దిల్ రాజు సమర్పణలో గుణ టీమ్ వర్క్స్ బ్యానర్‌పై నీలిమ గుణ ఈ పాన్ ఇండియా చిత్రాన్ని నిర్మించారు. త్రీడీ టెక్నాలజీతో తెలుగు, హిందీ, తమిళ, హిందీ, మలయాళ భాషల్లో శాకుంతలం సినిమా ప్రేక్షకులను అలరించనుంది. ఈ సినిమా ఈనెల 14న విడుదల కానుంది.

ఈ నేపథ్యంలో దర్శకుడు గుణశేఖర్ ఈసినిమా విశేషాలను మీడియాతో షేర్ చేసుకున్నారు. 'హిరణ్యకశ్యప' కోసం ఐదేండ్లు పనిచేశా. కరోనా కారణంగా ఆ ప్రాజెక్ట్ ఆగిపోయింది. అప్పుడు ఓ మంచి ప్రేమకథని ప్రేక్షకుల ముందుకు తీసుకురావాలని డిసైడ్ అయ్యా. మహాభారతంలోని అద్భుతమైన ప్రేమ కథగా మనం చెప్పుకునే దుష్యంత, శకుంతల ప్రేమగాథను మహా కవి కాళిదాసు అభిజ్ఞాన శాకుంతలం కావ్యంగా రాశారు. దాన్ని ఆధారంగా చేసుకుని విజువల్ వండర్‌గా ప్రజెంట్ చేశాను. ఇప్పటికే సినిమాపై భారీ అంచనాలున్నాయి. శాకుంతలంగా సమంత అందం, అమాయకత్వం కలగలిపిన నటన, దుష్యంత మహారాజుగా దేవ్ మోహన్ లుక్.. వారి మధ్య ప్రేమ సన్నివేశాలు, భావోద్వేగ ప్రయాణం ఎంత హృద్యంగా ఉంటుంది. అలాగే యాక్షన్ సన్నివేశాలు కూడా వావ్ అనిపించేలా ఉంటాయి. దుర్వాస మహామునిగా మోహన్ బాబు.. చిన్ననాటి భరతుడి పాత్రలో అల్లు అర్జున్ కుమార్తె అల్లు అర్హ ఇలా ప్రతీ అంశం ప్రేక్షకులను కట్టి పడేస్తుంది' అని తెలిపారు.

సంజయ్‌దత్‌కి గాయాలు



బాలీవుడ్ కథానాయకుడు సంజయ్ దత్ షూటింగ్‌లో గాయపడ్డారు. ప్రస్తుతం ఆయన కన్నడ చిత్రం 'కేడీ: ద డెవిల్'లో నటిస్తున్నారు. అర్జున్ మేనల్లుడు ధ్రువ సర్జా హీరోగా నటిస్తున్న ఈ సినిమా షూటింగ్ బెంగళూరులో జరుగుతోంది. బుధవారం ఓ యాక్షన్ సీన్‌ను షూట్ చేస్తున్నప్పుడు సంజయ్ దత్ ముఖం, చేతులకు గాయలైనట్టు సమాచారం. దర్శకుడు ప్రేమ్ ఈ చిత్రాన్ని తెరకెక్కిస్తున్నారు.

చెల్లి వినవే.. నా తల్లీ వినవే..

'బిచ్చగాడు'తో కెరీర్ బెస్ట్ హిట్ అందుకున్నారు హీరో విజయ్ ఆంటోనీ. తెలుగులోనూ ఈ చిత్రం చాలా పెద్ద విజయం సాధించింది. ఆ చిత్రానికి సీక్వెల్‌గా స్వీయ దర్శకత్వంలో 'బిచ్చగాడు-2'తో ఆయన త్వరలోనే ప్రేక్షకుల ముందుకు వస్తున్నారు. ఇటీవల ఈ సినిమా నుంచి రిలీజ్ చేసిన ఫస్ట్ లిరికల్ సాంగ్‌కు అద్భుతమైన స్పందన వచ్చింది. లేటెస్ట్‌గా ఈ మూవీ నుంచి సెకండ్ సాంగ్‌ను చిత్ర బృందం విడుదల చేసింది.

'చెల్లి వినవే.. నా తల్లీ వినవే.. నీ అన్నను కానూ



అమ్మను నేను.. చిట్టీ వినవే.. నా బుజ్జీ కనవే.. నీ పుట్టూ మచ్చై ఉంటా తోడూ' అంటూ సాగే ఈ గీతాన్ని భాష్య శ్రీ రాయగా, అనురాగ్ కులకర్ణి ఆలపించారు. సంగీతం విజయ్ ఆంటోనీ అందించారు. అనాథలైన హీరో, అతని సోదరి చిన్నతనంలో అనుభవించిన కష్టాలు, సమస్యల నేపథ్యంలో సాగిన ఈ పాట సినిమాలో హైలెట్ సాంగ్‌లానూ కనిపిస్తోంది. ప్రతి ఒక్కరినీ కదిలించేలా పూర్తి ఎమోషనల్ టచ్‌తో ఉంది. విజయ్ ట్యూన్‌ను అద్భుతమైన గాత్రంతో ప్రాణం పోశాడు అనురాగ్ కులకర్ణి. ఇప్పటికే సినిమాపై భారీ అంచనాలుండటంతో ఈ సమ్మర్‌కు మంచి రిజల్ట్ అందుకుంటుందనే దీమాని మేకర్స్ వ్యక్తం చేస్తున్నారు. విజయ్ ఆంటోనీ ఈ చిత్రంలో హీరోగానే కాక ఎడిటింగ్, మ్యూజిక్‌ను కూడా అందిస్తున్నారు. అలాగే తన సొంత బ్యానర్ విజయ్ ఆంటోనీ ఫిల్మ్ కార్పోరేషన్‌లో నిర్మితమైన ఈ చిత్రానికి దర్శకుడు కూడా ఆయనే. విజయ్ ఆంటోని సరసన కావ్య థాపర్ కథానాయికగా నటిస్తోంది.

నచ్చితే 10 మందికి చెప్పండి..

అవుట్ స్టాండింగ్ సినిమా ప్రొడక్షన్స్ పతాకంపై శ్రీకాంత్ చౌటపల్లి, పవిత్ర నారాయణ్ హీరో, హీరోయిన్‌గా నటించిన చిత్రం '10 రూపీస్'. వంశీకృష్ణ కన్నెగంటి సహ నిర్మాతగా ఆఫ్జాల్ దర్శకత్వంలో తెరకెక్కిన ఈ చిత్రం ఈనెల 21న విడుదలకు సిద్ధంగా ఉంది.



శ్రీకాంత్ చౌటపల్లి

ఈ సందర్భంగా చిత్ర బృందం నిర్వహించిన ప్రీ రిలీజ్ వేడుకలో దర్శకుడు ఆఫ్జెల్ మాట్లాడుతూ, 'సినిమా చాలా బాగా వచ్చింది. ఈనెల 21న విడుదల అవుతుంది. సినిమా నచ్చితే 10 మందికి బాగుంది అని చెప్పండి. మా హీరో శ్రీకాంత్ చాలా అంకిత భావంతో పని చేసాడు. హీరోయిన్ పవిత్ర నారాయణ అద్భుతంగా నటించింది. మా చిత్రంలో పాటలు లేవు. 2 గంటల చిత్రానికి అద్భుతమైన బ్యాక్‌గ్రౌండ్ స్కోర్ ఇచ్చారు మ్యూజిక్ డైరెక్టర్ వంశీకాంత్ రేఖానా. టీజర్, ట్రైలర్‌కి అద్భుతమైన స్పందన వచ్చింది. డిస్ట్రిబ్యూటర్ గణేష్ మా సినిమాని చూసి నైజాం అంతటా రిలీజ్ చేస్తున్నారు. నాకు తల్లాడ సాయికృష్ణ తన వంతుగా సహాయం అందిస్తున్నారు' అని తెలిపారు. 'ఈ సినిమాకి అందరం ప్రాణం పెట్టి పని చేశాం. సినిమా అందరికీ నచ్చుతుందని ఆశిస్తున్నాం. ఈ సినిమా తర్వాత నాకు మరిన్ని అవకాశాలు వస్తాయని ఆశిస్తున్నాను' అని హీరో శ్రీకాంత్ చౌటపల్లి అన్నారు. కో ప్రొడ్యూసర్ వంశి కృష్ణ కన్నెగంటి మాట్లాడుతూ, 'దర్శకుడు ఆఫ్జాల్ అద్భుతంగా తెరకెక్కించాడు. ఈ చిత్రంలో చివరి 45 నిమిషాలు వేరే లెవెల్‌లో ఉంటుంది' అని అన్నారు.

నిజ జీవితాలకు దగ్గరగా..

గౌరీశ్ యేలేటి, రోషిణి, ప్రాచీ ఠక్కర్ హీరో, హీరోయిన్లుగా ఎటిర్నిటి ఎంటర్‌టైన్‌మెంట్, అహం అస్మి ఫిల్మ్స్ బ్యానర్లపై నటించిన చిత్రం 'ఓ కల'. దీపక్ కొలిపాక దర్శకత్వంలో లక్ష్మీ నవ్య మోటూరు, రంజిత్ కుమార్ కొడాలి ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. నేటి (గురువారం) నుంచి ఈ చిత్రం డిస్నీ ప్లస్ హాట్ స్టార్‌లో స్ట్రీమింగ్ కానుంది. ఈ సందర్భంగా దర్శకుడు దీపక్ కొలిపాక మాట్లాడుతూ,'ఇదొక సోషియో లవ్ డ్రామా. ఈ చిత్రంలోని సన్నివేశాలు చాలా మంది నిజ జీవితాలకు దగ్గరగా ఉంటాయి. ప్రతిఒక్కరికీ ఈ చిత్రం గుర్తుండి పోతుంది. ఇలాంటి కథతో ఈ మధ్యకాలంలో ఏ సినిమా రాలేదు. ఇది తప్పకుండా ప్రేక్షకులను అలరిస్తుందనే నమ్మకంతో ఉన్నాం' అని తెలిపారు. 'నిర్మాతగా ఇది నా మొదటి చిత్రం. రెండవ చిత్రం కూడా షూటింగ్ పూర్తయి, విడుదలకి సిద్ధంగా ఉంది. ఓ మంచి కథతో ఈ సినిమా చేశాం. సినిమా అవుట్‌పుట్ బాగా వచ్చింది' అని నిర్మాత మహేష్ అన్నారు.

హీరో గౌరీశ్ మాట్లాడుతూ, 'చిన్నపిల్లలతో సహా ప్రతి ఒక్కరూ ఎంజాయ్ చేసే చిత్రమిది. అందరూ మా సినిమాని చూసి ఆదరించాలని కోరుకుంటున్నాను' అని చెప్పారు. 'ఇదొక గొప్ప రైడ్ లాంటి చిత్రం. నేను షూటింగ్ సమయంలో ఎంతగా ఆనందపడ్డానో సినిమా చూసేటప్పుడు మీరు కూడా అంతే ఎంజాయ్ చేస్తారు' అని హీరోయిన్ రోషిణి చెప్పారు.



రోషిణి, గౌరీశ్ యేలేటి

Printed and Published by Nandayala Narsimha Reddy On behalf Of Navatelangna Printers Private Limited, Printed At M.H Bhavan, 1st Floor, Plot No. 21/1, Azamabad Near Rtc Kalyana Mandapam, Baghlingampally, Hyderabad-500020,Telangana State,
Published at Navatelangana Printers Private Limited, M.H Bhavan,1st Floor No.21/1, Azamabad, Near Rtc Kalyana Mandapam, Baghlingampally, Hyderabad-500020, Telangana State, Editor : R.Sudha Bhaskar TELTEL/2014/59462.